thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు
సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 336 | కరీంనగర్ మంగళవారం, 11 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## క్యాన్సర్‌కు హైడ్రోజెల్ చికిత్స

న్యూఢిల్లీ : ఐఐటీ గువాహటికి చెందిన పరిశోధకులు క్యాన్సర్‌కు ఓ వినూత్న చికిత్సను అభివృద్ధిపరిచారు. క్యాన్సర్ సోకిన భాగంలోకి ఒక హైడ్రోజెల్‌ను పంపించటం ద్వారా ఈ చికిత్స అందిస్తారు. దీనివల్ల ప్రస్తుతం కీమోథెరపీ వంటి క్యాన్సర్ చికిత్సల కారణంగా తలెత్తే దుష్పరిణామాలు ఉండవని, ఇది సురక్షితమైనదని పరిశోధకులు వెల్లడించారు. కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన ఈ పరిశోధన తాలూకు వివరాలు.. రాయల్ సొసైటీ కెమిస్ట్రీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఐఐటీ గువాహటి రసాయనశాస్త్రం విభాగానికి చెంది న ప్రొఫెసర్ దేబప్రతిమ్‌దాస్ ఈ పరిశోధన గురించి వెల్లడిస్తూ.. 'అంతర్గత అవయవాలకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఆ అవయవాలను శస్త్రచికిత్స చేసి తొలగించటం కుదరదు. అలాగే, కీమోథెరపీ వల్ల క్యాన్సర్ కణాలతోపాటు ఆరోగ్య కణాలు కూడా దెబ్బతింటాయి.

# నేషనల్ పార్క్ మందుపాతరకు ప్రతీకారం తీర్చుకున్న సైనికులు..!!




## - అదే నేషనల్ పార్క్ సమీపంలోనే భారీ ఎన్కౌంటర్
## - 31 మంది మావోయిస్టులు మృతి
## - అందులో 11 మంది మహిళలు మృతి
## - ఆకాశమార్గాన ఆపరేషన్, నేలపై వేలాదిగా సైనికులతో జల్లెడ..

బజపూం నుండ చురకలు ప్రధాన ప్రతినిధి : చతిస్గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియాలో గత నెలలో మావోయిస్టులు పేల్చిన మందు పాతరలో పదిమంది సైనికులు మరణించింది విధితమే. అదే నేషనల్ పార్క్ ఏరియా సమీపంలోనే ఛత్తీస్‌గఢ్ పోలీసులు కేంద్ర సైనిక బలగాలు సంయుక్తంగా భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులను హతం చేశారు. ఏడాదికాలంగా వరుసగా సైనికులదే పనిచేయవుతున్న ఛత్తీస్గడ్ లో నేషనల్ పార్క్ ఏరియా లో జరిగిన మందు పాత్రలో 10 మంది పోలీసులు మరణించిన సంఘటనకు ప్రతీకారంగా అదే ఏరియా నుండి 31 మందిని మట్టుపెట్టి సైనికులు తన ప్రతికారం తీర్చుకున్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో బుచ్చన్న దళం సంచరిస్తున్న సమాచారం ఆకాశమార్గాన కనిపెట్టి 3వేలకు ముందుగా పోలీసు బలగాలు చుట్టుముట్టి మావోయిస్టు పార్టీ సభ్యులపై తల వర్షం కురిపించి చంపారు. ఆ సంఘటనలో ఇద్దరు జవాన్లు సైతం ప్రాణాలు ఇంకాపలువురు గాయపడ్డారు. ఈ ఘటనలోనే ఇద్దురు సైనికులు ఇద్దరు జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోయిన సంఘటన పట్ల కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పందించారు.మరో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. ఎన్కౌంటర్లో మరణించిన 31 మంది మావోయిస్టులతో పాటు ఇద్దరి సైనికుల మృతదేహాలను బీజాపూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేంద్ర పోలీసు బలగాలు అధునాతనమైన టెక్నాలజీతో ఆకాశమార్గాను నక్సలైట్ల కదలికను కనిపెట్టి చుట్టుముట్టి పెద్ద ఎత్తున హతమరుస్తున్న సంఘటనలు వరుసగా జనవరి ఒకటో మొదలైన ఎన్కౌంటర్ల పరంపర ఫిబ్రవరి 9 నాటికి 40 రోజుల్లో సుమారు 90 మందిని హతమార్చిన రికార్డు ఛత్తీస్గడ్ సర్కార్ సొంతం చేసుకున్నది. సోమవారం నాటి వరకు మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకుడు పుంగన్న, బుచ్చన్నలు మరణించినట్లు ధ్రువీకరించారు. మిగిలినమావోయిస్టుల కోసం డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బృందాలు గాలింపు కొనసాగిస్తున్నారు.పశ్చిమ బస్తర్ ప్రాంతంలో శుక్రవారం మావోయిస్టుల కదలికలకు సంబంధించి భద్రతా దళాలకు కీలక సమాచారం అందింది. దీంతో బీజాపుర్ జిల్లాలోని ఇంద్రావతీ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఆదివారం భద్రతా బలగాలు యాంటీ మావోయిస్టు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజన్ వివరాలు వెల్లడించారు . వీరికి సంబంధించిన ఫోటోలను ఐజి సుందర్ రాజన్ విడుదల చేశారు.భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మరణించినట్లు ధ్రువీకరించారు.ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే రెండో భారీ ఎన్‌కౌంటర్‌గా దీన్ని పేర్కొంటున్నారు. గతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 41 మంది మావోయిస్టులు మృతి చెందారు. **(మిగతా 3వ పేజీలో)**

## కొత్త సీఎం పేరు ఎంపిక చేసే పనిలో బీజేపీ హైకమాండ్ కుస్తీ.. ముగ్గురిలో కిరీటం ఎవరికి దక్కేనో..?




భారతీయ జనతా పార్టీకి దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత దక్కిన విజయం ఢిల్లీ పీఠం. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఢిల్లీలో జెండా ఎగురవేసింది. అయితే ఇప్పుడు హాట్ టాపిక్ ఏమిటంటే ఢిల్లీకి కాబోయే ముఖ్యమంత్రి ఎవరూ అనే టాపిక్ అందరిలో ఉత్కంఠగా మారింది. ఫలితాల తర్వాత కేవలం పర్వేష్ వర్మ పేరు బాగా వినిపించింది. ఈయన ఆప్ అధ్యక్షుడు, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ని ఓడించడంతో అందరి చూపు ఈనేతపైనే పడింది. కాని బీజేపీ అధిష్టానం వరుసగా రాష్ట్రాల్లో గెలుస్తున్న ట్రెండ్‌ని దృష్టిలో పెట్టుకొని సీఎం అభ్యర్ధి ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఇప్పుడు ఢిల్లీ సీఎం రేసులో పర్వేష్ వర్మతో పాటు మరో ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మనోజ్ తివారీ, షికా రాయ్, మజీంజర్ సింగ్ సిర్సా పేరు కూడా తెరపైకి వచ్చింది.

**ఢిల్లీకా సుల్తాన్ కౌన్ హై..** 27ఏళ్ల తర్వాత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కమలం వికసించింది. మునుపెన్నడు లేని విధంగా హస్తినలో భారతీయ జనతా పార్టీ జెండా రెపరెపలాడింది. 48 మంది ఎమ్మెల్యేలతో ఢిల్లీలో విజయ పతాకం ఎగురవేసింది. ఇంత ఘనవిజయం తర్వాత బీజేపీ అధిష్టానానికి అక్కడ సీఎంగా ఎవర్ని నియమిస్తే బాగుంటుందనే ఆలోచనలో పడింది. దేశ రాజధాని, కీలక రాష్ట్రంగా ఉన్న ఢిల్లీ పగ్గాలను సమర్ధవంతమైన నేత చేతికి అప్పగించాలని భావిస్తోంది. అందులో భాగంగానే పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరీ ముఖ్యంగా మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేష్ వర్మ పేరు మొదట్నుంచి వినిపిస్తున్నప్పటికి బీజేపీ అధినాయకత్వం దీనిపై వర్కవుట్ చేస్తోంది.

**కొత్త వ్యక్తి వచ్చేనా..** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సమయం నుంచి బీజేపీ గెలిస్తే సీఎంగా ఎవరు ఉంటారనే ప్రశ్నలు వచ్చాయి. ఇప్పుడు కూడా ఢిల్లీ ముఖ్యమంత్రిగా 5 సంవత్సరాలు ఎవరు ఉంటారు? అనే చర్చ జరుగుతోంది. చాలా పేర్లు చర్చలో ఉన్నాయి, కానీ ఇప్పుడే ఊహాగానాలు చేయడం సరైనది కాదు. ఇటీవలి ఎన్నికల ట్రెండ్‌లను పరిశీలిస్తే, బిజెపి హైకమాండ్ రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎక్కడా లేని వ్యక్తిని చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. రాజకీయ పండితులు కూడా దీనిని అంచనా వేయలేకపోయారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ ఎన్నికలలో బిజెపి అనుసరించిన ఉదాహరణను బట్టి చూస్తే, అది ఎన్నికైన ఏ ఎమ్మెల్యేనైనా ముఖ్యమంత్రిని చేయవచ్చు అని అర్థమవుతోంది.

**సామాజిక సమీకరణలు బేరీజు వేసుకొని..** ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరో మాకు తెలియజేయండి? రేసులో ఎవరు ఉన్నారు, ఎవరి పేరు చర్చనీయాంశమవుతోంది? బిజెపి హైకమాండ్ ముఖ్యమంత్రి పదవి ద్వారా పూర్వాంచల్, జాట్లు లేదా సిక్కుల నుండి ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంది. ఏది ఏమైనా, ఏమి జరిగినా, త్వరలోనే ఈ రహస్యం తొలగిపోతుంది. ఢిల్లీ ప్రజలకు కొత్త ముఖ్యమంత్రి వస్తారు.

**ప్రమాణస్వీకారానికి అప్పుడే ముహూర్తం..** ఇక ఇప్పటి వరకు ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అతిషి కూడా ఆదివారం సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆమె ఎమ్మెల్యేగా గెలిచారు. ఢిల్లీ సీఎం అభ్యర్థి పేరు ఖరారు కాగానే ప్రమాణస్వీకారానికి ముహూర్తం కూడా ఫిక్స్ చేస్తారని తెలుస్తోంది.

## క్రిమినల్ కేసులుంటే ఉద్యోగానికే అనర్హులు..
### అలాంటిది ప్రజాప్రతినిధులుగా అర్హులెలా?: సుప్రీంకోర్టు



దిల్లీ: ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం నేడు విచారణ జరిపింది.

అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42 మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని.. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవన్నారు. నిందితులు ఏళ్లుగా విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం జాప్యానికి మరో కారణమని నివేదికలో పొందుపరిచారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరేందుకే అనర్హులని.. అలాంటిది ప్రజాప్రతినిధులుగా ఎలా అర్హులవుతారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని.. దానికి అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది.

# 24 రోజుల్లో చరిత్ర సృష్టించిన
# మహా కుంభమేళ!
## ఇప్పటి వరకు 41 లక్షల మంది పుణ్యస్నానాలు!!




ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళ చరిత్ర సృష్టించింది. కేవలం 24 రోజుల్లో ప్రపంచ చరిత్రలో ఉన్న అన్ని రికార్డులను తిరగరాసింది.

144 సంవత్సరాలకు ఒకసారి వచ్చిన ఈ మహా కుంభమేళ జనవరి 13న ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఈ కుంభమేళకు అన్ని రాష్ట్రాలు, ప్రధాన నగరాల నుంచి ప్రతి రోజు ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. దీంతో కుంభమేళకు వెళ్లే వారి సంఖ్య అనుకున్న దానికంటే అధికంగా పెరిగింది. అయితే గతంలో జరిగిన ఈ కుంభమేళకు దాదాపు 20 కోట్లకు పైగా ప్రజలు వెళ్లారు.

కాగా ఈ సంవత్సరం మహా కుంభమేళ కావడంతో దాదాపు 40 నుంచి 50 కోట్ల మంది ప్రజలు ప్రయాగ్ రాజ్ చేరుకొని పవిత్ర స్నానాలు చేస్తారని స్థానిక యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. దీనికి తగ్గట్టుగానే భారీ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ప్రయాగ్ రాజ్ పరిసర ప్రాంతంలో యూపీ ప్రభుత్వం.. ప్రపంచంలోనే అతిపెద్ద టెంట్ సిటీని నిర్మించింది.

దీంతో ప్రతి రోజు లక్షల సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకొని పవిత్ర స్నానాలు చేస్తున్నారు. కాగా నేటి ఉదయానికి కుంభమేళ ప్రారంభమై 24 రోజులు అవుతుంది. అయితే ఈ 24 రోజుల్లో 41 కోట్ల మంది ప్రజలు పవిత్ర స్నానాలు చేసినట్లు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అత్యధికంగా మౌని అమావాస్య ఒక్క రోజు 15 కోట్ల మంది ప్రజలు పవిత్ర స్నానాలు చేశారు. అలాగే పంచమి సందర్భంగా 2 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. కుంభమేళ మరో 16 రోజులు కొనసాగనుండగా.. చివరి రోజు ఫిబ్రవరి 26న మహాశివరాత్రి సందర్భంగా.. మరో 5 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కుంభమేళ ముగిసే సమయానికి మొత్తం సంఖ్య 55 కోట్లకు పైగా చేరుకునే అవకాశం కనిపిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మహా కుంభమేళ కోసం యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లను చేసింది. మొత్తం మూడు షిఫ్టుల్లో అన్ని యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా పోలీస్, పారిశుధ్య వ్యవస్థ ఈ కుంభమేళలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఓ అంచనా ప్రకారం కుంభమేళలో ప్రతి రోజు అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 3 లక్షల మంది పని చేస్తున్నట్లు తెలుస్తోంది.



# భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంలో విచారణ

దిల్లీ: భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఇవాళ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పీకర్ నుంచి సమాచారం కోసం మరింత సమయం కావాలని రోహత్గీ కోర్టును కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 10 నెలలు పూర్తయిందని.. ఇంకెంత గడువు కావాలని ధర్మాసనం ప్రశ్నించింది. ముకుల్ రోహత్గీ విజ్ఞప్తితో పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది.



# పారదర్శకంగానే కులగణన సర్వే

## ఆధారాల్లేకుండా సర్వేపై కేటీఆర్ మాట్లాడుతుండు

హైదరాబాద్ : రాష్ట్రంలో కులగణన సర్వే పాదర్శకంగా జరిగిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి ఆధారాల్లేకుండా బీసీ, కులగణన తప్పులు తడక అంటున్నారని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. ఎంతో శాస్త్రీయంగా, లక్షకుపైగా సిబ్బందిని పెట్టి ఇల్లిల్లు తిరిగి గణన చేశామన్నారు. కులగణన దేశానికే ఆదర్శమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే ఓర్చుకోలేక కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆదేశాలనుసారం కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప సంకల్పంతో పూర్తి చేసిందని చెప్పారు.


కులగణన సర్వేపై కేటీఆర్ వ్యాఖ్యలను బీసీ సమాజం క్షమించదన్నారు. 1931 తర్వాత కులగణన జరిగిందని, దీని వల్ల బీసీలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎంతో పకడ్బందీగా మొదటిసారి కులగణనను చేసిన ఘనత దేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వెల్లడించారు. 2014లో సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా బయటకు చెప్పలేని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ సర్వేపై మాట్లాడడం అవివేకమన్నారు. బీసీలకు న్యాయం జరుగుతుంటే కేటీఆర్ భరించలేకపోతున్నారని విమర్శించారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులు రీ-సర్వే గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారని, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పరోక్షంగా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు.

# 50వేల కంటే ఎక్కువ ఓట్లతో రేవంత్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్



కొడంగల్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. కొండగల్ శాసనసభ్యత్వానికి రేవంత్ రాజీనామా చేసి ఉప ఎన్నికలో పోటీ చేయాలన్నారు. ఉప ఎన్నికలో తాము ప్రచారం చేయమని చెప్పారు. ఫలితాల్లో రేవంత్ 50వేల కంటే తక్కువ మెజార్టీతోనే గెలుస్తారని తెలిపారు. 50వేల కంటే ఎక్కువ ఓట్లతో గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ వెల్లడించారు. అంతకుముందు కొడంగల్‌లో భారాస రైతు నిరసన దీక్ష సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన నడుస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదని ఆరోపించారు. "రేవంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేయడం లేదు. అనుముల అన్నదమ్ములు, అదానీల కోసమే పనిచేస్తున్నారు. రూ.కోట్లు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారు. మా ఎమ్మెల్యే సీఎం అయితే మాకు మంచి చేస్తారని కొడంగల్ ప్రజలు ఆశించారు. కానీ, రేవంత్ ప్రజల కోసం పనిచేయడం లేదు. భూములు గుంజుకోవాలనేదే ఆలోచన. రైతు బంధు డబ్బులు ఎవరికైనా వచ్చాయా?' అని ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో 'మృతదేహానికి చికిత్స'.. ఘటనపై మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్





హైదరాబాద్: నగరంలోని మదీనాగూడ సిద్ధార్థ ఆస్పత్రి తీరుపై తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రెండు రోజులు మృతదేహానికి చికిత్స చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై మంత్రి స్పందించారు. మంత్రి దామోదర ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రికి చేరుకొని తనిఖీలు చేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు, వైద్యులు బృందం ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్నారు.

# చిలుకూరు అర్చకుడిపై దాడి.. పవన్ కల్యాణ్ సీరియస్

అమరావతి: చిలుకూరులోని ప్రసిద్ధ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై ఒక మూక దాడి చేసిందని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దురదృష్టకరమైన ఘటన ఇదని... ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ఈ దాడిని ఒక వ్యక్తిపై చేసినట్లుగా కాకుండా- ధర్మ పరిరక్షణపై చోటు చేసుకున్న దాడిగా భావించాలని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కొన్ని దశాబ్దాలుగా రంగరాజన్ ధర్మ పరిరక్షణకు, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడేందుకు తపిస్తున్నారు, పోరాటం చేస్తున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. రామరాజ్యం అనే సంస్థ సభ్యులమని చెప్పి వెళ్లిన ఒక మూక రంగరాజన్‌పై దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చాలని చెప్పారు. ఆ మూకను నడిపిస్తున్నది ఎవరో గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ దాడిని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం విలువైన సూచనలను రంగరాజన్ తనకు అందించారని తెలిపారు. "టెంపుల్ మూమెంట్ " అనే కార్యక్రమం ఏ దశలో ప్రారంభించాల్సి వచ్చిందో రంగరాజన్ తెలిపారని అన్నారు. హిందూ ఆలయాల నిర్వహణ, ధర్మ పరిరక్షణపై ఆయన ఎంతో తపన పడుతున్నారని చెప్పారు. రంగరాజన్‌పై చోటు చేసుకున్న దాడిని ప్రతి ఒక్కరం ఖండించాలని అన్నారు. చిలుకూరు వెళ్లి రంగరాజన్‌ని పరామర్శించి, అండగా ఉండాలని జనసేన పార్టీ తెలంగాణ విభాగానికి ఆదేశించారు. ఈ మేరకు రంగరాజన్‌కు భరోసా ఇవ్వాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.






# కుంభమేళా..300 కి.మీల మేర నిలిచిపోయిన వాహనాలు!

ఉత్తర్ ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళా 2025 ప్రతి రోజూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది! కోట్లాది మంది భక్తులు ఈ మహా సమ్మేళనాన్ని సందర్శించి పవిత్ర స్నానాలు చేస్తున్నారు. అయితే, ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్ రికార్డు కూడా కుంభమేళా పేరిట నమోదు అయ్యింది. మహా కుంభమేళాకు దారితీసే రహదారుల్లో 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయని సమాచారం వచ్చింది. కుంభమేళాకు వెళ్లే రహదారుల్లో వాహనాలు కిటకిటలాడుతున్నాయి. ఎటుచూసినా వాహనాలు, వాటిల్లో భక్తుల పడిగాపులే కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద మత సమ్మేళనానికి హాజరు కావడానికి ఆసక్తి చూపుతున్న లక్షలాది మంది యాత్రికులు ఆదివారం కుంభమేళా ప్రాంగణానికి వందల కిలోమీటర్ల దూరంలో తమ కార్లలో చిక్కుకుపోయారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాఫిక్ జామ్ అని నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. మధ్యప్రదేశ్ మీదుగా మహా కుంభమేళాకు వెళ్లే యాత్రికుల వాహనాలతో 200-300 కిలోమీటర్ల వరకు ఈ ట్రాఫిక్ జామ్ విస్తరించిందని, దీంతో అక్కడి పోలీసులు ఆదివారం వివిధ జిల్లాల్లో ట్రాఫిక్ ను నియంత్రించలేకపోవడంతో ప్రజలు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారని తెలుస్తోంది. అయితే రద్దీ కారణంగా మధ్యప్రదేశ్ లోని చాలా రూట్స్ లో వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. వాహనాల్లో చిక్కుకుపోయిన వారిని, సొంతంగా షెల్టర్లు చూసుకోవాలని చెప్పడం గమనార్హం. కట్నీ జిల్లాలో పోలీసు వాహనాలు సోమవారం వరకు ట్రాఫిక్ నిలిపివేస్తున్నట్లు ప్రకటించగా.. మైహర్ పోలీసులు కట్నీ, జబల్ పూర్ వైపు వాహనాలను తిరిగి వచ్చి అక్కడే ఉండాలని కోరారు. 200-300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఉన్నందున ప్రయాగ్ రాజ్ వైపు వెళ్లడం అసాధ్యమని పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్ లోని కట్నీ, జబల్ పూర్, మైహర్, రేవా జిల్లాల్లో రోడ్లపై వేలాది కార్లు, ట్రక్కులు భారీ క్యూలైన్లలో ఉన్నట్లు సోషల్ మీడియాలో పలు వీడియోలు చూపిస్తున్నాయి. రేవా జిల్లాలోని చక్ ఘాట్ వద్ద కట్నీ నుంచి ఎంపీ-యూపీ సరిహద్దుల వరకు 250 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ అయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రద్దీపై ప్రయాణికులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. "జబల్ పూర్ కి ముందు 15 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్.. ప్రయాగ్ రాజ్ కు ఇంకా 400 కి.మీ. మహా కుంభమేళా కు వచ్చే ముందు ట్రాఫిక్ పరిస్థితిని తెలుసుకోండి,"





# కుంభమేళాలో మంత్రి కోమటిరెడ్డి పవిత్ర స్నానం

లక్నో: యూపీలోని ప్రయాగరాజ్‌లో ఎంతో వైభవంగా మహా కుంభమేళా జరుగుతోంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, కోమటిరెడ్డి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డికి అక్కడి పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా కొనసాగుతోంది. కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుంభమేళాకు వెళ్లారు. సోమవారం ఉదయం 5.10 గంటలకు ప్రయాగరాజ్‌లోని సంగం ఘాట్‌లో పవిత్ర స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సుభిక్షంగా ఉండాలని సంగం ఘాట్‌లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బడే హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి ఆంజనేయస్వామికి మంత్రి కోమటిరెడ్డి మొక్కులు సమర్పించారు. ఈ క్రమంలో మంత్రికి తీర్థ ప్రసాదాలు ఇచ్చి పూజారులు.. ఆయనను ఆశీర్వదించారు. ఈ మేరకు తాను కుంభమేళాకు వెళ్లిన దృశ్యాలను మంత్రి కోమటిరెడ్డి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదిలా ఉండగా.. కుంభమేళాలో సాధువులతో పాటు రాజకీయ ప్రముఖులు, సామాన్యులు కూడా లక్షలాదిగా పాల్గొంటున్నారు. మహా కుంభమేళాలో ఇప్పటి వరకు 43 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానం ఆచరించారని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మకర సంక్రాంతి, మౌని అమావాస్య, బసంత్ పంచమి సందర్భంగా 'అమృత స్నానాలు' ముగిసినప్పటికీ భక్తులు ఇప్పటికీ మహా కుంభమేళాకు పెద్ద సంఖ్యలో తరలి వస్తూనే ఉన్నారు.



# మీర్‌పేటలో మహిళ హత్య కేసు.. కీలక విషయాలు రాబట్టిన పోలీసులు

హైదరాబాద్: నగరంలోని మీర్‌పేటలో భార్యను హతమార్చి మృతదేహాన్ని ముక్కలుగా చేసి మాయం చేసిన కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కోర్టు అనుమతితో నాలుగు రోజుల పాటు నిందితుడిని కస్టడీకి తీసుకున్న పోలీసులు.. మూడో రోజు విచారిస్తున్నారు. విచారణలో పలు కీలక విషయాలను పోలీసులు రాబట్టినట్టు తెలుస్తోంది. భార్య మాధవిని గురుమూర్తి ఒక్కడే హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు గురుమూర్తితో పాటు మరో ముగ్గురి పేర్లనూ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. గురుమూర్తి సోదరి సుజాత (45), తల్లి సుబ్బలక్ష్మమ్మ(62), సోదరుడు కిరణ్(32)లను నిందితులుగా చూపారు. ప్రధాన నిందితుడిపై హత్యకు సంబంధించి సెక్షన్లు నమోదు చేయగా.. మిగిలిన ముగ్గురిపై బీఎన్ఎస్‌లోని 85 సెక్షన్(గృహహింస) ప్రయోగించారు. ఈ ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# సమతా కుంభ్ 2025 ఆధ్యాత్మిక వేడుకలు ఘనంగా ప్రారంభం.. ఎన్ని రోజుల వరకు అంటే..

2025 : శ్రీరామనుజాచార్య-108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వికాస తరంగణి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ప్రారంభించారు. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సమతా కుంభ్ యాత్రకు ఆదివారం ఫిబ్రవరి 9 న అంకురార్పణ చేశారు. ఏటా మాఘమాసంలో శ్రీ రామానుజాచార్యుల జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం నాడు 11 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.

**భగవంతుడి ముందు అందరూ సమానమే : చినజీయర్ స్వామి..** సమతా కుంభ్ 2025 తృతీయ వార్షికోత్సవ వేడుకలు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఆదివారం మొదలయ్యాయి. ఐక్యత, సమానత్వ స్ఫూర్తికి ప్రతీకగా నిలబడాలనే ఉద్దేశంతో ముందుగా నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం సమతా యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా 1927లోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శ్రీ రామానుజాచార్యులు చేపట్టిన సామాజిక సంస్కరణలను కొనియాడారని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారని వ్యాఖ్యానించారు. అహంభావాన్ని విడనాడి అవసరం ఉన్నప్పుడు సమాజానికి మానవత్వంతో సేవలందించాలని పిలుపునిచ్చారు. వికాస తరంగణి నేతృత్వంలో జరుగుతున్న ఈ యాత్రలో వేలమంది భక్తులు పీపుల్స్ ప్లాజా వరకూ జై శ్రీమన్నారాయణ అని నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ పవిత్ర ఊరేగింపులో 100 బస్సులు పాల్గొన్నాయి.

**11 రోజుల పాటు సమతా కుంభ్ వేడుకలు..** ఆదివారం ఆరంభమైన శ్రీ రామానుజాచార్య 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 వరకూ జరగనున్నాయి. ఫిబ్రవరి 10-13 తేదీల్లో సామాజిక సమానత్వం, జ్ఞానం, న్యాయం ప్రాధాన్యత తెలియజెప్పేందుకు విద్యాలయాలకు వెళ్లి విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక సెషన్‌లు నిర్వహించనున్నారు.

# నేషనల్ పార్క్ మందుపాతరకు ప్రతీకారం తీర్చుకున్న సైనికులు..!!










(మొదటి పేజీ తరువాయి)2026 నాటికి మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం తుడిచిపెడుతుందని జనవరి 6న కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా పేర్కొన్న నేపథ్యంలో ఆపరేషన్లు వేగవంతమయ్యాయి. మరోవైపు ఎన్కౌంటర్లో మరణించిన జవాన్లను వీర జవాన్లుగా ప్రకటించి వారి కుటుంబాలకు నష్టపరిహారం పెద్ద మొత్తంలో చెల్లిస్తామని హెూం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఆ ఇద్దరిదీ వీర మరణం గా వెల్లడించారు ఇక నక్సలైట్ల అంతుచేసే కార్యక్రమం కొనసాగుతుందని ఛత్తీస్గడ్ పోలీసులు మరోసారి ప్రకటించారు.

## అజరామరం ఆ గానం - ఫిబ్రవరి 11... ఘంటసాల వర్ధంతి



భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉ చితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, ఆమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుడే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## బహుముఖ ప్రజ్ఞాశాలి రావి కొండల రావు

## ఫిబ్రవరి 11...రావి కొండల రావు జయంతి



ప్రముఖ సీనియర్ నటుడు, రచయిత, దర్శక నిర్మాత, సాహితీవేత్త, పాత్రికేయుడు రావి కొండలరావు. సినిమా రచనలే కాకుండా ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, జ్యోతి, రచన, యువ, ఉదయం, పుస్తకం, విపుల మొదలైన వివిధ పత్రికలలో రచనలు చేశారు. హాస్య రచయితగా గుర్తింపు పొందాడు. సుకుమార్ అనే కలంపేరుతో కూడా కొన్ని రచనలు చేశారు. ఆయన 1932, ఫిబ్రవరి 11న సామర్లకోటలో జన్మించారు. తండ్రి పోస్టుమాస్టరు పదవీ విరమణ తర్వాత శ్రీకాకుళంలో స్థిరపడ్డారు. వీరి పూర్వీకులు శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు కావడంతో వీరు తండ్రి పదవీ విరమణ తర్వాత స్థిరపడ్డారు. కాకినాడలో మద్రాసు ఆనందవాణి పత్రికలో సబ్‌ఎడిటర్ గా చేశారు. కొన్నాళ్ళు రమణ గారింట్లో ఉన్నారు. కొన్నాళ్ళు కేరళ వెళ్ళి, ఒక మలయాళం సినిమాకు డబ్బింగ్ డైలాగులు రాశారు. నరసరాజుగారి సిఫార్సు ద్వారా కొండలరావుకు పొన్నలూరి బ్రదర్స్‌వారి సినీ సంస్థలో స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. కామేశ్వరరావు సిఫార్సుతో శోభ సినిమాలో కొండలరావు సినీ నటుడుగా తొలిసారి కనబడ్డారు. ఆయనకు రాధాకుమారితో వివాహం అయింది. ఇద్దరూ తమిళ సినిమాలకు డబ్బింగ్ చెప్పేవారు. సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా అవస్థలు పడేకంటే వేషాలే వెయ్యరాదా అని ముళ్ళపూడి వెంకటరమణ అనేవారట. ఆదుర్తి సుబ్బారావు తీసిన 'దాగుడు మూతలు' సినిమాలో డాక్టరు వేషం లభించింది. విజయచిత్ర సినీ మాసపత్రికలో ఎడిటర్‌గా చేశారు. రాధాకుమారి జన్మించినది విజయనగరంలో. ముందు 'ముగ్గురు వీరులు' సినిమాలో ఆమె డబ్బింగ్ చెప్పింది. కొండలరావు ఇంట్లోనే ఆమె తన తండ్రిగారితో వుండేది. అభిరుచులూ, వ్యాపకాలూ ఒకటే కావడంతో కొండలరావు, రాధాకుమారి ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. ఆమె తొలి చిత్రం తేనె మనసులు. 1958 నుండి 2008 వరకు సినిమాలలో విభిన్న పాత్రలు పోషించి, ఒక ఇమేజ్ ను సొంతం చేసుకొన్నారు. అలాగే నీతిచంద్రిక, హ్యామరథం (రెండు భాగాలు), మల్లీశ్వరి (సినిమా నవల), రావి కొండలరావు నాటికలు, రావి కొండలరావు కథలు, నాగావళి నుంచి మంజీర వరకు తదితర పుస్తకాలు రచించారు. రాష్ట్ర ప్రభుత్వ తామ్ర నంది పురస్కారం, 2004 సంవత్సరానికి అ.జో-వి.భొ. కందాళం ఫౌండేషన్ వారిచే జీవిత సాఫల్య పురస్కారం లభించాయి. జులై 28, 2020న 88ఏళ్ళ వయస్సులో తుది శ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ మహానగరంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద రహదారి విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో తన ఇంటి స్థలం సేకరణపై పునరాలోచన చేయాలని ప్రభుత్వాధికారులను టాలీవుడ్ ప్రముఖ హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ పార్టీ నేత చంద్రశేఖర్ రెడ్డి కోరారు. అందులోభాగంగా సోమవారం గ్రీన్ లాండ్స్‌లోని మహాత్మ జ్యోతి రావు పూలే భవనంలో నిర్వహిస్తున్నప్రజావాణికి ఆయన ఫిర్యాదు చేశారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా తన ప్లాట్‌లో ఓ వైపు 20 అడుగులు, మరో వైపు 36 అడుగుల భూమి సేకరించే అంశంపై వివరణ ఇవ్వాలంటూ అధికారులను ఆయన కోరారు. కేబీఆర్ పార్క్ చుట్టూ జంక్షన్ల అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలో కీలక నిర్ణయం తీసుకొంది. అందుకోసం రూ. 1,100 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ మహానగరంలోని రహదారులన్నీ నిత్యం ట్రాఫిక్‌తో సతమతమవుతోన్నాయి. ఈ ట్రాఫిక్ కష్టాలను తొలగించేందుకు నగరంలోని వివిధ కీలక ప్రాంతాల్లో జంక్షన్లు అభివృద్ధికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కసరత్తు చేస్తోంది. అందులోభాగంగా తొలి దశలో కేబీఆర్ పార్క్ చుట్టూ 6 కూడళ్లను అత్యాధునికంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో భాగంగా రూ.826 కోట్లతో జంక్షన్ల డిజైన్లకు రేవంత్ సర్కార్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఓ వైపు అండర్ పాస్‌లు, మరో వైపు ఫ్లై ఓవర్లు నిర్మించబోతున్నారు. తొలి దశలో రూ.421 కోట్లతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ అభివృద్ధి చేయనున్నారు. రెండో దశలో రూ.405 కోట్లతో రోడ్ నెంబర్-45 జంక్షన్, ఫిల్మ్‌నగర్, మహారాజా అగ్రసేన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటి. జూబ్లీహిల్స్. ఆ ప్రాంతంలో ఎటు వైపు వెళ్లాలన్న గంటల కొద్ది సమయం పడుతుంది. ఈ క్రమంలో కేబీఆర్ పార్క్‌ను కేంద్రంగా చేసుకొని చుట్టూ జంక్షన్లను అభివృద్ధి చేస్తూ అన్ని వైపులా సులువుగా ప్రయాణించేలా ప్రణాళికలు రూపొందించారు. వాటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా గమ్యాన్ని సులువుగా చేరుకోవచ్చు. కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాలతో పాటు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి.. పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో పలు ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించే క్రమంలో పలువురి స్థలాల మీదగా వీటిని నిర్మించాల్సి వస్తోంది. దీంతో సదరు స్థలాల యజమానులు ముందుగా స్పందిస్తున్నారు. ఆ క్రమంలోనే అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు.

## అర్చకుడు రంగరాజన్‌పై దాడి.. కేటీఆర్ ఏమన్నారంటే




హైదరాబాద్, ఫిబ్రవరి 10: చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ ప్రతినిధులు దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఉ దయం అర్చకుడు రంగరాజన్‌ను కేటీఆర్ కలిసి పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా చిలుకూరు బాలాజీ ఆలయంలో రంగరాజన్ కుటుంబం సేవ చేస్తోందన్నారు. రంగరాజన్ పై దాడిని ఖండిస్తున్నామని.. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా మారాయన్నారు. ఈ దాడికి పాల్పడ్డ వాళ్ళు ఏ ముసుగులో ఉన్నా.. ఏ జెండా పట్టుకున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి. రాష్ట్రంలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చూసుకోవాలన్నారు. అవసరమైతే చిలుకూరి బాలాజీ టెంపుల్ వద్ద భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. రంగరాజన్‌ను అవమానించడం అంటే దేవుని అవమానించడమే అని అన్నారు. రంగరాజన్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. మరోవైపు రంగరాజన్‌పై దాడి ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రంగరాజన్‌పై దాడి ఘటనలో 17 మంది ఆచూకీని గుర్తించారు పోలీసులు. మొత్తం దాడి చేసిన వ్యక్తులు 22 మంది కాగా.. వారిలో 17 మందిని పోలీసులు కనుగొన్నారు. తెలంగాణకు చెందిన ఏడుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పదిమందిని గుర్తించారు. ఈ ఘటనలో వీర రాఘవ రెడ్డిని ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఇతడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. అలాగే వీర రాఘవరెడ్డి అనుచరులు ఐదు మందిని ఈరోజు మొయినాబాద్ పోలీసులు.. అరెస్ట్ చేశారు. అలాగే పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. ఈ నెల 7న వీరరాఘవరెడ్డి తన అనుచరులతో కలిసి రంగరాజన్ నివాసానికి చేరుకున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయం ప్రాంగణంలోనే రంగరాజన్ నివాసం ఉంటుంది. ఆయన ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రామరాజ్య స్థాపనకు మద్దతు ఇవ్వాలన్నారు. అలాగే దేవాలయాన్ని తమకు అప్పగించాలని రంగరాజన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. దీన్ని వ్యతిరేకించిన రంగరాజన్‌పై వీరరాఘవరెడ్డి, అతడి అనుచరులు దాడి చేశారు. దీనిపై రంగరాజన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సుమారు 22 మంది ఈ దాడిలో పాల్గొన్నట్లు తెలుస్తోంది.


చురకలు

## సంపాదకీయం

### హిమాలయాలు ప్రకోపిస్తే కల్లోలమేనా ?

హిమగిరి సొగసులు మురిపించునూ మనసులు అని కవులు పాడుకుంటారు. నిజమే ఎత్తైన హిమాలయాలు ఎంతో మానసిక ఆనందాన్ని ప్రకృతి ప్రేమికులకు ఇస్తాయి. ఆధ్యాత్మిక పరులకు అక్కడ ఎంతో ప్రశాంతత కనిపిస్తుంది. యోగులు అంతా అక్కడే ఉంటారు. మంచుతో మంచిగా ఉండే ఈ కొండలు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని ప్రభోదిస్తూంటాయి. అయితే ప్రకృతిలో అన్నీ కూడా భాగమే. ఎపుడు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇక అందమైన హిమాలయాలు ప్రకోపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజాగా మంగళవారం టిబెట్ నేపాల్ పరిసరాలలో సంభవించిన తీవ్ర భూకంపానికి 130 మంది దాకా మరణించారు. వందలాది మంది క్షతగాత్రులు అయ్యారు. ఈ పెను ప్రకృతి విపత్తుతో భారీ నష్టం సంభవించింది. ఏకంగా గంటల వ్యవధిలో ఆరేడు సార్లు భూమి కంపించింది అని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే హిమాలయాల్లో భూకంపం వచ్చిందని దాని ప్రభావమే నేపాల్ టిబెట్ సరిహద్దులలో కనిపించిందని అంటున్నారు.' 7.1 మాగ్నిట్యూడ్ తో భారీ భూకంపం రావడం వల్ల నేపాల్ టిబెట్ నే కాదు ఉత్తర భారత దేశం అంతా వణికిపోయింది. ఇక టిబెట్ రాజధాని లాసాకు నైరుతి దిశలో 400 కిలోమీటర్ల దూరంలో టింగ్రీ కౌంటీలో భూకంప కేంద్రం ఉన్నట్లుగా గుర్తించారు. ఇక హిమాలయాలల్లో రానున్న కాలంలో భూకంపాలు వచ్చే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు హిమాలయాలల ప్రాంతంలో భూకంపాలు వచ్చినట్లుగా చెబుతున్నారు. రానున్న కాలంలో 8 నుంచి ఎక్కువ స్థాయిలోనే మాగ్నిట్యూడ్ తీవ్రతతో భారీ భూకంపాలు హిమాలయాల్లో సంభవించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. హిమాలయాల ప్రాంతంలో ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ ఆసియా టెక్టోనిక్ ప్లేట్ ని ముందుకు నెడుతోంది అని అంటున్నారు. ఇలా భూ అంతర భాగంలో జరిగే భారీ సంఘర్షణల వల్లనే భూకంపాలు వస్తున్నాయని అంటున్నారు. ఇక హిమాలయాల చరిత్ర చూస్తే అవి వేల కోట్ల ఏళ్ళ క్రితం ఇలాంటి భూకంపాల వల్లనే ఉద్భవించాయని చెబుతున్నారు. ఇక ప్రతీ ఏటా ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ కొన్ని మిల్లీమీటర్ల మేర ఉత్తర దిశగా ముందుకు నెడుతోందని దాని ఫలితంగా హిమాలయాల ఎత్తు కూడా నెమ్మదిగా పెరుగుతోంది అని అంటున్నారు. ఈ నేపధ్యం నుంచి చూసినపుడు హిమాలయాలలో ఏదో ఒక రోజు భారీ భూకంపాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అది రేపు అయినా కావచ్చు లేదా పదేళ్ళు వందేళ్ళ కాలమైనా పట్టవచ్చు కానీ భూకంపాలు మాత్రం హిమాలయాల నుంచి వచ్చే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే ఉత్తరాదిన ఉన్న ప్రాంతాలకు చాలా ఇబ్బంది అవుతుందని కూడా అంటున్నారు. దీనికి గతంలో జరిగిన సంఘటనలు ఉదహరిస్తున్నారు. 1897లో షిల్లాంగులో అలాగే 1905లో కాంగ్రాలో, 1934లో నేపాల్ బీహార్ లలో, 1950లో అసోంలో భారీ భూకంపాలు సంభవించాయని గుర్తు చేస్తున్నారు. ఇక 1991లో ఉత్తర కాశీలో భూకంపం సంభవించిందని అలాగే 1999లో చమోలీలో 2015లో నేపాల్ లో భూకంపాలు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. వీటి వల్ల వేలాది మంది మరణించారని చెబుతున్నారు. మంచుతో నిండిన ఈ అత్యున్నత శిఖరం పైకి గంభీరంగా ఉన్నా లోపల జరిగే సంఘర్షణల ఫలితంగా భూకంపాలు విరుచుకుపడతాయని ప్రకృతి విపత్తు నిపుణులు చెబుతున్నారు.


## థామస్ ఎడిసన్ ఆవిష్కరణల వెనక తల్లి పాత్ర - ఫిబ్రవరి 11...థామస్ అల్వా ఎడిసన్ జయంతి



నూతన ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ ( 1847, ఫిబ్రవరి 11 - 1931 అక్టోబర్ 18) జీవితంలో ఎన్నో ఆవిష్కరణలు గావించాడు. ఆయన అసమాన కృషి వెనక కన్న తల్లి పాత్ర గురించి తెలిస్తే ఆశ్చర్యం కలుగ మానదు. ఎడిసన్ బాల్యంలో ఆయన తల్లి నిజాన్ని దాచి, ముద్దుల కుమారునికి ఇచ్చిన స్ఫూర్తి ఆయనకు తెలియ కుండానే ప్రపంచంలో ఒక గొప్ప శాస్త్ర వేత్తను చేయడానికి ఉపకరించింది. ఎడిసన్ పాఠశాల నుండి ఒక రోజు ఇంటికి వచ్చి, తనకు స్కూల్లో ఇచ్చిన ఒక లెటర్ ను తల్లికి ఇచ్చి... దానిని స్కూలు లో తనకు ఇచ్చారని, తల్లికి ఇమ్మన్నారని చెప్పి, దానిలో ఏముందో చదవి వినిపించ మన్నాడు. తల్లి ఆ లెటర్‌ను తెరిచి, చదువుతూ కళ్ళ నీళ్ళ పర్యంత మయింది. తన కుమారుడిని అక్కున చేర్చుకొని ఏడ్చింది. విషయం అర్థం కాని థామస్.. లెటర్ లో ఏముందని అడిగాడు. ఆమె ఆ లెటర్‌ను పట్టుకుని బిగ్గరగా చదువుతూ... "మీ కుమారుడు ఒక జీనియస్, అద్భుతమైన తెలివి తేటలు కలిగిన వాడు , అయితే మేము ఇటువంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేము, ఇక్కడ థామస్‌కు చదువు చెప్పడానికి సరైన ఉపాధ్యాయులు లేక పోవడమే దానికి కారణం. అందుకే థామస్‌కు మీరు ఇంట్లోనే చదువు చెప్పండి" అని రాశారు అంటూ ఆమె చదివి చెప్పింది. నాటి నుండి థామస్ ఇంట్లోనే తన తల్లి వద్ద చదువు కోగా... తల్లి థామస్ చదవుపై అపార శ్రద్ధ పెట్టి ఒక గొప్ప మేధావిగా తీర్చిదిద్దింది. అలా తల్లి ప్రోత్సాహం, మార్గదర్శకత్వంలో స్వయం కృషితో థామస్ ఎడిసన్ ప్రపంచంలోనే గొప్ప ఆవిష్కర్తగా రూపు దిద్దు కున్నాడు. మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప శాస్త్రవేత్తగా చరిత్రలో మిగిలాడు. థామస్ ఎడిసన్ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక రైళ్ళలో న్యూస్ పేపర్లు, స్వీట్లు అమ్మేవాడు. అతి చిన్న వయస్సు లోనే టెలిగ్రాఫ్ నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. 1861 లో ఎడిసన్ "గ్రాంట్ ట్రంక్ హెరాల్డ్" అనే సాధారణ న్యూస్ పేపర్ నడిపాడు. 1862 లో ఎడిసన్ ఒక స్టేషను మాస్టర్ బిడ్డను ప్రమాదం నుంచి రక్షించి ప్రతిఫలంగా ఆయన వద్ద నుంచి టెలీగ్రఫీని నేర్చు కున్నాడు...తన టెలిగ్రాఫ్ పరికరాన్ని పరిస్థి తుల కారణంగా విధిలేక అమ్ము కున్నాడు. 1878 లో ఎలక్ట్రిక్ బల్బ్ ను 1877 లో ఫోనోగ్రాఫ్ ను, 1887-1889 మధ్య లో టైప్ రైటర్ , ఎలక్ట్రిక్ పెన్ , గ్రామ ఫోన్ , మోషన్ పిక్చర్ కెమేరా , తదితర ఎన్నింటినో ఆయన ఆవిష్కరించాడు. అక్టోబరు 18 1931న మరణించాడు. థామస్ పేరు ప్రతిష్టలు గడుస్తున్న సమయంలోనే ఆయన తల్లి మరణించింది. ఒకరోజు థామస్ తన ఇంట్లోని పాత వస్తువులు తొలగించే పనిలో .. బీరువాలో ఒక లెటర్ కనిపించింది. అది తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఉపాధ్యాయులు తనకు ఇచ్చిన లెటర్ గా గుర్తించాడు. ఆ లెటర్ చదివిన థామస్ ఒక్కసారిగా షాక్ కు గురైనాడు. ఇంతకీ ఆ లెటర్ లో ఏముం దంటే 'మీ కుమారుడు థామస్ మానసికంగా చాలా బలహీను డు. ఇలాంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేం. దయచేసి మీ అబ్బాయికి మీ ఇంట్లోనే చదువు నేర్పండి' అని వుంది. ఈ లెటర్ చదవగానే థామస్ కన్నీళ్లు ఆపుకోలేక పోయాడు. అప్పుడు థామస్‌కు.. తన తల్లి పడిన ఆవేదన, తనను మేధావి గా తీర్చి దిద్దడానికి ఆమె చేసిన కృషి, పడిన కష్టం గురించి స్పష్ట మైంది. తన తల్లి గనుక ఆ లెటర్‌లో ఉన్నది ఉన్నట్లు చదివి ఉంటే... తన బలహీనత తెలిసి పోయి, తాను ఇన్ని ఆవిష్కర ణలు చేసే అవకాశమే ఉండేది కాదని అనుకుంటూ ఉద్వేగ భరితంగా, ఎడిసన్ తన డైరీలో వెంటనే... " థామస్ ఎడిసన్ ఒక మానసిక వికలాంగుడైన అబ్బాయి. అతడిని మాతృ మూర్తి ఈ శతాబ్దానికే మేధావిగా మార్చింది" అని రాసు కున్నాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## ఏకాత్మతా మానవవాద సిద్ధాంత కర్త దీన్ దయాళ్ - ఫిబ్రవరి 11... దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి


కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తర ప్రదేశ్ లోని మధుర దగ్గర 'నగ్ల చంద్రభాన్' అనే గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి మరణించిన దీనదయాళ్ జీ మేనమామ ఇంటిలో పెరిగారు. 1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన దయాళ్ కాన్పూర్‌లో బి.ఎ, చదువు తున్నప్పుడు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఏర్పడింది. 1937లో మొదటి కొద్దిమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుండి ఆయన జీవిత విధానం, గమ్యం మారిపోయింది. సంఘ్‌లో పనిచేస్తూనే బి.ఎ, డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ ఎం.ఎ, ప్రథమ సంవత్సరం పూర్తిచేశారు. సంఘ్ విస్తరణకు పూర్తి సమయం ఇచ్చేందుకు చదువుకు స్వస్తి పలికారు. ఉత్తర ప్రదేశ్‌లోని లఖంపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా నియుక్తులైన కొద్ది సంవత్సరాల లోనే ఆ ప్రాంతంలో సంఘ్ కార్యక్రమాలను వికసింప జేశారు. అది గమనించిన సంఘ్ పెద్దలు వారిని ఉత్తరప్రదేశ్ ప్రాంత సహ ప్రచారకులుగా నియమించారు. ఆయన అసామాన్యమైన ప్రతిభా పాటవాలు అందరినీ ఆకట్టు కున్నాయి. సంఘ్ కార్యక్రమాలు చూస్తూనే పత్రికారంగంపై దృష్టి సారించి రాష్ట్ర ధర్మ ప్రకాశన్ అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఆ ప్రకాశన్ ద్వారా "రాష్ట్ర ధర్మ", అనే ఒక మాస పత్రిక, "పాంచజన్య" అనే వారపత్రిక, "స్వదేశ్" అనే దిన పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలు దీనదయాళ్ జీ కార్యదీక్షకు ప్రతీకలుగా నిలిచాయి. 1952లో భారతీయ జన సంఘ్ లో చేరి ఉపాధ్యక్షులుగా నియమితుడైనారు. 1967లో జన సంఘ్ అధ్యక్ష పదవి చేపట్టేవరకు ఆ పదవిలో కొన సాగారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణించాక, పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయ పథంలో నడిపించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక 'స్వదేశ్'లకు సంపాదకులుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే ఏకాత్మతా మానవతా వాదం, శంకరాచార్య జీవిత చరిత్ర వంటి పుస్తకాలు, హిందీలో 'చంద్రగుప్త మౌర్య' నాటకం, మరాఠీ నుండి ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు డా. హెడ్గేవార్ జీవిత చరిత్ర అనువాదం వంటి పలు రచనలు చేశారు. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు ఉన్నాయని వివరించే క్రమంలో "ఏకాత్మతా మానవతా వాదం" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారు. గాంధీజీని కాల్చి చంపిన నేరాన్ని హిందూ మహాసభతో పాటు ఆర్ఎస్ఎస్ పై కూడా మోపిన నేపథ్యంలో, ఆనాటి ప్రధాని నెహ్రూజీ సంఘ్‌ను నిషేధించారు. ఆ నిషేధాన్ని తొలగించాలంటూ జరిగిన ఉద్యమానికి ఉత్తర ప్రదేశ్‌లో దీనదయాళ్ జీ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. ఈ హత్యానేరంలో సంఘ్ పాత్ర లేదని దీనదయాళ్ జీ పాంచజన్యలో స్పష్టం చేస్తూ ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రాసిన రాతలకు ఆనాటి ప్రభుత్వం పాంచజన్యను నిషేధించింది. దానికి బదులుగా "హిమాలయ" అనే మరో వార పత్రికను ప్రారంభించి తన కలంతో నాటి ప్రభుత్వానికి కలవరం పుట్టించారు. ఈలోగా గాంధీజీ హత్యా నేరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం మొదలైన విషయాలపై ఆయనలోని అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలు, భారతీయ తత్వజ్ఞాన సారాన్ని దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామ్రాట్, చంద్రగుప్త, జగద్గురు శంకరాచార్య అనే చారిత్రక నవలలను కూడా దయాళ్‌జీ రాశారు. 1951లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రధాని నెహ్రూ విధానాలకు నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నెహ్రూ అనుసరిస్తున్న, ముస్లిం సంతుష్టీ కరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి, భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ గురూజీ సహాయాన్ని అర్థించారు. ఆయన కోరిక ప్రకారంగా పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ జీ, జగన్నాధరావు జీ, సుందర్ సింగ్ భాండారి లాంటి మరి కొందరు యువకులను అప్పగించారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబరు 21న ఏర్పాటు చేసిన జనసంఘ్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా దీనదయాళ్ జీ ఎన్నికైనారు. పార్టీ స్థాపించిన మూడు మాసాలకే 1952లో జరిగిన జనరల్ ఎన్నికలలో పోటీ చేసిన నాలుగు జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటిగా జనసంఘ్ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందింది. తన ఉనికిని సాధారణ ఎన్నికలలో రుజువు చేసుకోగలిగింది. దీనికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంతో పాటు దీనదయాళ్ జీ సమన్వయ కౌశలం కూడా తోడైంది. శ్యామ్‌ప్రసాద్



ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశ వ్యాప్తంగా పటిష్ఠ పరచిన ఘనత దీనదయాళ్‌జీకి ఆయన సహచరులకు దక్కుతుంది. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారికి సవాలు విసురుతూ, ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించాడు. భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పనిచేసిన దీనదయాళ్‌జీ కార్యకర్తల హృదయాలను మలిచి వారి మనస్సులలో అతి స్థిర స్థానాన్ని చూరగొన్నారు. సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవిచూస్తూ దేశ సేవ నిమగ్నుమై దానినే జీవన కార్యంగా స్వీకరించాడు. జనసంఘ్‌లో చేరినప్పటి నుంచి మహారథియై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జనసంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృతకృత్యులై 1967లో పార్టీ అఖిల భారత అధ్యక్షుడు కాగలిగారు. కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహాసభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారు. ఆ కీర్తియే జనసంఘ్ సిద్ధాంత వ్యతిరేకుల కినుకకు కారణమైంది. రాజకీయాలకు చిత్త శుద్ధి గల నేత బలి అయినారు. ఉత్తర ప్రదేశ్‌లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11న రైలు పట్టాల వద్ద శవమై కనిపించారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం మాదిరిగానే దీనదయాళ్‌జీ మరణం కూడా పలు అనుమానాలకు దారితీసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## అలుపెరుగని కమ్యునిస్టు యోధుడు తరిమెల - ఫిబ్రవరి 11... తరిమెల నాగిరెడ్డి జయంతి



తరిమెల నాగిరెడ్డి (ఫిబ్రవరి 11, 1917 - జులై 28, 1976) అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. ఆయనను అందరూ టి.ఎన్ అని పిలిచేవారు. అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో ఫిబ్రవరి 11, 1917 న రైతు కుటుంబములో జన్మించారు. పాఠశాల రోజుల నుండే సమాజం లోని అసమానతలకు వ్యతిరేకంగా తిరుగుబాటు లక్షణాలు కనబరిచారు. మద్రాసు లోని లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివేరోజుల్లో తన జాతీయతా భావాల కారణంగా కళాశాల యాజామాన్యానికి, ఆచార్యులతో నాగిరెడ్డికి పొసగ లేదు. లయోలా కళాశాల యాజమాన్యం నాగిరెడ్డికి జవహర్ లాల్ నెహ్రూ బహిరంగ ఉపన్యాసాలకు హాజరైనందుకూ, రామస్వామి ముదలి యారుకు, సత్యమూర్తికి మధ్య జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు, వ్యాసరచనా పోటీలలో మహమ్మద్ బిన్ తుగ్లక్‌ను ప్రశంసించినందుకు, అనేకసార్లు జరిమానా విధించింది. నాగిరెడ్డి లయోలా కళాశాల తరువాత వారణాసి, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో విద్య నభ్యసించారు. వారణాసిలో ఉన్న నాలుగేళ్ళలో నాగిరెడ్డి కమలాదేవి ఛటోపాధ్యాయ, జయప్రకాశ్ నారాయణ్,అచ్యుత్ పట్వర్ధన్ వంటి వారిచే ప్రభావితు డయ్యారు. కమ్యూనిజం, మార్క్సిజంతో ఈయనకు వారణాసిలోనే పరిచయ మయ్యింది. రష్యన్ విప్లవము, స్టాలిన్ నాయకత్వం గురించి విస్తృతముగా చదివి, భారత దేశంలో కూడా మార్క్సిజాన్ని అమలు చేయవచ్చని నమ్మటం ప్రారంభించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఉపకులపతిని నిలదీశారు. మహాత్మా గాంధీకి అది తెలిసి తరిమెల నాగిరెడ్డి వైస్ ఛాన్సలర్‌కి క్షమాపణలు చెప్పాలని ఉత్తరం రాశారు. నాగిరెడ్డి అందుకు ఒప్పుకోలేదు. తిరస్కరించారు. నాగిరెడ్డి తన ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ కలాపల వల్ల అనేకమార్లు జైలుకు వెళ్లారి. 1940లో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం అన్న పుస్తకం వ్రాసి ప్రభుత్వము యొక్క ఆగ్రహానికి గురై జైలుకు వెళ్ళారు. తిరుచిరా పల్లి జైలునుండి విడుదల కాగానే తిరిగి 1941లో భారతీయ రక్షణ చట్టము కింద అరెస్టయ్యారు. 1946లో ప్రకాశం ఆర్డినెన్సు కింద అరెస్టయ్యి 1947లో విడుదల చేయబడ్డారు. 1952లో నాగిరెడ్డి మద్రాసు శాసన సభకు సి.పి.ఐ అభ్యర్థిగా అనంతపురం నియోజక వర్గం నుండి ఎన్నికయ్యారు. జైలులో ఉండి కూడా, ప్రముఖ కాంగ్రెస్ కాంగ్రేసు నాయకులు, తన బావ అయిన నీలం సంజీవరెడ్డిపై విజయం సాధించి సంచలనం సృష్టించిన ఘనత ఆయనకే దక్కింది. 1955లో కొత్తగా ఏర్పడిన పుట్లూరు నియోజక వర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి తరిమెల రామచంద్రారెడ్డి చేతిలో ఓడిపోయారు. 1957లో అనంతపురం లోక్‌సభ నియోజక వర్గం నుండి 2వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి 1962లో పుట్లూరు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సి.పి.ఐ అభ్యర్థిగా పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డి ఓడించి ఎన్నికైనారు. 1967లో నియోజక వర్గాల పునర్విభజనలో పుట్లూరు నియోజకవర్గం రద్దుకాగా, సి.పి.ఐ (ఎం) అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుండి మూడో సారి శాసనసభకు ఎన్నికయ్యారు. 1969లో మార్చి నెలలో శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాగిరెడ్డి రచనలలో ముఖ్యమైనది ఇండియా మార్ట్‌గేజ్డ్ (తాకట్టులో భారతదేశం). 1968లో నాగిరెడ్డి సి.పి.ఐ (ఎం) నుండి విడిపోయి ఆంధ్ర ప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రెవల్యూషనరీస్ (ఎ.పి.సి.సి.ఆర్) - ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీని స్థాపించారు. సి.పి.ఐ (ఎం) కార్యకర్తలను కొత్తపార్టీలోకి ఆకర్షించడంలో సఫలం అయ్యారు. కొద్దికాలం ఎ.పి.సి.సి.ఆర్ అఖిల భారత కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీలో కలసివుంది. రెడ్డి 1976లో తను మరణించేదాకా ఎ.పి.సి.సి.ఆర్ నాయకునిగా కొనసాగారు. నాగిరెడ్డి 1976, జులై 28న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# లక్షణమైన నంబరు

మెదక్ : వాహనాలకు ఫ్యాన్సీ నంబరు పొందేందుకు యజమానులు పోటీపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ నిర్వహించే ఆన్‌లైన్ వేలంలో రూ.లక్షలో పోసి నచ్చిన నంబర్లు దక్కించుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం గతేడాది మార్చి 15వ తేదీన కొత్త కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి నుంచి రవాణాశాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పది నెలల్లోనే జిల్లాలోని మెదక్ ఆర్టీఏ కార్యాలయానికి 829 ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.46,82,021 ఆదాయం సమకూరింది.



**వేలంలో నంబర్ దక్కించుకొని**

వాహనాలకు ఫ్యాన్సీ, లక్కీ, పుట్టిన రోజులు వచ్చేలా నంబర్లు తీసుకుంటున్నారు. దీనికోసం రూ.లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి 6666 నంబరుకు రూ.1,55,678 వెచ్చించి వేలం పాటలో దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొనే వ్యక్తుల సంఖ్య తెలియదు. దీంతో కేవలం నంబర్లను చూసి ఒకే వ్యక్తి ఎక్కువ బిడ్లు వేసి వాటిని దక్కించుకుంటున్నారు.మెదక్‌లో టీజీ ఫ్యాన్సీ నంబర్లతో 829 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 6666 నంబర్‌ను రూ.1,55 ,678.. 5555 నంబర్‌ను రూ.1,53,500.. 9099 నంబర్‌ను రూ.71,555కు కొనుగోలు చేశారు.

**ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయాలి**

ఆన్‌లైన్‌లో బిడ్లు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తం బిడ్ వేసిన వారికి సంబంధిత నంబరును రిజర్వు చేస్తారు. దాని ప్రకారం వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుంది. ఈ విధానంతో రవాణాశాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది.వెంకటస్వామి, జిల్లా రవాణా శాఖాధికారి

# కంది.. కొనరేంది?

చేర్యాల: పది రోజుల క్రితం కందుల కొనుగోలు కేంద్రాన్ని పోటీ పడి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇప్పటివరకు కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. ఎవరూ పట్టించుకోవటం లేదు. చేర్యాలో కాంగ్రెస్, భారాస ప్రజాప్రతినిధులు, నాయకులు ఒకేరోజు రెండుసార్లు కందుల కొనుగోళ్లు ప్రాంభించారు. కందులను తీసుకొచ్చిన రైతులు వ్యవసాయ మార్కెట్, అటు పీఏసీఎస్ పాలకవర్గాల పనితీరుతో అసహనానికి గురవుతున్నారు. రోజూ వాటిని ఆరబోయడం, రాశి పోయడం చేస్తున్నారు. కొందరు రైతులు వాపసు తీసుకెళ్లి వ్యాపారులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకుండా పోతోంది. ఈ విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి దృష్టికి ఆకునూరు రైతులు ఇటీవల తీసుకెళ్లారు. వెంటనే పీఏసీఎస్ అధికారికి ఆయన ఫోన్ చేసి ఆరా తీశారు. తూకం వేసి కొనుగోలు అనుమతి ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన కందులను సేకరిస్తామని సీఈవో రాములు తెలిపారు. ఆరబోసి, చెత్త లేకుండా నాణ్యత పాటించాలన్నారు.

నమోదు చేయలేదు: ఎల్లయ్య, ధర్మారం, మద్దూరు మండలం

మాది మద్దూరు మండలం ధర్మారం. సొంత భూమిలో 3 ఎకరాల్లో కంది సాగు చేశా. అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదు. నా పేరున రాసివ్వమని మద్దూరులో వ్యవసాయాధికారులను అడిగితే చేర్యాలకు వెళ్లమంటున్నారు. చేర్యాలకు వస్తే మద్దూరు మండల వ్యవసాయాధికారులే ఇవ్వాలంటున్నారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.కాపలా ఉండలేం: తరిగొప్పుల సత్తవ్వ, ముస్త్యాల, చేర్యాల మండలంకందుల సేకరణ చేపట్టగానే మార్కెట్‌కు తేవాలని పది రోజులుగా ఎదురుచూస్తున్నాం. రెండు రోజుల క్రితం పంట తెచ్చాం. వాటికి కాపలా ఉండలేకపోతున్నాం. ఎప్పటికప్పుడు సేకరిస్తే, సమస్య ఉండదు. అందరివీ కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

# ఆగని అక్రమ దందా..!

ఖమ్మం : గ్రానైట్, కంకర క్వారీల నిర్వహణతో రూ.కోట్లు కొల్లగొడుతున్న యజమానులు.. రాయల్టీ చెల్లించకుండా వక్రమార్గాలు అనుసరిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. దొడ్డిదారిన క్వారీలు నిర్వహిస్తూ.. 'నాన్ వర్కింగ్' అని చూపుతూ రాయల్టీ చెల్లించకపోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉల్లంఘనులపై కొరడా ఝులిపించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించుతోంది.

**త్వరలోనే రంగంలోకి..**

రాష్ట్రవ్యాప్తంగా 261 క్వారీలు 'నాన్ వర్కింగ్' జాబితాలో ఉన్నట్లు గనులశాఖ గుర్తించింది. వీటిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని క్వారీలు సుమారు 40 ఉన్నాయని తేల్చింది. కొన్నేళ్లుగా ఆయా క్వారీల్లో ఎలాంటి కార్యకలాపాలు జరపటం లేదని.. వాటి యజమానులు గనులశాఖకు స్పష్టం చేశారు. గనులశాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే 'నాన్ వర్కింగ్' జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఆయా క్వారీల యజమానులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించటం లేదు. గనులశాఖ నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంపై కాంగ్రెస్ సర్కారు సమీక్షలు నిర్వహించింది. గతంలో గ్రానైట్, కంకర క్వారీల యజమానులు మైనింగ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు భూగర్భగనులశాఖ దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్వారీలు, ఉల్లంఘనలకు పాల్పడుతున్న యజమానులపై కొరడా ఝులిపించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి క్వారీల్లో సాగుతున్న అక్రమాలు, ఉల్లంఘనల నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణా, అటవీశాఖల అధికారుల తో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది.

**అనేక చోట్ల ఉల్లంఘనలు**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక క్వారీల్లో ఏళ్లుగా ఉల్లంఘనల తంతు కొనసాగుతోంది. నిషేధిత జాబితాలోని క్వారీల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. కొంతమంది నిర్వాహకులు తమ క్వారీలు పని చేయటం లేదని చూపుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని క్వారీల విషయంలో లెక్కాపత్రమే లేకుండా పోయింది. లీజుల విషయంలోనూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా మైనింగ్‌శాఖ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్వారీల్లో లోపలికి, బయటకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే నిబంధన ఉన్నా విస్మరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని క్వారీలు విద్యుత్తు సౌకర్యం పొందుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొంతమంది అధికారులు ఏళ్లుగా అక్రమాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించటంతో ఉల్లంఘనుల బండారం బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రానైట్, కంకర క్వారీల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పడింది. జిల్లాలోని ఐదు ప్రధాన శాఖల అధికారులు బృందంలో ఉంటారు. ఉన్నతాధికారులు అందించిన జాబితా ప్రకారం బృంద సభ్యులు ఆయా క్వారీల్లో తనిఖీలు చేపట్టనున్నారు. పని చేయని జాబితాలో ఉన్నాయా, పనిచేస్తున్నా నిర్వాహకులు రాయల్టీ ఎగ్గొడుతున్నారా అనే అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. సాయినాథ్, మైనింగ్‌శాఖ ఏడీ, ఖమ్మం

# పల్లె పోరు.. కసరత్తు షురూ..



వికారాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పల్లె పోరుకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా జిల్లా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

నెలాఖరుకు ప్రకటన రానుందనే సమాచారంతో..

ఈ నెలాఖరు నాటికి గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్న సమాచారంతో అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకునే పనిలో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ డబ్బాలు, బందోబస్తుకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

శ్రేణులకు పార్టీల సంకేతాలు: పంచాయతీ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ నేతలు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణులను సిద్ధంగా ఉండాలనే సంకేతాలు ఇచ్చారు.

పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి స్థానిక సంస్థలపై పట్టు సాధించాలని భారాస భావిస్తోంది.

భాజపా కూడా సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది.

**మూడు విడతలకు అవకాశమా..**

జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరిగితే బాగుంటుందని అధికారులు నిర్ధారణకు వచ్చి నివేదిక రూపొందించినట్లు సమాచారం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కొందరు తెలిపారు.

**కలెక్టర్ ఈవీఎంల పరిశీలన**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పాలనాధికారి ప్రతీక్‌జైన్, జిల్లా పోలీసు అధికారి నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని కలెక్టర్ ఒకసారి పరిశీలించి సంతకం కూడా చేశారు.

జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల వివరాలతో పాటు గతంలో చోటు చేసుకున్న గొడవలు జరిగిన గ్రామాల వివరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఎన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారనే విషయాలను సేకరిస్తున్నారు. పంచాయతీ నోటిఫికేషన్ వెలువడగానే పలువురు సిబ్బందిని బదిలీ చేయడానికి వీలుగా అవసరమైన వివరాలు సేకరిస్తున్నారు.

ఒకే విడత పోలింగ్ నిర్వహించాల్సి వస్తే.. ప్రస్తుతం ఉన్న యంత్రాంగం సరిపోతుందా..? ఇంకా ఎంత మంది కావాలని లెక్కిస్తున్నారు.

జిల్లా సమగ్ర స్వరూపం

గ్రామ పంచాయతీలు.. 566

వెన్యూ డివిజన్లు.. 501

రెవెన్యూ గ్రామాలు.. 20

మొత్తం జనాభా.. 12.45 లక్షలు

ఓటర్లు... 10 లక్షలు

వీరిలో పురుషులు.. 4,92,623

మహిళలు..5,07,64

# ఆశావహులకు సదవకాశం



పెద్దపల్లి : ఆర్మీలో చేరాలనుకునే యువతను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అగ్నివీర్ ఎంపికలో అవసరమైన సామర్థ్యాల సాధనకు ప్రభుత్వం ఉచిత నైపుణ్య శిక్షణ అందించనుంది. ఇందుకోసం కలెక్టర్ శ్రీహర్ష చొరవ చూపారు. రెండు నెలల పాటు ఉచిత భోజన వసతితో కూడిన మెరుగైన తర్ఫీదు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాల్లో ఆసక్తి కలిగిన యువత నుంచి కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అగ్నివీర్ అర్హత పరీక్షకు వెళ్లి నిరాశ చెందకుండా ముందుగానే దేహ దారుఢ్యం, మానసికంగా సిద్ధం చేసేలా శిక్షణ ఇస్తారు.

**వ్యసనాల బారిన పడకుండా..**

పల్లెల్లో సరైన మార్గ నిర్దేశం లేక చాలా మంది యువత అర్ధంతరంగా చదువులు ఆపి వ్యసనాల బారిన పడుతున్నారు. గంజాయి, మాదకద్రవ్యాల మత్తులో పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆర్థిక, కుటుంబ పరిస్థితులతో ఇంటర్, డిగ్రీతోనే చదువు ఆపి సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో దేశభక్తి, జాతి సమైక్యతను పెంపొందించి వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు అగ్నివీర్‌లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు.

**దరఖాస్తు గడువు 10**

జిల్లాలో పోలీసుల సహకారంతో దాదాపు 200 మందికి ఉచిత శిక్షణ ఇస్తారు. 2004 ఫిబ్రవరి 20, 2007 ఆగస్టు 20 మధ్యలో జన్మించిన వారిని అర్హులుగా గుర్తించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 10 వరకు దరఖాస్తు గడువుంది. అగ్నివీర్ నియామకాల కంటే ముందే అభ్యర్థులను జిల్లా స్థాయిలో పరీక్షకు సిద్ధం చేస్తారు. ఎంపికైన యువత ఆర్మీలో నాలుగేళ్ల పాటు విధులు నిర్వహిస్తారు. ఉద్యోగ విరమణ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగవకాశాలుంటాయని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అర్హత సాధిస్తేనే ఎంపిక

ఉచిత శిక్షణకు ప్రాథమిక దశలోనే దరఖాస్తుదారుల్లో వడబోత నిర్వహిస్తారు.

ఎనిమిది, పదో తరగతి చదివిన వారు అర్హులు.

విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనతో పాటు 18 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

400 మీటర్ల పరుగు పందెం, వంద మార్కులకు అర్హత పరీక్ష ఉంటుంది.

అన్నింటిలో అర్హత సాధించిన వారిని ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారు.

నిపుణులు, వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మెలకువలు నేర్పిస్తారు.

అగ్నివీర్ సామర్థ్యాలను నేర్పిస్తూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతారు.

సద్వినియోగం చేసుకోవాలి

సైన్యంలో చేరాలనుకునే వారికి మంచి అవకాశం. కలెక్టర్ ఆదేశాలతో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇందుకోసం ముందుగా అన్ని రకాల అర్హత పరీక్షలు నిర్వహిస్తాం. ఫిజికల్ ఫిట్‌నెస్, ఇతర పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రెండు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఉంటుంది.

–సురేష్, జిల్లా యువజన సర్వీసులు క్రీడా శాఖ అధికారి

# స్వచ్ఛత దిశగా అడుగులు

కరీంనగర్ : స్వచ్ఛతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకొచ్చి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి.. ఎక్కడ పడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయకుండా ప్రజావసరాలకు తగ్గట్లుగా టాయిలెట్లు ఉండాలనే లక్ష్యంగా వీటిని నిర్మించేందుకు నిధులు కేటాయించాయి.నగరాలు, పురపాలికల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో గత ప్రభుత్వంలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ 2.0లో పథకంలో భాగంగా కొత్తగా మరుగుదొడ్లను నిర్మించేందుకు ముందుకొచ్చింది. అవసరమున్న ప్రాంతాల్లో వీటిని నిర్మించుకునే వీలుంది. గతంలో నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన పనులు కూడా పూర్తి చేసుకునేందుకు ప్రతిపాదనలు చేసుకోవచ్చు. 16 పురపాలికల్లో 152 సీట్లతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80 కోట్లు కేటాయించారు.

**అవసరమున్న చోట మరుగుదొడ్లు**

ప్రభుత్వ స్థలాలు ఉన్న చోటనే వీటిని ప్రతిపాదిస్తుండగా జన సంచారం ప్రాంతాల్లో నిర్మించాలనే డిమాండ్ ఉంది. జనం లేని చోట నిర్మిస్తే రోజుకు కనీసం పది మంది కూడా ఉపయోగించుకోవడంలేదు. అవి




నిరుపయోగంగా ఉండి, నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం అలా చేయకుండా చూడాల్సిన అవసరముంది. ఈ విషయాన్ని శానిటేషన్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా కొత్త నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**జనాభాకు తగ్గట్లుగా నిర్మాణాలు..**స్వచ్ఛ భారత్ నిబంధనల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక సీటు చొప్పున ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలి. కరీంనగర్‌లో 2011 జనాభా ప్రకారం 24 ప్రజా మరుగుదొడ్లు ఉన్నాయి. మిగతా పట్టణాల్లో ఆ స్థాయిలో నిర్మించకపోవడం, ఉన్న చోట్ల పనులు ఆగిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. 2026 సంవత్సరం నాటికి జనాభాను అంచనా వేసి మరుగుదొడ్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. స్థలాల ఎంపిక సవాల్‌గా మారింది.

# దారులు విస్తరిస్తూ.. వారధులు విస్మరిస్తూ

పెద్దపల్లి: గ్రామీణ ప్రాంత రహదారులను విస్తరిస్తున్నా ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకపోవడంతో సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. అవసరమైన ప్రాంతాల్లో వంతెనలు, కల్వర్టులు నిర్మించకపోవడంతో ఇరుకు దారుల్లో వాహనాల రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పలు మండల కేంద్రాలను పెద్దపల్లికి అనుసంధానించేలా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో పెద్దపల్లి నుంచి కొలనూర్ మీదుగా ఓదెలకు చేపట్టిన పనుల్లో ఒక్క వంతెన మాత్రమే అభివృద్ధికి నోచుకోగా, మిగిలిన వారధుల వద్ద అవస్థలు తప్పడం లేదు.

**ప్రాధాన్య క్రమంలో అనుమతి**

రహదారి విస్తరణ చేపట్టిన ప్రాంతాల్లో పాత బ్రిడ్జిలు 7.5 మీటర్ల వెడల్పున్న చోట ఇబ్బందులు లేవు. వంతెనలు, కాజ్‌వేలు ఇరుకుగా ఉన్న చోట కొత్త వంతెనల నిర్మాణానికి 40 ప్రతిపాదనలు రూపొందించాం. ప్రాధాన్య క్రమంలో వీటన్నింటికీ అనుమతి వస్తుంది. ప్రస్తుతం దస్తగీర్‌పల్లి–కొత్తపల్లి మధ్య కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మిస్తున్నాం.

–బావ్‌సింగ్, ఆర్అండ్‌బీ ఈఈ

**పనులకు ప్రయోజనమేదీ!**

పెద్దబొంకూర్ సమీపంలోని హుస్సేన్‌మియా వాగు వంతెనపై సైడ్‌వాల్




నిర్మించలేదు. కేవలం దిమ్మెలు మాత్రమే ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ప్రమాదాలకు ఆస్కారముంది. ఏటా వానాకాలంలో వంతెనపై తరచూ నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ సైడ్‌వాల్ నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది.

కొత్తపల్లి వద్ద గతంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇటీవల నీళ్లు నిలవకుండా మరమ్మతు పనులు చేపట్టారు. ఇక్కడ కూడా ఒకే వాహనం వెళ్లేంతగా స్థలం ఉంది. విస్తరణ పనులకు అనుగుణంగా రెండు వరుసల ఆర్‌యూబీ నిర్మిస్తే వాహనదారులకు అనుకూలంగా ఉంటుంది.జూలపల్లి నుంచి పెద్దపల్లి మార్గంలోనూ పలు చోట్ల వంతెనలు, కల్వర్టులు ఇరుకుగా ఉన్నాయి. జూలపల్లి, వడ్కాపూర్ మధ్య కాజ్‌వే వద్ద రహదారి విస్తరణ పనులకు అనుగుణంగా వంతెన నిర్మించాలి.వడ్కాపూర్, కాచాపూర్ మధ్య వంతెన ఇరుకుగా ఉండటంతో రెండు వైపులా రహదారిని విస్తరించినా ప్రయోజనం లేకుండా పోతోంది.

# చక్కని దస్తూరి.. మార్కుల దిక్సూచి

వెల్గటూరు: చక్కని చేతిరాత విద్యార్థుల ఉన్నత భవితకు ఎంతో తోడ్పాటునిస్తుంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మార్కుల సాధనకు అందమైన దస్తూరి దోహదం చేస్తుంది. మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు మార్కుల సాధన, చేతిరాత పట్ల కొంత ఆందోళన ఉంటుంది. దీనిని అధిగమించేందుకు చేతిరాతను సాధన చేయాల్సిన అవసరం ఉంది. 'ఒక్కసారి రాసింది.. వందసార్లు చదివిన దానితో సమానం' రాస్తూ చదవడం వల్ల విద్యార్థులకు ఏకకాలంలో రెండు ప్రయోజనాలు చేకూరుతాయి. మార్చిలో జరగబోయే పది, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక కథనం.



**మార్గదర్శకాలివే**

జవాబు పత్రంలో పేజీ పైభాగంలో, ఎడమ వైపున అంగుళం చొప్పున, కుడి వైపున అర అంగుళం చొప్పున మార్జిన్ వదిలి పెట్టాలి.

స్కెచ్ పెన్నులు, ఇతర అచ్చులు పడే దట్టమైన సిరా ఉండే పెన్నులు వాడితే తర్వాత పేజీల్లో వాటి ఆనవాళ్లు కనిపిస్తాయి. అలాంటివి వాడకుండా సాధారణ బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే వినియోగించాలి.కొట్టివేతలు లేకుండా పదాల నిర్ణీత దూరాన్ని అవసరమైన నిడివి వదిలి పెడుతూ సరైన క్రమ పద్ధతిలో రాయాలి. గణితంలో అంకెలు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమయ్యేలా స్పష్టంగా రాయాలి. లేకుంటే మార్కులు కోల్పోయే అవకాశం ఉంటుంది. విద్యార్థులు తమ చేతిరాతకు అనుకూలంగా ఉండే పెన్నులను ఎంపిక చేసుకోవాలి. శీర్షికలు, ఉప శీర్షికలు, ముఖ్యాంశాలు స్పష్టంగా కనిపించేలా కింద గీతలు (అండర్‌లైన్) గీయాలి.గొలుసు కట్టు రాతలు, అక్షరంపై మరో అక్షరం రాయకూడదు. కూర్చునే విధానం, పెన్ను పట్టుకునే విధానం కూడా దస్తూరికి దోహదం చేస్తుంది.స్పష్టంగా ఉండేలా సాధన: సూర్యనారాయణ, గ్రాఫాలజిస్ట్

అక్షరాలు స్పష్టంగా ఉండేలా రాయడం సాధన చేయాలి. పదాల మధ్య నిడివి పాటించాలి. దస్తూరి కోసం చూచిరాతలను సాధన చేస్తే క్రమంగా అందమైన దస్తూరి సొంతం అవుతుంది. ప్రతీనిత్యం పరీక్షల సాధనలో భాగంగా కనీసం అరగంట రాయడానికి కేటాయించాలి. కొట్టివేతలు, దిద్దుళ్లు లేకుండా జాగ్రత్త పడాలి.

అంతర్గత పరీక్షల్లో పూర్తి మార్కులు– మైలగాని మాధురి, పదో తరగతి చిన్నప్పటి నుంచే చేతిరాతపై దృష్టి సారించా. పాఠశాల స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన అంతర్గత పరీక్షల్లో పూర్తిస్థాయిలో మార్కులు సాధించాను. పదో తరగతిలో సైతం 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నా. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో సాధన చేస్తున్నా.పదో తరగతి విద్యార్థుల వివరాలు

జగిత్యాల: 11855

కరీంనగర్: 12516

సిరిసిల్ల: 6902

పెద్దపల్లి: 7393

చురకలు



# ప్లాట్లు కొంటే పాట్లే



అల్వాల్ : జీహెచ్ఎంసీలో విలీనమై రెండు దశాబ్దాలు కావస్తున్నా అల్వాల్‌లో స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యవసాయ భూముల్లో లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. నిన్నటి వరకు పంటపొలాలుగా, తోటలుగా ఉన్న భూములను ప్లాట్లుగా మారుస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈవ్యవహారంలో రూ.కోట్లలో జీహెచ్ఎంసీ ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకొనే వారే కరవయ్యారు.

**ప్రత్యేక ముఠా**

భూమార్పిడి జరగకుండనే ఆయా స్థలాల్లో ఎప్పుడో తాతల కాలంలో గ్రామపంచాయతీ అనుమతులు ఇచ్చినట్లుగా లేఅవుట్లు రూపొందిస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో లేఅవుట్ చేయాలంటే మొదట ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. జీహెచ్ఎంసీ అనుమతి పొందాకే లేఅవుట్ చేసి విక్రయాలు జరపాలి. ఇవేమి పట్టించుకోకుండా ఇక్కడ లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలోని కొన్ని నిబంధనలకు తమకు అనుకూలంగా మలచుకొని ఎప్పుడో ఏళ్లక్రితం చనిపోయిన మాజీ సర్పంచుల సంతకాలను ఫోర్జరీ చేసి పాత తేదీలతో లేఅవుట్లు, నిర్మాణాలకు అనుమతులు జారీ చేయిస్తున్నారు. ఇందుకు ఓ ముఠా పనిచేస్తోంది. చివరకు ప్రజాప్రయోజనాలకు వదిలిన స్థలాలపైనా కన్నేస్తూ అప్పటికప్పుడు దస్త్రాలు పుట్టించి మాయచేస్తున్నారు. ప్రభుత్వ, సీలింగ్ స్థలాలను సైతం అమాయకులకు అమ్మేస్తున్నారు.

**దండుకొంటున్నారిలా..**

అల్వాల్ పరిధిలో అధికశాతం వ్యవసాయ భూములే. రికార్డు ప్రకారం మండల పరిధిలో 382 ఎకరాల్లో సాగు కొనసాగుతోంది. కొంతమంది అవినీతి అధికారులను బుట్టలో వేసుకొని స్థిరాస్తి వ్యాపారులు లేఅవుట్ క్రమబద్ధీకరణ పొందారు. మరికొందరు 14శాతం అపరాధ రుసుము చెల్లించి ఇంటి అనుమతులు పొందవచ్చన్న లొసుగుతో లేఅవుట్లు రూపొందిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం నిబంధనలకు విరుద్ధమైనా... అవినీతి అధికారులకు, రియల్ వ్యాపారులకు కోట్లు తెచ్చిపెడుతున్నాయి. భారీగా ధరలు పెట్టి కొనుగోలు చేసినా కొన్ని లేఅవుట్లలో ఇంటి అనుమతికి రూ.లక్ష వరకు ముడుపులు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇంత వ్యయం చేసి ఇళ్లు కట్టుకున్నా మౌలిక సదుపాయాల కోసం సంవత్సరాల కొద్దీ ఎదురు చూస్తున్నారు.

**లేఅవుట్లు గుర్తించాం**

శ్రీనివాస్‌రెడ్డి, ఉపకమిషనర్

సర్కిల్ పరిధిలో ఇటీవల కొన్ని అక్రమ లేఅవుట్లను గుర్తించి పనులుని లిపివేయించాం. స్థలాలు కొనేముందు ప్రజలూ జాగ్రత్తగా వ్యవహరించాలి. అవసరమైతే సర్కిల్ ప్రణాళిక విభాగంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

## వేసవి సెగ.. సాగునీటి వెత

ఎల్లారెడ్డిపేట: ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా నీటిని వినియోగిస్తే చి'వరి'కి సాగునీరు అందని పరిస్థితులు నెలకొంటాయి. నీటి వృథాతో మున్ముందు కష్టాలు ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈనేపథ్యంలో ఇప్పటి నుంచే నీటి వృథాను అరికడితేనే అన్నదాతలకు మేలు జరగనుంది.

జిల్లాలో 1,01,062 హెక్టార్లు సాగుకు యోగ్యమయ్యే భూములున్నాయి. జిల్లాలోని జలవనరుల్లో పూర్తిస్థాయిలో నీరు చేరింది. ప్రస్తుతం సాగునీటి వనరులు నిండుకుండలను తలపిస్తుండగా భూగర్భ జలాలు పైకివచ్చాయి. జనవరిలో జిల్లా సగటున 7.98 మీటర్ల మేర భూగర్భజల మట్టాలున్నాయి. పల్లెల్లోని సాగు నీటి వనరులు నీటితో నిండిపోగా ఈ యాసంగిలో ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణాధారంగా నిలుస్తున్న బోర్లు, బావులు జీవం పోసుకున్నాయి. సాగునీటి లభ్యత ఆధారంగా జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులు యాసంగిలో ఇప్పటికే పంటలను సాగు చేశారు. జిల్లాలో బోర్లు, బావుల కింద పంటలు సాగయ్యే ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఇల్లంతకుంట తదితర మండలాల్లో ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి.



**వృథాతో అనర్థం**

జిల్లాలో వ్యవసాయానికి బోర్లు, బావులే పెద్ద దిక్కుగా నిలుస్తూ వస్తున్నాయి. వర్షాధార పంటలు మినహాయిస్తే 35,212 హెక్టార్ల భూములు బోర్లు, బావుల కిందే సస్యశ్యామలవుతాయి. భూగర్భ జల మట్టాలు వృద్ధి చెందడంతో పంటలకు జీవం పోసినట్లయింది. చెరువులు, కుంటల కింద కేవలం 15,175 హెక్టార్ల విస్తీర్ణంలో భూములు సాగులోకి రావడాన్ని బట్టి చూస్తే బోర్లు, బావులకు ఉన్న ప్రాధాన్యత అర్థమవుతోంది. వీటికి తోడు నీటి వనరులు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు భూములకు సాగునీటిని వదిలారు. ఇబ్బడిముబ్బడిగా నీటిని వినియోగించడం వల్ల పంటలకు ఎలాంటి ప్రయోజనం చేకూరకపోగా నీటి వృథాతో మున్ముందు కష్టాలు ఎదురవనున్నాయి. అనతికాలంలోనే ఖాళీ అవడంతోపాటు భూగర్భ జల మట్టాలు కిందకు దిగజారనున్నాయి. వేసవిలో సాగునీటి కష్టాలు ఎదురుకానున్నాయి. పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తనుంది. ఈ విషయంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వరి పంటకు ఎక్కువ వినియోగం

జిల్లాలో వరిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం లేదు. అవసరానికి మించి వినియోగించడం పరిపాటిగా మారింది. ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపడం లేదు. వరి జీవిత కాలం 125 నుంచి 135 రోజులు. ఎకరా విస్తీర్ణంలో వరి సాగుచేస్తే 1250 మిల్లీమీటర్ల నీరు అవసరమవుతుంది. వరిపైరు పొట్ట, ఈనే దశలో మాత్రమే వరి పొలానికి ఎక్కువగా నీటిని అందించాలి. దీనిపై అవగాహన లేక రైతులు భారీగా వినియోగిస్తున్నారు. పొలాన్ని ఆరబెడుతూ నీటిని అందిస్తే పిలకలు ఎక్కువగా వస్తాయి. మొక్కజొన్న చేతికి అందాలంటే 500 మిల్లీమీటర్ల నీరు అవసరం. పెసర, శనగ తదితర పంటల సాగుకు 250 నుంచి 300 మిల్లీమీటర్ల నీరు అవసరం. సమృద్ధిగా ఉన్న జలాన్ని పరిమితికి మించకుండా వాడకుండా ఉంటే మేలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వ స్వాధీన భూమి

సిరిసిల్ల : జిల్లాలో ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు చేసుకున్న వైనాన్ని రెవెన్యూ యంత్రాంగం వెలుగులోకి తెచ్చింది. కొందరు స్వచ్ఛందంగా అప్పగించగా.. మరికొన్నింటిని అధికారులే గుర్తించి ధరణిలో ప్రభుత్వ భూమిగా మార్చారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో 360 ఎకరాలను గుర్తించారు. వీటిలో సాగులో ఉన్న భూమి, నిరుపయోగంగా ఉన్నది వేర్వేరుగా గ్రామాల వారీగా సిద్ధం చేస్తున్నారు. ఈ భూమిని సొంత స్థలం లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పంపిణీ చేయనున్నారు. మిగతా భూమిని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పరిశ్రమలు నెలకొల్పడం, ఇతర అవసరాలకు ప్రభుత్వ భూ నిధిగా మార్చుతున్నారు. జనవరిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వే, తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల



కోడ్ రావడంతో అధికారులు ఆయా విధుల్లో నిమగ్నమయ్యారు. దీంతో భూముల గుర్తింపు ప్రక్రియకు తాత్కాలికంగా విరామం ఇచ్చారు.

జిల్లాలో 5.54 లక్షల జనాభా ఉంది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,07,398 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1,05,893 దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇవికాక ప్రజాపాలన గ్రామ సభల్లోనూ 5,031 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తొలి విడతగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి భూమి ఉండి ఇళ్లు లేని వారికి అర్హత పత్రాలను అందజేశారు. కాగా తొలి విడత నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున జిల్లాకు ఏడు వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. జిల్లాలో కేటగిరీ వారీగా నివాసాల సంఖ్య తేలింది. సొంతిళ్లతో పాటు అద్దె భవనాల్లో ఉంటున్న కుటుంబాలపై స్పష్టత వచ్చింది. సొంత ఇంట్లో నివాసం ఉంటున్నవారు 67,969 మంది కాగా, అద్దె ఇంట్లో 36,269 కుటుంబాలు ఉంటున్నాయి. ఇంటి నిర్మాణానికి స్థలాలు లేని వారు 14,542 మంది ఉన్నారు. వీరికి రెండో విడతలో ఒక్కో లబ్ధిదారుడికి 400 చదరపు అడుగుల స్థలం పంపిణీతోపాటు ఇంటిని మంజూరు చేయనున్నారు. దీనికోసం మండలాలు, గ్రామాల వారీగా నివాస స్థలాలకు అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సూచించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనా ఆధారంగా పరిశీలిస్తే ఒక ఎకరంలో 60 నుంచి 70 గృహాలకు అవకాశం ఉంది. ప్రభుత్వం పంపిణీ చేసే స్థలంలో లేఅవుట్ ఏర్పాటు చేశాకే పంపిణీ జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 200 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా గుర్తించారు.

## హద్దులు నిర్ణయించి.. ఆక్రమణలు తేల్చి!




హైదరాబాద్: చెరువులను సంరక్షించే చర్యలను హైడ్రా వేగవంతం చేసింది. ప్రజావాణి, ఇతరత్రా మార్గాల్లో వస్తోన్న భూ ఆక్రమణల ఫిర్యాదులను పరిష్కరిస్తూనే.. ప్రధాన లక్ష్యాన్ని నెరవేర్చేందుకు న్యాయ నిపుణులతో కలిసి రంగంలోకి దిగింది. గడిచిన 15 ఏళ్లలో గ్రేటర్‌లోని 185 చెరువులకుగాను.. కేవలం 55 తటాకాలకే ఎఫ్‌టీఎల్(పూర్తిస్థాయి నీటి మట్టం) నిర్ధారణ జరిగింది. మరోసారి జాప్యం కావొద్దన్న ఉద్దేశంతో.. హైడ్రా ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తోంది. త్వరలోనే ప్రయోగాత్మక ప్రాజెక్టును చేపడతామని, రోజుల వ్యవధిలో 10 చెరువులకు ఎఫ్‌టీఎల్‌ను ప్రకటించి, హైదరాబాద్ భవిష్యత్తుకు ఉపయోగపడే కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

**న్యాయ నిపుణులతో కలిసి..**ఇప్పటి వరకు చెరువులకు ఎఫ్‌టీఎల్‌ను గుర్తించిన విధానం వల్ల చట్టపరమైన సమస్యలు, చెరువును రక్షించే అవకాశాలు తక్కువగా ఉండటం వంటి లోపాలను హైడ్రా గుర్తించింది. వేగంగా, చట్టపరిధిలో హద్దులను గుర్తించడంపై కమిషనర్ రంగనాథ్ దృష్టి పెట్టారు. సర్వే ఆఫ్ ఇండియా ట్రోపోషీట్లు, గ్రామ రెవెన్యూ పటాలు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ కేంద్రాల ఉపగ్రహ చిత్రాలను బేరీజు వేసి 1025 చెరువులు ఓఆర్ఆర్ లోపల ఉన్నట్టు లెక్క తేల్చారు. సర్వేచేసి క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకుంటూ.. తటాకాల వారీగా వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఉపగ్రహ చిత్రాల్లోని చెరువు విస్తీర్ణాన్ని ఎఫ్‌టీఎల్‌గా తేల్చి, తుది నోటిఫికేషన్ ఇవ్వడంపై హైడ్రా కసరత్తు చేస్తోంది.

**త్వరలోనే పది చెరువులకు..**

గతంలో ఓ చెరువుకు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలంటే.. నెలలు పట్టేది. తాజాగా మొదట 100 చెరువులకు ఎఫ్‌టీఎల్ ప్రకటించాలని, అందులో 10 తటాకాల నోటిఫికేషన్లను త్వరలోనే వెలువరించ నున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్రమంగా మిగిలిన వాటి హద్దులను నిర్ణయిస్తామంటున్నారు. ప్రాథమిక నోటిఫికేషన్‌తోనే.. ఆక్రమణల లెక్క తేల్చి, ఆగస్టు, 2024 తర్వాత నిర్మించిన వాటిని కూల్చివేస్తామంటున్నారు.

## దుమ్ము కాలుష్యం.. ప్రజలకు అనారోగ్యం



తాండూరు : అధికలోడు వాహనాలతో రేగుతున్న 'దుమ్ము కాలుష్యం' స్థానికులను అనారోగ్యం బారిన పడేస్తోంది. రయ్‌రయ్ మంటూ వెళ్తున్న వాహనాల శబ్ద కాలుష్యంతో చెవిపోటు పెరిగిపోతోంది. శారీరక వ్యాధులు సంక్రమిస్తున్నాయి. వెరసి నిత్యం ఇబ్బందులు పడుతున్న స్థానికులు అధికలోడు వాహనాలను నిలువరించాలంటూ ఇటీవలే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

**పత్తాలేని సున్నపురాయి ఎగుమతి నిబంధనలు**తాండూరు మండలం బెల్కటూరులో సిమెంట్ కర్మాగారాలను ప్రతిరోజు 3వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్వహిస్తున్నారు. రాత్రీ పగలూ సిమెంటు ఉత్పత్తుల్ని కొనసాగిస్తున్నారు. అందుకు అవసరమైన ముడిసరకు సున్నపురాయిని కరణ్‌కోటలోని మైనింగ్ ప్రదేశం నుంచి కర్మాగారానికి తరలిస్తున్నారు. సున్నపురాయి ఎగుమతిలో నిబంధనల్ని పాటించడం లేదు. 15 టన్నులు చేరవేయాల్సి ఉండగా ఏకంగా 30 నుంచి 40 టన్నులు టిప్పరు పైభాగం వరకు కుప్పగా పోసి తరలిస్తున్నారు. ఈక్రమంలో గుంతలు, స్పీడ్‌బ్రేకర్ల వద్ద కుదుపులతో సున్నపురాయి కింద పడుతోంది. దీంతో టిప్పర్ల వెనకాల, పక్కన రాకపోకలు సాగించే వాహనదారులకు తగిలి గాయపడుతున్నారు.

**శ్వాస, ఊపిరితిత్తులు వంటి వ్యాధులతో సతమతం**

ఉదయం నుంచి రాత్రి దాకా టిప్పర్ల రాకపోకలతో వెలువడుతున్న దుమ్ము కాలుష్యంతో రహదారికి రెండు వైపులున్న 9, 10, 11, కార్మికుల కాలనీ, ఆచార్య జయశంకర్ కాలనీవాసులు అవస్థ పడుతున్నారు. నివాసాలు, పచ్చని చెట్లు తెల్లరంగులో దర్శనమిస్తున్నాయి. కాలుష్యంతో శ్వాస, ఊపిరితిత్తులు, చర్మ, కంటి సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తే 300లకుపైగా స్థానికులు కంటి సమస్యలతో వైద్యులను ఆశ్రయించారు. వీరిలో 30 మందికిపైగా గ్రామస్థులను హైదరాబాద్ తరలించి కంటి శస్త్ర చికిత్సలు చేయించాల్సి వచ్చింది. ఈ క్రమంలో గ్రామస్థులు అధికలోడు వాహనాలను రెండు నెలల క్రితం అడ్డుకున్నారు. తిరిగి వాహనాలను యధావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వాహనాల దుమ్ము కాలుష్యాన్ని అరికట్టి, తమ ఆరోగ్యాలను కాపాడాలంటూ రెండు రోజుల క్రితం తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదు చేశారు. వెంటనే అధికలోడు సున్నపురాయి ఎగుమతులకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## జలాశయంలో నీరు.. సాగు భూములకు అందని తీరు

కోనరావుపేట : మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయటానికి గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టింది. దీనిలోకి మధ్యమానేరు ద్వారా గోదావరి జలాలను తరలించి తద్వారా సాగు భూములకు నీరందించాలన్నది లక్ష్యం. అయితే కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చెరువులు, కుంటలు నింపే పరిస్థితి లేదు. జిల్లాలో కోనరావుపేట మండలం మల్కపేటలో సుమారు రూ.వేయి కోట్ల వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర క్రితం రెండు పంపు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించి మధ్యమానేరు నుంచి గోదావరి జలాలను నింపారు. జలాశయం సామర్థ్యం 3 టీఎంసీలకు గాను 1 టీఎంసీ మేర నిల్వ చేశారు. ప్రస్తుతం నీరు తగ్గింది. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జలాశయంపై దృష్టిసారించారు. నీటిపారుదల ఉన్నతాధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. మాధ్యమానేరు నీటి లభ్యత ఆధారంగా ఇందులోకి నీటి తరలింపునకు చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, పంపు



మోటార్ల గుత్తేదారులు 0.2 టీఎంసీ నీటిని తరలించారు. దీంతో ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. జలాశయం దిగువ, ఎగువ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో బోరుబావులకు నీరు అంది పంటల సాగుకు అవకాశం ఏర్పడింది.

**నిర్మాణం ఇలా...:** జలాశయం కుడి కాలువ సుమారు 12.03 కిలో మీటర్లు ఉంది. వేములవాడ అర్బన్ మండలం మారుపాక వరకు ఉంది. అక్కడక్కడ వదిలేయడంతో 11 కిలో మీటర్లు పనులను రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. మల్కపేట ఊర చెరువు శిఖం భూములు 40 ఎకరాల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రైతులు కాలువ తవ్వకానికి అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. ః నాగారం–పల్లిమక్త మధ్య ప్రధాన రోడ్డులో కాలువ ద్వారా నీటి సరఫరాకు వంతెన నిర్మించాల్సి ఉంది.

ఎడమ కాలువ సుమారు 7 కిలో మీటర్లు కాగా భూసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పల్లిమక్త, సుద్దాల, మల్కపేట గ్రామాల్లోని పలు చోట్ల సీసీ నిర్మించాల్సి ఉంది.

చెరువులు నింపితే మేలు

మాది ఉమ్మడి కుటుంబం. అంతా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు 10 ఎకరాల భూమి ఉంది. కుడి కాలువ నిర్మాణంలో ఎకరం కోల్పోయ్యా. నాలుగు బోరుబావుల ద్వారా మిగిలినది యాసంగిలో వరి సాగు చేశాం. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోతాయి. పంటలు చేతికందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన కాలువలను పూర్తి చేసి చెరువులు నింపితే యాసంగి పంటలు ఎండిపోకుండా ఉంటాయి.

జిన్న అనిల్, రైతు, పల్లిమక్త

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

మల్కపేట ఊర చెరువు శిఖం భూముల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వరాదు. మల్కపేట రైతుల సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరిస్తే సుమారు అర కిలో మీటరు మేర కాలువ తవ్వకం చేపడితే గొలుసు కట్టు కాలువల ద్వారా సుమారు 10 చెరువులను నింపటానికి అవకాశం ఉంటుంది. వినోద్, డీఈ, మల్కపేట రిజర్వాయర్

## వేగానికి అడ్డుకట్ట.. ఇష్టమొచ్చినట్లు వద్దు!

కరీంనగర్ : కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. నగర వ్యాప్తంగా 120 కిలోమీటర్ల పొడవునా కొత్త రహదారులు నిర్మించారు. రోడ్లపై ఇబ్బందులు లేకుండా ఉండటంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్ల వేగం విపరీతంగా పెరిగింది. గల్లీ రోడ్లపై రయ్‌మంటూ దూసుకెళ్తుండటంతో చిన్న పిల్లలు బయట తిరగాలంటే భయపడుతున్నారు. ఎక్కడా వేగ నిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా ప్రాంతవాసులు చెబుతున్నారు.



**నడుము విరిగేలా కట్టలు**

కొన్ని ప్రాంతాల్లో కాలనీవాసులు ఇష్టానుసారంగా వేగ నిరోధకాలు వేసి నడుము విరిగేలా చేస్తున్నారు. సిమెంటుతో కట్టలు కట్టినట్లుగా కట్టి కనీసం ఎలాంటి సూచికలు, మార్కింగ్ పెట్టడం లేదు. ఏడాది కిందట దుర్గమ్మగడ్డ, ఖాన్‌పురలో ఏర్పాటు చేస్తే ఒకరిద్దరు పడిపోయి ఆసుపత్రి పాలయ్యారు. కమిషనర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో తొలగించారు.

**ప్రమాణాలు తప్పనిసరి..**

ప్రధాన, అంతర్గత రహదారులపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేస్తే రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించాలి. సిమెంటు, తారు కట్టల మాదిరిగా కాకుండా వాహనాల టైర్లు నెమ్మదిగా కదిలేలా స్పీడ్ బ్రేకర్లు ఉండాలి. నగరంలో పలు చోట్ల రబ్బరుతో తయారు చేసిన వేగ నిరోధకాలు ఏర్పాట్లు చేశారు. దాంతో వాహనాల వేగం పూర్తిగా తగ్గుతుంది. అలాంటివి వేసుకోవడానికి కాలనీ కమిటీలు ఆలోచన చేయాలి. వేగ నిరోధకం ఉన్నట్లుగా ముందస్తుగానే వంద మీటర్ల దూరంలో హెచ్చరిక బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

చురకలు



## కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడో!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వ వైఖరి వేలాదిమంది బీడీకార్మికుల పాలిట శాపంగా మారింది. 2014 ఫిబ్రవరి 28 వరకు పీఎఫ్ ఖాతాలో నమోదైనవారికే జీవనభృతి పింఛన్లు అందిస్తున్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ అమల్లోకి రాకపోగా ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారాస రెండుసార్లు అధికారంలో ఉన్నపుడు కటాఫ్ తేదీని ఎత్తివేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఎత్తివేయక అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా పీఎఫ్ ఖాతాకలిగిన ప్రతిఒక్కరూ ఆసరా పింఛన్‌కు దరఖాస్తు చేయాలని గతంలో ప్రభుత్వం సూచించటంతో వేలాదిమంది దరఖాస్తు చేశారు. 18-50 ఏళ్లలోపు వయసువారు 1.5 లక్షల్లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకుఖాతా, రేషన్‌కార్డు, ఈపీఎఫ్ అపాయింట్మెంట్‌లెటర్, ఆన్‌లైన్ స్టేట్మెంటు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో ఎంపీడీవో కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో అందించారు. కానీ వీరికి ఇప్పటికీ పింఛన్ మంజూరు



కాలేదు. పూర్వపు కరీంనగర్ జిల్లాలోని లక్షలాదిమందికి దశాబ్దాలుగా ఉపాధి కల్పించిన బీడీ పరిశ్రమ క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఆసరా ఫింఛన్ పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్యరీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉండగా సిరిసిల్ల జిల్లా నాలుగోస్థానంలో ఉండటం ఇక్కడివారి అనుబంధ ఉపాధిని వెల్లడిస్తోంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రధాన పట్టణాలు, మండలాలు, పల్లెల్లోనూ బీడీ పరిశ్రమ ఆధారితంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 46 వరకు బీడీ కంపెనీలుండటం ఇక్కడి బీడీ పరిశ్రమ ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. పల్లెలు, పట్టణాలని తేడాలేకుండా చాలామంది బీడీలు చుట్టడాన్ని ఉపాధిగా మలచుకోగా బీడీ తయారీ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రభావం, చవకరకం సిగరెట్ల పోటీతో బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గి ప్రస్తుతం నెలలో తగినన్ని పనిరోజులు లేనందున కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ, బీడీల తయారీకి తగినట్లు తునికాకును సరఫరా, బీడీల తయారీ ధరను పెంచటం, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల రాయితీ ఇవ్వటం, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించి తమ పిల్లలకు ఉపకార వేతనాల మంజూరు, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందించటం, అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపుతోనే తమ మనుగడ సాగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

## అన్నదాత ఇంట.. సిరుల పంట

పెద్దపల్లి : జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో అన్నదాత పంట పండింది. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రచారం సత్ఫలితాలనిచ్చింది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులతో అధికారులు అంచనా వేసిన దాని కంటే ధాన్యం దిగుబడి స్వల్పంగా తగ్గింది. బోనస్ చెల్లింపుతో రైతులకు గిట్టుబాటు కలిగింది. ఈ సీజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం ఊరట కలిగించింది.

**50 వేల ఎకరాలు అధికం**

వానాకాలంలో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. ఇందులో 1.72 లక్షల ఎకరాల్లో సన్న రకం, 36 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు పెరిగింది. ఈ మేరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 90 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రానుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి పైర్లు పొట్ట దశలో ఉన్నపుడు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గింది. జిల్లాలో ఇప్పటివరకు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో 64 వేల టన్నులు, మిల్లర్లు నేరుగా 30 వేల టన్నులు కొనుగోలు చేశారు. సన్న ధాన్యానికి సంబంధించి 2.18 లక్షల టన్నులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించగా మరో 20 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. రైతులు సొంత అవసరాలకు మరో 30 వేల టన్నులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

**కలిసొచ్చిన అధికారుల ప్రచారం**

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో జిల్లాలో సన్న వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. సీజన్ ఆరంభం నుంచే బోనస్ చెల్లింపుపై అధికారులు ప్రచారం చేశారు. ఊహించినట్లుగానే రైతులకు బోనస్ లాభదాయకంగా మారింది. క్వింటాలుకు రూ.500 చెల్లిస్తుండటంతో పెట్టుబడుల భారం తప్పుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 50,523 మంది రైతుల నుంచి రూ.658.74 కోట్ల విలువైన 2.83 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 48,538 మందికి రూ.657.03 కోట్లు చెల్లించారు. 1.98 లక్షల టన్నుల సన్న ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయగా మొత్తం రూ.99 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా రూ.75.59 కోట్లు జమయ్యాయి.

**ఆర్థిక భారం తీరింది**

నాకున్న మూడున్నర ఎకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని సన్న వరి సాగు చేశా. తెగుళ్ల నివారణ చర్యలు తీసుకున్నా. మొత్తం 160 క్వింటాళ్ల దిగుబడి రాగా ప్రభుత్వం నుంచి రూ.80 వేల బోనస్ వచ్చింది. పెట్టుబడి ఖర్చులకు ఆర్థిక భారం తీరింది. -మార్త దేవేందర్, మచ్చుపేట, ముత్తారం మండలం

**రూ.1.35 లక్షల బోనస్** తొమ్మిదెకరాల్లో సన్న వరి వేశా. ఎకరాకు 30 క్వింటాళ్ల చొప్పున 270 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం రూ.1.35 లక్షల బోనస్ వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రైతులకు ప్రోత్సాహకంగా ఉంది. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుండగా బోనస్ చెల్లింపులు మాకెంతో అండగా నిలిచాయి. -గంధం మహేందర్, మల్లాపూర్, ధర్మారం

# సాగర్ చుట్టూ సరికొత్త సొగసులు



హైదరాబాద్: చారిత్రక హుస్సేన్‌సాగర్ సరికొత్త రూపు సంతరించుకోనుంది. ఖైరతాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లను అనుసంధానిస్తూ సాగర్ చుట్టూ నిర్మించ తలపెట్టిన స్కైవాక్, సైకిల్ ట్రాక్‌కు సంబంధించిన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసేందుకు పలు సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించారు. నగరంలో ప్రధాన పర్యాటక ప్రాంతంలో హుస్సేన్‌సాగర్‌లోని నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు, లుంబినీపార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ కీలకమైనవి. వారాంతాలతోపాటు ఇతర సెలవుల్లో వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వారాంతాల్లో సందర్శకుల సంఖ్య లక్షపైనే ఉంటుంది. సాగర్ చుట్టూ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది.

**మెట్రోతో అనుసంధానం...**

మెట్రోలో వచ్చే వారు హుస్సేన్‌సాగర్ వద్దకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఖైరతాబాద్ స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి నడిచి ఐమాక్స్ మీదుగా సాగర్ వద్దకు చేరుకుంటారు. ఎంఎంటీఎస్‌లో వచ్చే వారు సైతం ఖైరతాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ తరుణంలో మెట్రో, ఎంఎంటీఎస్‌ను అనుసంధానిస్తూ...ఐమాక్స్ మీదుగా అటు నెక్లెస్ రోడ్డు.. ఇటు ఎన్టీఆర్ పార్కు నుంచి సాగర్ చుట్టూ స్కైవాక్ నిర్మించాలనేది ప్రణాళిక.

**కొన్నిచోట్ల స్తంభాలు వేసి..**

మొత్తం 10 కిలోమీటర్ల పైనే స్కైవాక్ ఉండనుంది. రోడ్డు పక్కనుంచి అవసరమైన చోట సాగర్‌లో స్తంభాలు వేసి...వాటిపై స్కైవాక్ ఆరు మీటర్ల వెడల్పుతో ఉండనుంది. ఇందులోనే ఒక భాగం సైకిల్ ట్రాక్‌కు, మరో భాగం నడిచే మార్గానికి కేటాయించనున్నారు.

ఖైరతాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్‌తోపాటు పీపుల్స్‌ప్లాజా, జలవిహార్, సంజీవయ్యపార్కు, లుంబినీపార్కు, ఇందిరాపార్కు, ఎన్టీఆర్‌గార్డెన్ ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉంటాయి. లిఫ్టులు సైతం ఏర్పాటు చేస్తారు.

పలు ప్రాంతాల్లో ఫుడ్‌కోర్టులు, ఓపెన్ థియేటర్లు, గేమింగ్‌జోన్లు, మినీ థియేటర్లు తదితరాలను అందుబాటులోకి తేనున్నారు. ఒక్కసారి స్కైవాక్‌లోకి ప్రవేశిస్తే మొత్తం పది కిలోమీటర్ల వరకు వాకింగ్ చేస్తూ హుస్సేన్‌సాగర్ అందాలను వీక్షించవచ్చు. సైక్లింగ్, ఉదయపు నడకకు ఈ మార్గాన్ని వినియోగించుకోవచ్చు.

పర్యాటకుల నుంచి కొంత టికెట్ రూపేణా వసూలు చేయడంతోపాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు జోన్లుంటాయి. మొత్తం రూ.500కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.

# దిల్‌కీ సంరక్షణ్



హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ పరిధిలోని 620 ఎకరాల దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్) భూములకు రక్షణ గోడల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. 15 ఏళ్లుగా వాటికి హద్దులే నిర్ధారించలేని పరిస్థితులున్నాయి. ఇప్పుడు ఆ భూములకు ప్రహరీ నిర్మించేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు టెండర్లు ఖరారు చేసింది. దిల్ పరిధిలో 703 ఎకరాల భూములకుగాను 83 ఎకరాలకు సంబంధించిన వ్యాజ్యాలు న్యాయస్థానాల్లో పెండింగులో ఉన్నాయి. మిగిలిన వివాదరహిత 620 ఎకరాలను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి ప్రహరీల నిర్మాణానికి టెండర్ల దాఖలుకు హౌసింగ్ బోర్డు ఈనెల 4న నోటిఫికేషన్ జారీ చేసింది. 18 ప్యాకేజీలుగా ఆ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అన్నింటికీ గుత్తేదారులు ముందుకు రావటంతో ఖరారు చేసింది. ఎల్-1గా నిలిచిన గుత్తేదారులకు ఒప్పందాలు చేసుకోవాల్సిందిగా లేఖలు రాసింది.

**నిర్ణీత వ్యవధిలోనే..** గుత్తేదారులు ఒప్పందం చేసుకున్న నాటి నుంచి 2 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఒక్కో ప్యాకేజీలో సగటున 32 నుంచి 35 ఎకరాల మధ్య ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. హద్దులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతికతో సర్వే చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సాంకేతికతతో గుర్తించిన మేరకు ఆయా భూముల సరిహద్దులను జీపీఎస్‌తో అనుసంధానం చేశామని వివరించారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణ...**

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దిల్ భూములతోపాటు హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను కూడా ఆధునిక సాంకేతికతతో అధ్యయనం చేసి జీపీఎస్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. త్వరలో వేలం వేయనున్న ప్లాట్లు, భూముల సరిహద్దులను సైతం సర్వే త్వరలో కొలిక్కి రానున్నట్లు సమాచారం. రక్షణ గోడలు నిర్మించేందుకు రూ.25 కోట్లను కూడా ప్రభుత్వం విడుదల చేసినట్లు ఉన్నతాధికారి వివరించారు.

# వేసవికి ముందే జలదరింపు



హైదరాబాద్: నగరంలో వేసవి నీటి ఎద్దడి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వారం రోజుల్లో జలమండలి ట్యాంకర్లకు గత ఏడాదికంటే రెట్టింపు డిమాండ్ రావడమే దీనికి నిదర్శనం. రానున్న వేసవిలో తీవ్ర డిమాండ్‌కు సంకేతంగా జలమండలి భావిస్తోంది. గతేడాది జనవరి మొదటి ఆరు రోజుల్లో 8980 నీటి ట్యాంకర్లు బుకింగ్ కాగా ఈ ఏడాది జనవరి 6 నాటికి 16,257 ట్యాంకర్లు బుక్ కావడం గమనార్హం. వాటిలో 90 శాతంపైగా ట్యాంకర్లను నిర్దేశించిన గడువులోపే పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ట్యాంకర్ కోసం వినతి వచ్చిన వెంటనే నిర్దేశించిన సమయంలోనే వినియోగదారులకు అందించడం అత్యంత ప్రాధాన్య అంశంగా జలమండలి చేపట్టింది. డిమాండ్ వచ్చిన ట్యాంకర్లకు వందశాతం నిర్దేశించిన గడువులోపు పంపాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా కొత్తగా ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయడంతో పాటు సరఫరాకు అనుగుణంగా ట్యాంకర్ల సంఖ్య పెంచడంపై దృష్టి సారించారు.

**ఆ ప్రాంతాల్లోనే..** నగరంలో దుర్గంచెరువు డివిజన్‌లో ఈ నెల మొదటివారంలో ట్యాంకర్లకు భారీ డిమాండ్ వచ్చింది. ఈ డివిజన్‌లో గతేడాది ఇదే సమయానికి 2138 ట్యాంకర్లు బుక్ కాగా ఈసారి 4822 ట్యాంకర్లకు వినతులు వచ్చాయి. అదే విధంగా మణికొండ ప్రాంతంలో గతేడాది కంటే ఈ సారి మూడు రెట్లు ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా నగరంలో ఎస్సార్‌నగర్, కూకట్‌పల్లి, నిజాంపేట, హఫీజ్‌పేట, బోడుప్పల్ డివిజన్లలో ట్యాంకర్ల డిమాండ్ గణనీయంగా పెరిగింది.

# ఫిబ్రవరి నుంచే సుర్రుసుర్రు.. విద్యుత్తు మీటర్లు గిర్రుగిర్రు

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏటేటా విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. 2023లో వార్షిక సగటు డిమాండ్ 2917 మెగావాట్లు ఉండగా, 2024లో 3218 మెగావాట్లకు ఎగబాకింది. వృద్ధి 10.18 శాతంగా నమోదైంది. నగరం పరిధిలో 2024 డిసెంబరు నాటికి 62.92 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. అంతకుముందు ఏడాదిలో 60.26 లక్షలు ఉన్నాయి. ఏటా రెండు లక్షలకు పైగా కొత్త కనెక్షన్లు వస్తుండటం గమనార్హం.

**ఆ నాలుగు నెలలు అధికం**

విద్యుత్తు వినియోగం మార్చి నెల నుంచి ఒక్కసారిగా పెరుగుతోంది. ఏప్రిల్, మే వరకు ఎండల కారణంగా వాడకం అధికంగా ఉంటుంది. ఈ మూడు నెలలు వార్షిక సగటు వినియోగం కంటే అధికంగా వాడకం ఉంటుంది. పెరుగుదలలో ఏకంగా మార్చి నెలలో 24.52 శాతం నమోదైంది. ఏప్రిల్‌లో 19.66, మేలో 13.46 శాతం రికార్డైంది. జూన్‌లో తగ్గినా.. జులైలో 12.91 శాతం పెరుగుదల కనిపించింది.

**గరిష్ఠానికి తగ్గట్టుగా ఏర్పాట్లు**

గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది వేసవికి డిస్కం కార్యాచరణ చేపట్టింది. గత రెండేళ్లలో 80నుంచి 90 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదుకాగా ఈసారి సెంచరీ దాటుతుందంటున్నారు. గరిష్ఠ డిమాండ్ 5వేల మెగావాట్లకు తగ్గట్టుగా కార్యాచరణ చేపట్టారు. జనవరికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆశించినంత వేగంగా పనులు జరగడం లేదు. ఎస్ఈలదే బాధ్యత


వచ్చే ఈ వేసవిలో అంతరాయాల సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎస్ఈలదేనని నూతన సంవత్సరం సందర్భంగా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్పష్టంచేశారు. ఆయన హెచ్చరికలతో.. ఎస్ఈలు నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై వేటు వేస్తున్నారు. వినియోగదారులు ఫోన్ చేసినా స్పందించకపోవడం, గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఒక ఏఈకి మెమో జారీ చేశారు.

## విమానయానానికి వేగంగా అడుగులు

కొత్తగూడెం : కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చూపిన స్థలాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించటానికి త్వరలోనే ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) బృందాలను పంపిస్తామని పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి ఏఏఐ విజ్ఞప్తి మేరకు రూ.38లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ సర్వే త్వరలో మొదలుకానుంది.

**మూడు మండలాల పరిధిలో..**

కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లోని సుమారు 1,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టును నిర్మించనున్నారు. ఇప్పటికే కొత్తగూడెం సమీపంలోని గరీబ్‌పేట చుట్టూ చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల పరిధిలో భూసేకరణపై అధికారులు ఓ అంచనాకు వచ్చారు. తెలంగాణలో ఆరు రీజినల్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని మూడేళ్లలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే స్థల సర్వేకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏఏఐ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ప్రత్యేక బృందాలు సర్వే చేసి నివేదికను



కేంద్రానికి సమర్పించనున్నాయి.

**మలుపులు ఎన్నో..**

కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే అంశం 17ఏళ్లుగా అనేక మలుపులు తిరుగుతోంది. రేణుకాచౌదరి కేంద్రమంత్రిగా పనిచేసిన కాలంలో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలనే అంశం తొలిసారి తెరపైకి వచ్చింది. సుజాతనగర్‌లో నిర్మిస్తారనే ప్రచారం జోరుగా సాగినా.. ఆ తర్వాత స్తబ్దత ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీనిపై అనేకసార్లు చర్చలు జరిగాయి.

2015 జనవరిలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పటి పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజును కలిసి కొత్త విమానాశ్రయ నిర్మాణానికి సహకారమందించాలని కోరారు.

2015 ఫిబ్రవరిలో విమానాశ్రయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించటానికి తనిఖీ బృందాలను పంపనున్నట్లు విమానయాన మంత్రిత్వశాఖ ప్రకటించింది. 2015 ఆగస్టులో కొత్తగూడెం నుంచి 20కి.మీ. దూరంలోని పునుకుడుచెల్కలో విమానాశ్రయ నిర్మాణం కోసం 1,600 ఎకరాల స్థలాన్ని గుర్తించారు.

2016 సెప్టెంబరులో విమానాశ్రయం ప్రాజెక్టు నిర్మాణానికి 'సైట్ క్లియరెన్స్' సిఫార్సు చేశారు.

2016 డిసెంబరులో 'వన్య ప్రాణుల అభయారణ్యంలో సాధారణంగా ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదంటూ.. విమానాశ్రయ నిర్మాణానికి ఇక్కడ అవకాశాలు తక్కువగా ఉన్నట్లు ఘజియాబాద్ గ్రీన్ ఇండియా కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ స్పష్టం చేసింది.

2021 జనవరిలో విమానాశ్రయ అధికారులు కొత్తగూడెం-పాల్వంచ మధ్య ప్రతిపాదిత భూమిని సందర్శించారు. ఆ తర్వాత ఈ అంశం మరుగునపడింది. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈసారి ఆ దిశగా కార్యాచరణ మొదలైంది. కొత్తగూడెంలో విమానాశ్రయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా కొత్తగూడెం-పాల్వంచ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. భవిష్యత్తులో కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలు వాణిజ్యం, పర్యాటక, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయి. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.
కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

## ఫలించిన బీటీపీఎస్ ఉద్యోగుల నిరీక్షణ

మణుగూరు : భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది. గత 12 ఏళ్లుగా ఉద్యోగులు ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూడగా, ఇటీవల జెన్కో సంస్థ నాలుగు దఫాలుగా 47 మందికి ఉద్యోగోన్నతులు కల్పించింది. జీపీఏలు పీఏలుగా, పీఏలు ఫోర్‌మెన్ ఫోర్త్‌గ్రేడ్‌లుగా, ఫోర్‌మెన్ ఫోర్త్‌గ్రేడ్‌లు సెకండ్ గ్రేడ్ ఫోర్‌మెన్‌లుగా, సెకండ్ గ్రేడ్ ఫోర్‌మెన్‌లు మొదటి గ్రేడ్ ఫోర్‌మెన్‌లుగా ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగోన్నతుల కోసం కార్మికులు ఎంతో కాలం నుంచి పోరాటం చేస్తున్నారు. కార్మికులు, కార్మిక సంఘాలు జెన్కో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జెన్కో సంస్థ కార్మికులకు ఉద్యోగోన్నతి లభించింది.

**ఏటా జరగని డీపీసీ**

బీటీపీఎస్‌లో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) బీటీపీఎస్‌లో ప్రతిఏటా జరగటం లేదు. ఉద్యోగోన్నతులు కల్పించడంలో డీపీసీ నిర్ణయం మేరకు జరుగుతుంది. బీటీపీఎస్ కొత్త ప్లాంట్ కావడంతో గత నాలుగేళ్లుగా డీపీసీ జరగలేదు. దీంతో గతనెల మాత్రమే డీపీసీ జరగటంతో ఉద్యోగోన్నతులు కల్పించారు. ఖాళీ అయిన స్థానాలను అనుసరించి డీపీసీ ఉద్యోగోన్నతులను కల్పిస్తుంది.

**అయినా తక్కువే**


1,080 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బీటీపీఎస్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించటం చాలా తక్కువనే చెప్పాలి. మొదటి నుంచి బీటీపీఎస్‌కి శాంక్షన్ పోస్టులు సంఖ్య తక్కువ. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతులు కూడా తక్కువ కల్పించటం జరిగింది. బీటీపీఎస్ కన్న తక్కువ సామర్థ్యం ఉన్న ప్లాంట్లలో ఎక్కువ మంది కార్మికులు పని చేస్తుంటే, 1080 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బీటీపీఎస్‌లో మాత్రం కేవలం 552 మంది కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కీలకంగా పని చేసే ఫోర్‌మెన్‌లు బీటీపీఎస్‌లో 9 మంది పని చేయటం గమనార్హం. దీంతో పైస్థాయిలో పని చేసే ఉద్యోగులు సంఖ్యో తక్కువగా ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించటంలో జాప్యం ఏర్పడుతుంది.

ఖాళీలను అనుసరించి ఉద్యోగోన్నతులు
కల్పించాం: బిచ్చన్న, సీఈ

ఖాళీలను అనుసరించి ఈ ఏడాదికి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాం. బీటీపీఎస్‌కి కూడా త్వరలోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగుల కేటాయింపు ఉంటుంది.

## ఇంతవరకే చేశామంటే కుదరదు!

చిత్తూరు : ప్రభుత్వ సర్వేలను తూతూమంత్రంగా చేద్దామంటే ఇక కుదరదు! ఎందుకంటే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. డిసెంబరు 29 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు గడువుని చ్చింది. సర్వే పనుల్ని సచివాలయ గ్రామ/వార్డు సిబ్బందికి కేటాయించింది. పర్యవేక్షణ బాధ్యతల్ని ఎంపీడీవో, పురపాలక కమిషనర్ స్థాయి అధికారులకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలంటే సాధారణమే కదా అని అనుకుని నిర్ణీత గడువులోగా చేసింది ఇదే అంటూ యంత్రాంగం నివేదిక సమర్పించింది. దీనిపై సంతృప్తి చెందని ప్రభుత్వం..



సర్వే మళ్లీ మొదలు చేపట్టాలని ఆదేశించింది. లక్ష్యాలు పూర్తయ్యే వరకూ ప్రతి పరిశ్రమను విధిగా సర్వే చేయాలని ఉత్తర్వు జారీ చేసింది.

**25 శాతం కూడా కాక..**

జిల్లాలోని విద్యుత్తు కనెక్షన్ల ఆధారంగా 67 వేల పైచిలుకు ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 25 శాతం కూడా సర్వే చేయలేదు. గతంలో పనిచేస్తున్న పరిశ్రమలు చాలావరకు ప్రస్తుతం మూతబడినట్లు అధికారులు గుర్తించారు. పనిచేస్తున్న వాటికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

సర్వే లక్ష్యం: 67 వేల పైచిలుకు
గడువు: ఫిబ్రవరి 2
చేసింది: 16 వేలు

## పోరంబోకు.. లేఅవుట్ల సోకు

నాయుడుపేట : అధికారుల పర్యవేక్షణ లేమితో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. మేనకూరు రెవెన్యూ పరిధిలో మామిడి కాలువ వెంబడి ఉన్న పోరంబోకు స్థలాలను కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. కాలువ పక్కనే ఉన్న భీమవరం లింకు రోడ్డు స్థలం కూడా పట్టా భూమి అంటూ రోడ్డును స్వాధీనం చేసుకునే యత్నాలు చేయడంతో రాకపోకలు సాగించే ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేనకూరు పారిశ్రామికవాడ ఏర్పడ్డాక ఈ ప్రాంతంలో కాలువలు, వాగులు శ్మశాన వాటికలు, గ్రామనత్తం భూములను కొందరు నాయకుల ప్రోత్సాహంతో వైకాపా ప్రభుత్వంలో ఎక్కడికక్కడ కబ్జా చేశారు. ప్రభుత్వ స్థలాలకు ప్రైవేటు భూముల సర్వే నంబర్లు వేసి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందులో భాగంగానే మామిడి కాలువ దగ్గర పోరంబోకు భూములను



లేఅవుట్ల కింద విక్రయించారు. కొనుగోలు చేశానంటూ కాలువను పూడ్చేయడంతో ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

**ఎక్కడెక్కడంటే..**

నాయుడుపేట మండం బిరదవాడ, పుదూరు, తుమ్మూరు, ఎల్ఏ సాగరం, మేనకూరు పంచాయతీలో ఎన్టీఆర్ కాలనీ, కోనేటి రాజుపాళెం, ఏపీఐసీసీ భూములను ఆక్రమిస్తున్నారు.

పుదూరు రెవెన్యూ పరిధిలో టిడ్కో గృహాల నిర్మాణానికి స్థలం పోనూ కొంచెం ఖాళీగా ఉంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ భూమిపై కబ్జాదారులు కన్నేసి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారు.

## శింగనమలపై చిన్నచూపేల!

అనంతపురం : శింగనమలకు వెళ్లేందుకు జాతీయ రహదారి మీదుగా చిన్న దారిని వదిలి చేతులు దులిపేసుకుంటున్నారు. ఆ కాసింత దారిని నియోజకవర్గ కేంద్రానికి వదలడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శింగనమలను జాతీయ రహదారి నుంచి విడదీశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు వరుసల రోడ్డుకు మరువ కొమ్ము ప్రాంతాన్ని కలపాలని పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నా జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారు. జాతీయ



రహదారితో శింగనమల రోడ్డును కలపాలని డిమాండ్ చేస్తున్నా చెవికెక్కడం లేదని జనం వాపోతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే రోడ్డు ప్రణాళికను మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా సరే ఎవర్నీ లెక్క చేయకుండా ఇంజినీర్లు తమ పని తాము చేసుకుపోతున్నారు. దీనిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ ఎన్హెచ్ విభాగం అధికారులతో కలెక్టర్‌తో కలిసి మాట్లాడాం. ఆరువరుసల రహదారితో శింగనమలను కలిపేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు.

## మిగులు బియ్యం మింగుతున్నారు




కర్నూలు : పౌరసరఫరాల నిబంధనల ప్రకారం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము నుంచి జీపీఎస్ అమర్చిన వాహనంలోనే వసతి గృహాలకు లేదా చౌక దుకాణాలకు బియ్యం తరలించాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నారు. ప్రైవేటు వాహనానికి జీపీఎస్ ఉండదు. అందులో జీపీఎస్ లేకపోయినా ఉన్నట్లు డ్రైవర్ చూపుతారు. ఎవరికీ అనుమానం రాకుండా ఆర్వో ఉంటుంది. బియ్యం ఎక్కడికి వెళ్తుందో ఆర్వోలో సమగ్రంగా రాస్తారు. అందుకే ప్రైవేటు వాహనాల్లో తరలించే బియ్యం బస్తాలను డూప్లికేట్ ఆర్వోలతో ఎన్నిసార్లైనా గోదాము నుంచి నల్లబజారుకు తరలించొచ్చు. ఆ వాహనం ఎక్కడికి వెళ్తుందో పౌరసరఫరాల గోదాము ఇన్‌ఛార్జులకు, గుత్తేదారులకు మాత్రమే తెలుస్తుంది.

“ మీ వసతిగృహం పేరుతో 10 క్వింటాళ్ల బియ్యం పంపినట్లు ఆర్వో జనరేట్ చేశాం.. ఎవరైనా అడిగితే తడబడకుండా ఆర్వో కాపీలు చూపండి.. అంటూ ముందుగానే చెప్పిపెడతారు.

పౌరసరఫరాల గోదాముల్లో బియ్యం పక్కదారి పడుతోంది. డీలర్లు, విద్యా సంస్థలకు సరఫరా చేసే బియ్యం కోటాలో కోత పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో సక్రమంగా చేసి.. ఎవరికీ అనుమానం రాకుండా గోదాముల నుంచే ప్రైవేటు వాహనాల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. అంతా పారదర్శకంగా సాగుతోందని.. జీపీఎస్ ద్వారా వాహనాల్లో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని, గోదాముల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలతో తూకాలు వేయిస్తున్నామని అధికారులు చెబుతూ దందాను గుట్టుగా సాగిస్తున్నారు.

**నెలకు 50 టన్నుల వరకు తరలింపు**

ప్రతి 50 కిలోల సంచికి 660 గ్రాముల టేర్ వెయిట్ ఇవ్వాల్సి ఉంది. కానీ పౌరసరఫరాల గోదాముల ఇన్‌ఛార్జులు రేషన్ డీలర్లకు, పాఠశాలలు, వసతి గృహాలకు ఇలా అన్నింటికి కలిపి కొందరికే టేర్ వెయిట్ ఇస్తున్నారు. అదీ డీలర్లలో కొందరు గట్టిగా అడిగితే తప్ప టేర్ వెయిట్ కింద ఒక గోనె సంచి (గన్ని బ్యాగు) 660 గ్రాములకు గాను కొందరికి 500 గ్రాముల చొప్పున ఇస్తుండగా.. 70 శాతం మందికి ఇవ్వక మిగుల్చుకుంటున్నారు. వేబ్రిడ్జిలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

ప్రతి నెలా టన్నులకొద్దీ బియ్యం నిల్వలు మిగుల్చుకుంటారు. వాటిని జీపీఎస్ వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో దొంగ ఆర్వోలు సృష్టించి అన్ని ఆధారాలున్నట్లు నకలు కాపీలు సృష్టించి బయటకు తరలిస్తున్నారు. పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా.. లోలోపల చేసేదంతా అక్రమ వ్యాపారమే.

చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా అన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం అక్రమంగా తరలిపోతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో నెలకు 50 టన్నులకుపైగా రూ.20–30 లక్షల విలువ చేసే బియ్యం గోదాముల నుంచి అక్రమంగా తరలిపోతోంది.

**ఆర్వోలు సృష్టించి.. ప్రైవేటు వాహనాల్లో తరలించి!**

కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో స్టేజ్–2 కాంట్రాక్టును నలుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. ఈ నలుగురు కలిపి గోదాము ద్వారా స్టేజ్–2 కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. 11 వాహనాలకు జీపీఎస్‌ను అమర్చారు. వాహనాలు కాదని.. ఆర్వోపై పెన్నుతో ఏపీ39 టీజీ 3828 అనే నంబరు వేసి అక్రమంగా బియ్యాన్ని తరలించారు. ప్రైవేటు వాహనాల్లో 40 క్వింటాళ్ల బియ్యం ఎందుకు తరలించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇవి నిజంగా వసతి గృహాలకేనా.. లేక నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకునేందుకు పౌరసరఫరాల అధికారులు, గుత్తేదారు కలిపి చేస్తున్న అక్రమ వ్యాపారమా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

6కేఎన్600: జనరేట్ చేసిన వాహనం కాదని.. ఏపీ 39 టీజీ 3828 నంబరు వాహనంలో ఫిబ్రవరి ఒకటో తేదీన తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఏడీక్యూ1016 నంబరు వాహనంలో ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె బీసీ బాలుర వసతిగృహానికి పది క్వింటాళ్లు, మీదివేముల బీసీ బాలుర వసతిగృహానికి 20 క్వింటాళ్లు, సాంఘిక సంక్షేమ సీజీహెచ్ వసతిగృహానికి 10 క్వింటాళ్లు తరలించనున్నట్లు కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో ఈ ఏడాది జనవరి 30న ఆర్వో జనరేట్ చేశారు. వాటిని జనవరి 31న సదరు గుత్తేదారు తీసుకెళ్లాలి.

## నాడితప్పిన పల్లె వైద్యం



మద్దికెర : మద్దికెర మండల హంప గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నేటికీ అసంపూర్తిగానే మిగిలింది. సంబంధిత సిబ్బంది స్థానికంగా ఉన్న ఓ రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో రోగులను పరీక్షించేందుకు అవసరమైన వసతులు లేవు. “ గ్రామంలో సౌకర్యంగా ఉండే ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. పల్లె వైద్యం గాలిలో దీపంలా మారింది.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలని కేంద్రం ముందుకొచ్చింది.. జాతీయ ఆరోగ్య విధానంలో భాగంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా వీటిని పట్టించుకోలేదు.. కేంద్రం నిధులిచ్చినా పట్టించుకోలేదు.. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా మిగిలాయి.. ‘కూటమి’ ప్రభుత్వం దృష్టి సారించి అందుబాటులోకి తీసుకొస్తే గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

**నిధులివ్వని వైకాపా** ఉమ్మడి కర్నూలు జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు నత్తకు నడక నేర్పిస్తున్నాయి. ఐదేళ్ల కిందట.. ఇవి పురుడు పోసుకోగా.. పక్కా భవనాలుండాలనే ఆలోచనతో కేంద్రం నిధులిచ్చినా గత వైకాపా ప్రభుత్వంలో వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. దీంతో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. నేటికీ కొన్నింటికి సొంత భవనాలుంటే, చాలా కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

**14 రకాల సేవలందించాలి** గ్రామీణ ప్రాంతంలో సచివాలయ కేంద్రంగా 14 రకాల వైద్య సేవలందించాలి. వీటిలో జనరల్ ఓపీ, ఈఎన్టీ, చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మధుమేహం, రక్తపోటు, కౌమార బాలికలు, నవజాత శిశువులు, హెచ్ఐవీ, హెచ్‌బీ ఇలా పలు సేవలున్నాయి. వైద్య కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తయిన ఒక ఎంపీఎల్‌హెచ్‌తో పాటు ఆ ప్రాంత ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలుంటారు. వీరి నెలకు రూ.25 వేతనం చెల్లిస్తారు.

## ఇలకైలాస దారిలో సమస్యల ముళ్లు

ఆత్మకూరు : దట్టమైన అడవి.. రాళ్లు దాటాలి.. కొండలు ఎక్కాలి.. ఆ మార్గంలో వెళ్లడానికి శివరాత్రి, ఉగాది పర్వదినం వేళ మాత్రమే అనుమతి ఉంటుంది. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దర్శనార్థం పది లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది.. పండగకు పది రోజుల ముందు నుంచే భక్తుల రాక మొదలవుతుంది.. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి వేలాదిమంది కాలినడకన మల్లన్న సన్నిధికి చేరుకుంటారు. 13 రోజుల్లో శివరాత్రి పర్వదినం వచ్చేస్తుంది.. సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించలేదు.. తాగునీటి బావులు పాచిపట్టాయి. నీరు ‘చేతి’కందడం లేదు.

**శుభ్రత మరిచారు**

శ్రీశైల ముఖద్వారంగా ప్రసిద్ధిగాంచిన నాగలూటి క్షేత్రం వద్ద భక్తులు మెట్ల మార్గానికి పూజలు చేసి నడిచి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. మార్గ మధ్యలో దాహార్తి తీర్చుకొనేందుకు ఇక్కడి కోనేటిలో నీటిని సీసాల్లో తీసుకెళ్తుంటారు. కోనేరు పాచిపట్టింది. చెట్ల ఆకులు, చెత్తాచెదారంతో నీరు అపరిశుభ్రంగా మారింది. దీనిని శుభ్రపర్చి బ్లీచింగ్ చేయించాల్సి ఉంది.

అన్నదాన శిబిరాల నిర్వాహకులు వంట అవసరాల కోసం పెచ్చెర్వులోని పురాతన బావి నీటిని వినియోగిస్తారు. ఇందులో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చేయించాలి.

పెచ్చెర్వు– భీమునికొలను మధ్య భక్తులకు మఠం బావి నీరే ఆధారం. మలినాలతో కూడిన ఈ నీటిని శుభ్రం చేయాల్సి ఉంది.

**దప్పిక తీర్చే ధారలేవీ**

భీముని కొలను వద్ద నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రవాహం లేక కోనేరు అడుగంటింది. నీరు పాచిపట్టి పచ్చగా మారింది. అందులోనే భక్తులు స్నానాలు చేస్తుండటంతో మరింత అపరిశుభ్రమై దుర్వాసన వస్తోంది. నాగలూటి– పెచ్చెర్వు మధ్య భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతిపంపు పాడైంది.

**40 కి.మీ నరకయాతన**

ఆత్మకూరు పట్టణ సమీపంలో మొదలైన నడక వెంకటాపురం,



నాగలూటి, దామెరకుంట, పెద్ద చెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాస ద్వారం మీదుగా ఇలకైలాసం(శ్రీశైలం) వరకు 40 కి.మీ మేర కొనసాగుతుంది.

వెంకటాపురం గ్రామ శివారులోని మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి నడకదారి మొదలవుతుంది. మొదట్లోనే చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంది. ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయి.

మార్గమధ్యంలో పిచ్చిమొక్కలను పూర్తిస్థాయిలో తొలగించలేదు. మొదలు భాగం కొంత వదిలేసి కత్తిరించారు. వాటి కొయ్యలు మొనదేలి ప్రమాదకరంగా మారాయి.

పెచ్చెర్వు నుంచి భీమునికొలనుకు వెళ్లేదారిలో వీరభద్రుని మెట్లు దాటి కొంతదూరం వెళ్లాక మార్గ మధ్యలో ఓ చెట్టు కొమ్మ దారికి అడ్డంగా వాలిపోయింది.

ఎండుటాకులు.. అడుగేస్తే చిక్కులు

మెట్ల మార్గంలోని బండరాళ్లను ఎండుటాకులు కప్పేశాయి. నునుపైన బండలపై రాలిన ఆకులపై భక్తులు అడుగేస్తే జారి పడిపోయే ప్రమాదముంది. గతంలో పాదచారులు జారిపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.


పెచ్చెర్వు నుంచి భీమునికొలనుకు వెళ్లేదారిలో కొండలు ఎక్కి దిగాల్సి ఉంది. కోర్కెల కొండ, కత్తుల కొండ, మఠం బావి సమీపంలోని కొండలపై కొన్నిచోట్లు బండరాళ్లు నునుపుగా ఉన్నాయి. వాటిపై ఎండుటాకులు పడ్డాయి.

## పెన్ అనధికారిక డౌన్

ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రెవెన్యూ శాఖలో పలు సమస్యల ప్రక్షాళనకు తెర తీసింది. వైకాపా హయాంలో చేపట్టిన రీసర్వేతో నష్టపోయిన భూయజమానులకు దన్నుగా నిలిచి గ్రామసభలు నిర్వహించింది. సమస్యల పరిష్కారానికి డిసెంబరు నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న తప్పులపై ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక గ్రామం చొప్పున భూముల రీసర్వే చేపడుతోంది. ఇలాంటి కీలక సమయంలో తహసీల్దార్లు సెలవుపై వెళ్లడం సమస్యగా మారింది. ఆ పనులన్నీ పెండింగ్‌లో పడిపోతున్నాయి.

**తల పట్టుకుంటున్న ఉన్నతాధికారులు:** ఇప్పటికే వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలోనూ భూ సంబంధిత సమస్యల పైనే ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మండల తహసీల్దార్లు సెలవులు పెడుతుండటంతో వీటి పరిష్కారానికి ఏంచేయాలనే విషయమై జిల్లా ఉన్నతాధికారులు తల పట్టుకుంటున్నారు. సెలవులు ఇవ్వడానికి జిల్లా పాలనాధికారి ససేమిరా అంటున్నా.. ఆరోగ్యం బాగాలేదని చెబుతుండటంతో మానవతా దృక్పథంతో వ్యవహరించక తప్పని పరిస్థితి నెలకొంది.

**పెరుగుతున్న ఒత్తిడులు!:** కొన్నిచోట్ల రెవెన్యూపై రాజకీయ ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు తమ పనులు చేయాలంటూ తహసీల్దార్లపై దుర్భాషలాడుతున్నారు. దీంతో



అధికారులు మానసికంగా కుంగిపోతున్నారు. విధులు నిర్వహించలేమనే నైరాశ్యంలోకి వెళ్తున్నట్లు సమాచారం. వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు తమ తప్పులు బయటికి వస్తున్నాయని.. అనారోగ్యం సాకు చూపుతున్నారనే విమర్శలూ ఉన్నాయి. అధికారుల గైర్హాజరుతో తమ దస్త్రాలకు పరిష్కారం దక్కక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. ‘ఆరోగ్యం బాగాలేదంటూ తహసీల్దార్లు సెలవులు పెడుతున్నారు. పరిశీలించి అవసరం లేకుంటే రద్దు చేస్తున్నాం. డిప్యూటీ కలెక్టర్ల సహకారంతో పరిస్థితిని సమీక్షిస్తున్నాం’ అని తెలిపారు. సీఎస్‌పురం తహసీల్దారు గత నెల 21 నుంచి ఈ నెల 9 వరకు సెలవు పెట్టారు. రాజకీయ ఒత్తిడి కారణంగా విధులకు రావడం లేదని సమాచారం. డిప్యూటీ తహసీల్దారుకు అక్కడ పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు.

రాచర్ల తహసీల్దారు భార్య అనారోగ్యానికి గురవ్వడంతో ఆయన సెలవుపై వెళ్లారు.

తర్లుపాడు తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డిపై పలు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రస్తుతం డీటీ విజయ్‌భాస్కర్ ఇన్‌ఛార్జి తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు.


దొనకొండ తహసీల్దారు రమాదేవి అనారోగ్యం కారణంగా మూడు రోజులుగా సెలవులో ఉన్నారు. నాలుగు రోజుల తర్వాత విధుల్లో చేరే అవకాశం ఉంది. తాళ్లూరు తహసీల్దారు సంజీవరావు అనారోగ్యంతో దాదాపు 20 రోజుల నుంచి సెలవులో ఉన్నారు. ప్రస్తుతం డీటీ ఇమ్మాన్యుయేల్ రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పుల్లలచెరువు తహసీల్దారు నజీర్ అహ్మద్ నవంబరు 22 నుంచి సెలవులో ఉన్నారు. యర్రగొండపాలెం తహసీల్దారుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయన కూడా సెలవుపై వెళ్లడంతో ఆ రెండు మండలాలకు ఇన్‌ఛార్జిలుగా డీటీలు వ్యవహరిస్తున్నారు.

## దొడ్డిదారుల్లో పెద్దదోర్నాల

ఒంగోలు : అధికారమే అండగా గత వైకాపా ప్రభుత్వంలో ‘భూ’చోళ్లు రెచ్చిపోయారు. ఫ్రీ హోల్డ్ పేరిట కొందరు పెద్దలు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని పది మండలాల్లో 666 రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు సర్వే చేపట్టి సుమారు 20 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జాబితాలో చేర్చినట్లు గుర్తించారు. కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు ఎక్కువ నమోదైన వాటిలో విస్తీర్ణంపరంగా పెద్దదోర్నాల రాష్ట్రంలోని మొదటి పది మండలాల్లో ఒకటి కావడం గమనార్హం. ఆ మండలంలో 341.06 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయగా.. అందులో 200.94 వరకు నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు తేలింది.

**సొమ్ము చేసుకున్న వైకాపా నేతలు**

వైకాపా ప్రభుత్వం హయాంలో గత ఏడాది అసైన్డ్ నిబంధనలు సవరించారు. 2003కు ముందు అసైన్డ్ చేసిన భూములపై అనుభవదా రులకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న పేదలకు ఉపశమనం కలిగించినా.. వాటి వెనుక వైకాపా నాయకులు చక్రం తిప్పారు. రహదారుల



వెంట, బహిరంగ మార్కెట్‌లో విలువ కలిగిన వాటిపై కన్నేశారు. అవగాహన లేని రైతుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకున్నారు.

**అర్హత లేని వాటికీ చోటు**

జిల్లా వ్యాప్తంగా 22ఏ, అసైన్డ్ ల్యాండ్ ఫ్రీ హోల్డ్, చుక్కల భూములు, షరతులు గల పట్టాకు సంబంధించి మొత్తం 1,75,722.73 ఎకరాల క్రయ, విక్రయాలకు హక్కులు కల్పించారు. అందులో అసైన్డ్ ఇతర ఫ్రీ హోల్డ్‌వి 1,36,783.60 ఎకరాలున్నాయి. అందులో ఇప్పటికే సుమారు రెండు వేల మంది రైతుల క్రయ, విక్రయాలకు సంబంధించి 3,638 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. జిల్లాలోని పలు మండలాల్లో ఫ్రీ హోల్డ్‌కు అర్హత లేని వాటికీ ఆ జాబితాలో చోటు కల్పించారు. కనిగిరి, సీఎస్‌పురం మండలాల్లో ఎక్కువ ఫిర్యాదులు అందడంతో కనిగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని ఇప్పటికే దస్త్రాల పరిశీలన చేపట్టారు. అయినా బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది.

చురకలు



# తమలపాకు రైతు ధరహాసం

పాయకరావుపేట : తమలపాకు ధర రోజురోజుకు ఎగబాకుతోంది. ఇప్పటివరకు గిట్టుబాటు ధర రాక నిరాశ చెందిన అన్నదాతకు పెరిగిన ధర ఊరటనిస్తోంది. ఆకులకు మంచి ధర వస్తోంది. పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు. సత్యవరం, మాసాహెబ్‌పేట, మంగవరం, అరట్లకోట, కొత్తూరు, శ్రీరాంపురం, గోపాలపట్నం సహా ఎస్.రాయవరం, లింగరాజుపాలెం, వమ్మవరం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట ఉంది. ఆకులను విశాఖ, రాజమహేంద్రవరం, హైదరాబాద్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకునే పంట పండిస్తున్నారు. కౌలు, పెట్టుబడులు కలిపి సాగు వ్యయం సుమారు రూ.2 లక్షలు దాటిపోతోంది. ఇప్పటివరకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.



పెట్టుబడిపైనా ఆశలు వదులుకున్నారు. ఈ తరుణంలో ధర అనూహ్యంగా ఊపందుకుంది. సుమారు 180 ఆకులను కట్టగా కడతారు. దీన్ని పంతాగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఒక్కో పంతా ధర రూ. 40 వస్తోంది. ఇది మరింత పెరిగే అవకాశముంది. రానున్న రోజుల్లో శుభముహూర్తాలు ఉండటం, ఊరూరా పెళ్లి బాజాలు మోగనుండటంతో తమలపాకులకు డిమాండ్ రానుంది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఏప్రిల్ నెలాఖరుకు దిగుబడి తగ్గుతుంది. ఆ సమయానికి ఈ ప్రాంతంలో తోటలు నిండుగా ఉంటాయి. దీంతో ఎగుమతులు మరింత ఊపందుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**గిట్టుబాటు ధరతో ఊరట**

తమలపాకు ధర ప్రస్తుతం పెరుగుతోంది. ఇప్పటివరకు తక్కువ ధర ఉండటంతో ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులపై ఆశ వదులుకున్నాం. దీనికితోడు సాగు వ్యయం ఎక్కువైంది. తెగుళ్ల తాకిడి అధికంగా ఉంటోంది. ఎగుమతులు పెరుగుతాయి.

– వీరబాబు, తమలపాకు రైతు

**మూడు నెలలూ ఆశాజనకమే**

రానున్న మూడు నెలలు ఆశాజనకంగానే ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి ఎగుమతులు తగ్గుతాయి. దీనికితోడు ఇక్కడ ఆకుకు మంచి డిమాండ్ ఉంది. ఈ ధర మరింత పెరిగే అవకాశముంది. రైళ్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఆకులను పంపిస్తున్నాం.

– ఎస్.నూకరాజు, సత్యవరం

# చోటు పరిమితం.. వాహనాలు అధికం

సింహాచలం : సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తుల్ని పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. సింహాద్రినాథుడి దర్శనానికి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొవిడ్ అనంతరం భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రధానంగా సొంత వాహనాల్లో వచ్చే వారికి సంఖ్య ఎక్కువ. సింహగిరిపై పరిమితంగా ఉన్న పార్కింగ్ ప్రదేశం చాలకపోవడంతో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

**ఆలయ ధర్మకర్త దృష్టికి సమస్య..:** సింహగిరిపై పార్కింగ్ సమస్యను ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దృష్టికి తీసుకెళ్లాం. అలాగే ఇటీవల అప్పన్న దర్శనానికి వచ్చిన రాష్ట్ర హోంమంత్రి అనిత ద్వారా దేవాదాయశాఖ మంత్రికి తెలియజేశాం. ఆలయం వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రాంగణంలో పోలీసు అవుట్ పోస్టు, పార్కింగ్‌కు వినియోగిస్తే బాగుంటుందని సూచించాం.– శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ, పశ్చిమ జోన్

**కిక్కిరిసిపోతున్న పార్కింగ్..**

సింహగిరిపై రాజగోపురం ఎదురుగా, జోడుభద్రాలు, టీవీ టవర్ రోడ్డు వంటి ప్రాంతాల్లో అత్యధికంగా 300 నాలుగు చక్రాల వాహనాలకు సరిపడే పార్కింగ్ ఉంది. ఇది కాకుండా లోవతోట, బస్‌స్టాండు, ఇతర ప్రాంతాల్లో సుమారు 1,500 ద్విచక్ర వాహనాల్ని నిలపొచ్చు. ప్రస్తుతం ఉన్న ఈ ప్రాంగణాలు శాస్త్రీయంగా లేకపోవడంతో నిలిపిన వాహనాలను తిరిగి బయటకు తీసుకురావడం పెద్ద ప్రహసనంగా మారింది. ఖాళీ ప్రదేశాలనే పార్కింగ్ ప్రాంగణాలుగా వినియోగించడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. టీవీ టవర్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాల కోసం సుమారు కిలో మీటరుపైగా భక్తులు నడవాల్సిన



దుస్థితి నెలకొంది. చందనోత్సవం వంటి పర్వదినాల్లో వాహనాలను కొండపైకి అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైన పార్కింగ్ ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది.

స్వామి దర్శనానికి వచ్చే భక్తులు..

సాధారణ రోజుల్లో: 25–30వేల మంది

శని, ఆదివారాల్లో: 50,000

మల్టీలెవల్ పార్కింగ్ ఆలోచన ఉంది..: సింహాచలం బృహత్తర ప్రణాళికలో మల్టీలెవల్ పార్కింగ్ ప్రతిపాదన ఉంది. సింహగిరిపై పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ప్రాంగణంలో ఇది ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. టీవీ టవర్ నుంచి సత్తమ్మ ఆలయం వరకు హిల్‌టాప్ రహదారిని విస్తరించి పార్కింగ్‌కు అనుకూలంగా మార్చాలన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. హిల్‌టాప్ రహదారి నుంచి వన్‌వే వచ్చే విధంగా ఆలయం వెనుక నుంచి రోడ్డు వేసే విషయంపై నిపుణులతో చర్చిస్తున్నాం. రాబోయే రోజుల్లో సింహగిరిపై పార్కింగ్ ప్రాంగణాల ఆవశ్యకత ఎంతో ఉంది. త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి, సింహాచలం దేవస్థానం

# ఆశజూపి.. అంతా దోచి!



అనంతపురం : అనంతపురం జిల్లాలో రోజుకు 7 నుంచి 9 సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు నమోదవుతున్నాయి. సైబర్ క్రైం ద్వారా బాధితులు జిల్లాలో 2023లో రూ.1.45 కోట్లు, 2024లో రూ.1.76 కోట్లను పోగొట్టుకున్నారు.. ఆన్‌లైన్ సాంకేతికతతో సైబర్ నేరగాళ్లు ఏ విధంగా పేట్రేగిపోతున్నారో చెప్పేందుకు ఈ గణాంకాలు నిదర్శనం.అమాయకులు, డబ్బు అత్యవసరం ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పతున్నారు. వీటికి విద్యావంతులు సైతం బలవుతున్నారు. తాజాగా డిజటల్ నగదు చెల్లింపులు, లావాదేవీల్లో లొసుగుల్ని లక్ష్యంగా చేసుకొని స్కామర్లు సవాల్ విసురుతున్నారు.

**జంప్డ్ డిపాజిట్ స్కామ్**

'జంప్డ్ డిపాజిట్ స్కామ్'.. అంటే దుండగులు ముందుగా యూపీఐ ద్వారా బాధితుడి బ్యాంకు ఖాతాకు డబ్బు పంపుతారు. డబ్బు జమ అయినట్లు మెసేజ్ వచ్చిన వెంటనే చాలామంది బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకునేందుకు ఫోన్ పే, గూగుల్ పే యాప్‌లను ఆశ్రయిస్తారు. బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి పిన్‌ను నమోదు చేయగానే వెంటనే, అతని ఖాతా నుంచి డబ్బు విత్ డ్రా అయిపోతుంది.

పిన్ నంబరును ఎంటర్ చేయగానే ఆ వ్యక్తి ఖాతాను దుండగులు యాక్సెస్ చేసి ఖాతాలో డబ్బంతా ఊడ్చేస్తారు.

తొలుత రూ.300 ఖాతాలో వేస్తారు. దానికి స్పందించక పోతే రూ.500 ఇలా పెంచుకుంటూ పోయి రూ.2 వేలు వరకు ఖాతాలోకి వేస్తారు. ఏదో ఒక సమయంలో స్పందిస్తారని స్కామర్లు తెలివిగా ఇలా వ్యవహరిస్తారు.

అనంతపురం నగరానికి చెందిన భార్యాభర్తల చరవాణులకు 'తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలనుకుంటున్నారా? అయితే ఈ లింకు క్లిక్ చేయండంటూ 'ఓ మెసేజ్ వచ్చింది. అందులో తొలుత రూ.వెయ్యి పెట్టుబడి పెట్టగా రెట్టింపు కలిపి ఖాతాకు జమైంది. ఇలా నాలుగైదు దశల్లో ఆదాయం చూపి ఆశ చూపారు. అత్యాశకు పోయిన బాధితులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఒకేసారి రూ.కోటి పెట్టారు. ఆ సొమ్ము అవతలి స్కామర్లకు బదిలీ చేశారు. అంతే అవతలి నుంచి స్పందన లేదు. మోసపోయామని గుర్తించి బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

**అప్రమత్తతే శ్రీరామరక్ష - జగదీశ్, అనంతపురం ఎస్పీ**

సామాజిక మాధ్యమాల వేదికగా వచ్చిన ప్రకటనలు చూసి పెట్టుబడులు పడితే మోసపోతారు. కమిషన్లకు ఆశపడి అనుమానిత ఖాతాలకు డబ్బు తరలించడం, రిజిస్టర్ కాని సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం క్షేమం కాదు. ఫోన్లకు వచ్చే అపరిచిత లింక్‌లు, ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు. అనుమానం కలిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలపాలి..

**ఇలా చేయాలి..**

యాప్‌లోకి వెళ్లేందుకూ, నగదు చెల్లించేందుకూ పిన్ నంబర్లు వేర్వేరుగా ఉండాలి. చరవాణికి వచ్చిన మెసేజ్‌ను 30 నిమిషాలదాకా తెరవకూడదు. డిజిటల్ చెల్లింపులకు, యూపీఐ కోసం ప్రత్యేక ఖాతాను నిర్వహించడం ఉత్తమం.

తక్కువ నగదు నిల్వతో పొదుపు ఖాతానే అందించే బ్యాంకును ఎంచుకుని, ఆ ఖాతాను యూపీఐ చెల్లింపుల యాప్‌తో అనుసంధానం చేసుకోవడం మంచిది.

# జల్‌జీవన్.. నవీకరణ పథం



అనంతపురం : గ్రామీణులకు తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ పథకం పనుల్లో కూటమి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. పాత పనులను రద్దు చేసింది. జిల్లా మొత్తం మీద 31 మండలాల్లోని గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఈనేపథ్యంలో ప్రత్యేక కథనం. మూడేళ్ల కిందట మొదటి దశలో గ్రానీస ఇంజినీర్లు పలు గ్రామాల్లో తాగునీటి పనులు చేయించారు. ఏడాదిన్నర కిందట మంజూరు చేసిన పనులు అరకొరగా జరిగాయి. తాజాగా వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటి వరకు గ్రానీస ఇంజినీర్లు గ్రామాల్లో బోర్లువేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇస్తూ వచ్చారు. గ్రామాల్లో ఇదివరకే ఉన్న తాగునీటి పథకాల ద్వారా ప్రజలు సొంతంగా కుళాయిలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని కూడా జల్‌జీవన్ పథకంలో ఏర్పాటు చేసినట్లు అధికారులు కాకిలెక్కలు వేశారు.

**నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాలకు రెండో విడతలో మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా గుంతకల్లు నియోజకవర్గానికి, శింగనమల నియోజకవర్గాలకు గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి తాగునీటిని అందించాలని నిర్ణయించారు. అలాగే తాడిపత్రికి గండికోట నుంచి నీరు ఇస్తారు. తొలి విడతలాగా గ్రామాల్లో బోర్లు వేయడం వల్ల భవిష్యత్తులో నీటి సమస్య ఉత్పన్నం కానుంది. అందుకే ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేందుకు పథకంలో మార్పులు చేసింది. ఈవిషయమై గుత్తి గ్రానీస డీఈఈ రెహెనావాసీం మాట్లాడుతూ పాతపనులు రద్దయ్యాయన్నారు. కొత్తగా పనులకు అంచనాలు వేస్తూ ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

**సర్వేతో కాక్కిలెక్కలు మాయం**

కూటమి ప్రభుత్వం తాజాగా కుళాయి కనెక్షన్లపై సర్వేచేయించింది. వార్డు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులతో సుమారు నెలపాటు సర్వేచేయించి పక్కాగా లెక్కలు తేల్చారు. జిల్లా మొత్తం మీద 3.33 లక్షల కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా లక్షదాకా ఇవ్వాల్సి ఉంది.

**763 పనులకు 113 మాత్రమే పూర్తి**

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో రెండో విడతలో ప్రభుత్వం రూ.156.55 కోట్లు మంజూరు చేసింది. రెండు విడతల్లో మంజూరైన 763 పనులకు గాను కేవలం 114 పనులను మాత్రమే పూర్తి చేశారు. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని పలు గ్రామాల్లో అధికారులు బోర్లు వేసి పైపులైన్లను విస్తరించారు. రెండో విడతలో పనులు మొదలు కాలేదు. నిధులను కేంద్ర ప్రభుత్వం తనవాటా ఇవ్వగా గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రం వాటా ఇవ్వలేకపోయింది. ఈకారణంగానే రెండో విడతలో పనులు మొదలేకాలేదు.

# మిరప.. ఏటా కష్టాలేనప్పా



ఉరవకొండ : కొన్నేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఏటా పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోగా.. పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మూడేళ్లుగా ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో దాదాపు 50 వేల ఎకరాలు.. గుత్తి, గుంతకల్లు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో 10 వేల ఎకరాలకు పైగా మిరప పంట సాగైంది. అందులో బ్యాడిగ, తేజ ఇతర రకాలు ఉన్నాయి. ఎకరాకు సగటున రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టారు. బ్యాడిగ, 2043 రకాలు ఎకరాకు సగటున 12 క్వింటాళ్లు, మిగతా రకాలు ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో కోతలు ప్రారంభం అయ్యాయి. కొందరు పొలాల్లో ఆరబెడుతున్నారు.

**మార్కెట్ సదుపాయం లేక..**

ఈ ప్రాంతంలో మిరప మార్కెట్ లేదు. పొరుగున ఉన్న కర్ణాటకలోని బ్యాడిగ, హుబ్బళ్లి, మంగళూరులో మాత్రమే ఆ సదుపాయం ఉంది. అనంత నుంచి అక్కడికి మిరప పంటను తరలించడానికి 30 కిలోలు బరువు ఉన్న ఒక్కో సంచికి రూ.120 వరకు ఖర్చు అవుతుంది. వ్యయప్రయాసలతో పంటను తరలించిన తరువాత గిట్టుబాటు ధర లేకపోతే వెనక్కి తీసుకురావడం కుదరదు. దీంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. మరికొందరు రైతులు స్థానిక దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్నారు.

**గిట్టుబాటు ఏదీ?**

ప్రస్తుతం మిరపకు గిట్టుబాటు ధర ప్రశ్నార్థకంగా మారింది. బ్యాడిగ రకం క్వింటాలు కొత్తది మంచి రకం రూ.33వేలు, పాతది రూ.20వేలు పలుకుతోంది. 2043 కొత్తది క్వింటాలు రూ.16వేలు, పాతది రూ.11వేలు, మిగతా రకాలు క్వింటాలు రూ.7వేల నుంచి 9వేలు పలుకుతున్నాయి. గత రెండేళ్లుగా మిరప ఎగుమతి ఆగిపోవడంతో గిట్టుబాటు ధర దక్కడం గగనంగా మారింది.

ః గతేడాది మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాలకు చెందిన రైతులు కర్ణాటకలో వివిధ ప్రాంతాల్లోని శీతల గోదాములో నిల్వ ఉంచారు. దాదాపు కోటి సంచుల వరకు నిల్వ ఉన్నాయి. దీంతో గోదాముల అద్దె రైతులకు భారంగా మారింది.

**ఆరు ఎకరాల్లో వేశా...- హనుమేశ్, పాలికి**

గత ఏడాది 12 ఎకరాల్లో మిరప సాగు చేయగా, 550 సంచుల దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర లేక పోవడంతో శీతల గోదాములోనే నిల్వ ఉంచా. ఇప్పటికీ ధర లేక పోవడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పంట సాగు చేశా. కొత్త పంటకూ గిట్టుబాటు ధర దక్కేలా లేదు.

# నిబంధనలకు పాతరేసి.. ఫ్రీ హోల్డ్ చేసి..

తిరుపతి : ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిబంధనలు గాలికి వదిలేశారు. చివరి ఏడాదిలో అక్రమాలు, కబ్జాలకు అంతే లేకుండా పోయింది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్న చందంగా చెలరేగారు. అసైన్డ్ భూములకు భూ యాజమాన్య (ఫ్రీ హోల్డ్) హక్కులు కల్పించడంలో జరిగిన అవకతవకలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2003కు ముందు అసైన్డ్ పట్టాలు పొందిన వ్యక్తులకు ఫ్రీ హోల్డ్ చేసి పట్టా ఇవ్వాలని వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు దాదాపు మూడు నెలలకు ముందు హడావుడిగా ఉత్తర్వులు ఇచ్చేశారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని తహసీల్దార్లతో రెండు రోజులకోసారి టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి పరుగులు పెట్టించారు. అదేవిధంగా కలెక్టర్, జేసీలకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు మొదలు సీఎస్ వరకు తరచూ ఆదేశాలు ఇచ్చారు. ఎంతవరకు పని జరిగిందో తెలుసుకోవడానికి నివేదికలు అడిగేవారు. దీంతో అనివార్యంగా క్షేత్రస్థాయిలోని అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. కొందరు దీన్ని సదవకాశంగా తీసుకున్నారు. రైతుల నుంచి లంచాలు వసూలు చేశారు. అదేవిధంగా వైకాపా నాయకులు చెప్పిన సూచనలు తూచా తప్పకుండా పాటించారు.

బంగారుపాళ్యం, వి.కోట, కుప్పంలోనే.. ఫ్రీ హోల్డ్ అవకతవకల్లోనూ బంగారుపాళ్యం, వి.కోట, కుప్పం మండలాలు అగ్రస్థానంలో ఉన్నాయని ఉన్నతాధికారులు అంచనాకు వచ్చారు. ఎక్కడెక్కడ ఎవరెవరు కీలక పాత్ర పోషించారనే అంశంపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారని సమాచారం. రానున్న రోజుల్లో బాధ్యులపై చర్యలు తప్పవని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి.



**ఒకటికి రెండుసార్లు పరిశీలించి..**

చిత్తూరు జిల్లావ్యాప్తంగా 1.59 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్‌గా చేశారు. దీనిపై అప్పట్లోనే తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ తర్వాత గతేడాది నవంబరులో మరోసారి పునః పరిశీలన చేయాలని స్పష్టం చేసింది. ఇలా ఒకటికి రెండుసార్లు విచారించారు. ఇలా స్పష్టంగా లెక్కలు తీసిన తర్వాత 1.06 లక్షల ఎకరాలను ఎటువంటి నిబంధనలు పాటించకుండానే భూ యాజమాన్య హక్కులు కల్పించారని నిర్ధారించారు.


**మేత భూములనూ వదలక..**

తిరుపతి జిల్లాలో 79 వేల ఎకరాలకు యాజమాన్య హక్కులు ఇవ్వగా 32 వేల ఎకరాలు సక్రమంగా జరగలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉల్లంఘనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఇక్కడ గుట్ట పోరంబోకు, మేత భూములనూ ఫ్రీ హోల్డ్ చేశారు. వైకాపా నాయకుల హస్తమే దీనికి ప్రధాన కారణం. పని చేయకుంటే నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని హెచ్చరించడంతో రెవెన్యూ యంత్రాంగం వారికి దాసోహమైంది. దీనికితోడు కొందరు అధికారులు పెద్దఎత్తున డబ్బులు గుంజి నిబంధనలకు తూట్లు పొడిచారు.

# 'మిత్ర'మా మనకోసం!

విశాఖపట్నం: పౌరసేవల్లో వేగం పెంచేందుకు, ప్రజల వినతుల పరిష్కారానికి 'మన మిత్ర' (వాట్సప్ గవర్నెన్స్)ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఇంటి నుంచే పలు రకాల సేవలు పొందేలా వాట్సప్ నంబర్ (9552300009)ను ఆరంభించింది. సెల్‌ఫోన్‌లోనే 161 సేవలు అందుకోవచ్చు. జనవరి 30 నుంచి ఇది అమల్లోకి రాగా నగర ప్రజల వినియోగం క్రమంగా పెరుగుతోంది. గతంలో పలు రెవెన్యూ సమస్యలపై సాధారణ విధానంలో దరఖాస్తు చేసిన వారు...వాటి పరిస్థితేంటో తెలుసుకుంటున్నారు. నగర పరిధిలోని వారితో పాటు ఆనందపురం, పద్మనాభం,పెందుర్తి, భీమిలి మండలాల ప్రజలు ఈ సేవలను వినియోగిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గుతున్నాయి.

ఇలా: ఈ సేవలు పొందాలనుకునే వారు వాట్సప్‌లో ప్రభుత్వం పేర్కొన్న నంబరుకు మొదట హాయ్ అని పంపితే ప్రధానంగా 8 విభాగాల సేవలు వస్తాయి. అందులో అవసరమైన దాన్ని ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎంచుకున్న సేవ ఆధారంగా



వ్యక్తిగత వివరాలు, ఆధార్ నంబరు నమోదు చేస్తే సరిపోతుంది. ఆంగ్లం, తెలుగు.. రెండింటిలోనూ సేవల వివరాలు అందుబాటులో ఉన్నాయి.

**అరచేతిలో 161 రకాల ప్రభుత్వ సేవలు**

అందుబాటులోకి వాట్సాప్ నెంబర్ 9552300009

పద్మనాభం మండలం బచ్చుపేటకు చెందిన మహిళ తనకు ఇంటిని మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తును స్వీకరించినట్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో దరఖాస్తు స్థితి ఏమిటో సెల్‌ఫోన్‌లోనే చూసుకున్నారు. ఇలా ... నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాట్సాప్ సేవలతో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే సమాచారం వెంటనే తెలుసుకుంటున్నారు.

చురకలు



## నిర్మాణాలు, లేఅవుట్లకు.. స్థానికంగానే అనుమతులు

పుత్తూరు : వందలాది కిలోమీటర్ల పరిధిలో లక్షలాది మంది నివసించే పట్టణాలు, ప్రాంతాల్లో వేలాది నిర్మాణాలకు ఒకరిద్దరు అధికారులతో భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వడం కష్టసాధ్యమే. ఈ లోపాలు గుర్తించిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలకు అనుమతులు వెంటనే ఇచ్చేలా చర్యలకు ఉపక్రమించింది. పట్టణ ప్రజలకు వెంటనే న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంది. పట్టణాభివృద్ధి సంస్థల నుంచి మున్సిపాలిటీలు, నగరాలకు విముక్తి కల్పించింది. చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపాలిటీ తుడా పరిధిలో, చిత్తూరు కార్పొరేషన్ చుడా పరిధిలోబీ ఇక పుంగనూరు, పలమనేరు మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో, కుప్పం మున్సిపాలిటీ కడా పరిధిలో ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ లేఅవుట్లు వేయడానికి, 300 చదరపు మీటర్లు దాటిన విస్తీర్ణంలో, పది మీటర్ల ఎత్తుకు పైగా నిర్మించే బహుళ అంతస్తులకు తిరుపతి పరిధిలో తుడా, చిత్తూరులో చుడా, పీకేఎం ఉడా.. ఇంత పెద్ద ప్రాంతంలో అన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వడానికి పట్టణ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత ఉన్నారు. ఇలా ముగ్గురు, నలుగురు అధికారులతో సకాలంలో అనుమతులు రావడం సాధ్యం కాని పని.

**నిబంధనల సడలింపు..**



భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతుల కోసం ప్రజలు ఇక నుంచి పట్టణాభివృద్ధి సంస్థలైన తుడా, చుడా వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక అన్ని రకాల అనుమతులు ఆయా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు ఇస్తాయి. ఇందుకు సంబంధించి నిబంధనలను పురపాలకశాఖ సవరించి ప్రభుత్వ అనుమతి తీసుకోవడంతో మున్సిపాలిటీలు, నగరపాలికల్లో నిర్మాణాలకు సడలింపు లభించింది. 300 చదరపు మీటర్ల విస్తీర్ణానికి.. 10 మీటర్ల ఎత్తుకు మించిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు స్థానికంగానే అనుమతి ఇస్తారు. వీటి అనుమతికి చెల్లించే ఫీజు నేరుగా మున్సిపల్ ఖాతాల్లోకే చేరుతుంది. తద్వారా ఈ నిధులను వెంటనే మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించుకునే అవకాశం పురపాలికలకు ఉంటుంది. ఇకపై నిర్మాణాల అనుమతులు, వాటి పర్యవేక్షణ స్థానిక పట్టణ ప్రణాళికా అధికారులే చూడనున్నారు.

**పురపాలిక అధికారులకే తెలియని దుస్థితి**

తుడా, చుడా, మున్సిపల్ అధికారుల్లో కొందరు అనుమతుల పేరిట మామూళ్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఎవరికీ జవాబు దారీ కాని పట్టణాభివృద్ధి సంస్థలతో సర్వ అధికారాలున్న మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకే ఎలాంటి సమాచారం అందని పరిస్థితి.

## ధ్వంసం చేసి.. పరిహారం చెల్లించి

నాయుడుపేట : నాయుడుపేట మండలం కాపులూరు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 102 నుంచి 111 వరకు ఆ గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. 40 నుంచి 50 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. అయితే ఈ భూములు రెవెన్యూ రికార్డుల్లో గర్భకండ్రిగ ఇనాం భూముల జాబితాలోకి చేరాయి. గ్రామంలోని 23 మంది రైతులకు చెందిన 10.20 ఎకరాల భూమిలో సాగరమాల రోడ్డు వేస్తున్నారు. ఈ క్రమంలోనే రైతులకు సంబంధించిన భూములకు రికార్డులు సరిగా లేవని నష్టపరిహారం చెల్లించలేదు. పరిహారం చెల్లించకపోవడంతో నెలన్నర కిందట వరినాట్లు వేశారు.

రోడ్డు పనులు చేపడుతున్న గుత్తేదారు రెవెన్యూ అధికారుల అండతో రైతులు సాగు చేసుకుంటున్న పంటలను యంత్రాలతో ధ్వంసం చేశారు. విషయం పొక్కకుండా... గుత్తేదారు రైతులను తహసీల్దారు కార్యాల



యానికి పిలిపించి పంటకు పరిహారంగా ఎకరాకు రూ.15వేలు చెల్లించారు. పొలాలు తమకు చెందినవి కాకుంటే పరిహారం ఎందుకు చెల్లించారని.. గుత్తేదారు, అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

**త్వరలోనే భూములకు చెల్లిస్తాం**

కాపులూరులోని భూములు గర్భకండ్రిగ పేరుతో రికార్డుల్లో ఉండటం, రికార్డులు సరిగా లేకపోవడంతో పరిహారం చెల్లింపు ఆలస్యమైంది. రోడ్డు పనుల్లో భాగంగా పంట ధ్వంసం చేయడంతో పరిహారం చెల్లించాం. త్వరలోనే రైతుల భూములకు పరిహారం చెల్లిస్తాం. రాజేంద్ర, ఇన్‌ఛార్జి తహసీల్దారు

## గోకులాలు.. బిల్లులు రాక తిప్పలు

చిత్తూరు : యాదమరి మండలం కొత్తూరు, బండివాళ్ల ఊరుకు చెందిన రైతులు గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టి పనులు చివరి దశకు చేరుకున్నా పిల్లర్లకు సంబంధించి రూ.22 వేలు మినహా మిగిలిన మొత్తం ఇంకా మంజూరు కాలేదు.వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పాడి పరిశ్రమ ఉంది. పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాయి. పశువుల షెడ్లను గోకులం పేరుతో అర్హులైన రైతులకు మంజూరు చేశారు. పది శాతం రైతు వాటాగా, మిగిలిన మొత్తం ఉపాధి పథకం కింద ప్రభుత్వ రాయితీగా ప్రకటించారు. అక్టోబరులో షెడ్లు మంజూరయ్యాయి. ప్రారంభంలో రైతులు వీటి నిర్మాణానికి ఎంతో ఆసక్తి చూపారు. నిధుల కొరత లేదని, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఉపాధి హామీ సిబ్బంది లబ్ధిదారుల వెంట పడ్డారు. రైతులు అప్పు చేసి మరీ షెడ్ల నిర్మాణం చేపట్టారు. చాలా వరకు పూర్తయ్యాయి.

**విడుదల కాని స్లాట్..** షెడ్ల నిర్మాణం ప్రారంభమైన అనంతరం నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో కొలతలు తీసి, నిబంధనల మేరకు ఎం.బుక్ రికార్డు చేసి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లులివ్వాలి. అయితే నెల రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా బిల్లులు చెల్లించేందుకు స్లాట్ విడుదల కాలేదు.

# తప్పుడు పత్రం ఆస్తులు అక్రమార్కుల పరం



నంద్యాల : జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అక్రమాలకు అడ్డాగా మారాయి.. కాసులకు కక్కుర్తి పడిన కొందరు అధికారులు భూ ఆక్రమణదారులతో అంటకాగుతున్నారు.. జిల్లాలో నంద్యాల, బండిఆత్మకూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం, బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, బేతంచెర్ల, డోన్, ప్యాపిలిలో సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉన్నాయి. ప్రజల సౌలభ్యం కోసం అమల్లోకి తెచ్చిన 'ఎనీవేర్' రిజిస్ట్రేషన్ విధానాన్ని అక్రమార్కులు ఆసరా చేసుకొంటున్నారు. అధికారుల తీరుతో అసలు యజమానులు ఆస్తులు కోల్పోవాల్సి వస్తోంది. తాజాగా నంద్యాల సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌సత్తార్ అక్రమ ఆస్తి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో వేటు వేశారు.

**విచారణ చేయకుండానే ఆమోదం**

అడిగినంత లంచం ఇస్తే చాలా ఎటువంటి భూమినైనా రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి కొన్ని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో కనిపిస్తోంది. వ్యవసాయ భూమి, వాణిజ్య స్థలం, ఫ్లాట్, ప్లాటు ఏదైనా సరే అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. నిబంధనల మేరకు ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయాలంటే.. చట్టబద్ధమైన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఈ పత్రాలకు సంబంధించి లింకు డాక్యుమెంట్లు ఉండాలి. అంటే ఒక ఇల్లు ఉందంటే దానిని ఎప్పుడు నిర్మించారు, వంశపారంపర్యంగా వచ్చిందా? గతంలో ఈ స్థిరాస్తికి సంబంధించి ఏమైనా రిజిస్ట్రేషన్లు జరిగాయా? యజమాని ఎవరు తదితర వివరాలు తెలిపే దస్త్రాలు పక్కాగా ఉండాలి. సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లోని వివరాలతో సరిపోయిన తర్వాతనే రిజిస్ట్రేషన్లు జరగాలి. ఇవేమి సరిగ్గా లేకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించడం వాటిని చూసి రిజిస్ట్రేషన్లు చేయడం, కొన్నిసార్లు సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

వేటు పడినా అక్రమాలు మానరు

శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం రొద్దకంపల్లె పరిధిలోని సర్వే నంబరు–97లో 16.80 ఎకరాల నిషేధిత భూమికి బనగానపల్లి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కొంతకాలం కిందట రిజిస్ట్రేషన్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూమిని నిబంధనలు పాటించకుండా అప్పటి బనగానపల్లి సబ్ రిజిస్ట్రార్ జె.శ్రీధర్ గుప్తా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై బనగానపల్లికి చెందిన రంగనాయకులు ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన డీఐజీ సబ్‌రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

న్యాయస్థానం స్టే విధించిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఓ ఇంటికి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో నంద్యాల సబ్ రిజిస్ట్రారు నాయబ్ అబ్దుల్ సత్తార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గతేడాది నవంబరు 24న ఏనీవేర్ రిజిస్ట్రేషన్ కింద నంద్యాలలో అబ్దుల్ సత్తార్ ఈ రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై కొందరు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి ఫిర్యాదు చేశారు. ఐజీ ఆదేశాలతో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కల్యాణి విచారణ చేపట్టారు. అనంతరం నాయబ్ అబ్దుల్ సత్తార్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. మూడు నెలల కిందటే ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు బదిలీపై వచ్చారు.

**దస్త్రాలు పుట్టించారు**

బనగానపల్లిలో గతేడాది సబ్ రిజిస్ట్రారు సస్పెండయ్యారు. ఇదే పట్టణంలో కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఒక స్థలానికి ఎన్‌వోసీ ఇవ్వడం.. దాన్ని చూసి రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం.

నంద్యాల పట్టణం కాంతినగర్, రైతునగరం, సాయిబాబానగర్ ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వచ్చి న్యాయస్థానాల్లో వ్యాజ్యాలకు దారి తీశాయి. వైఎస్సార్ నగర్, నందమూరినగర్, చాబోలు, అయ్యలూరు, పాలకేంద్రం సమీపంలో దొంగ పవర్ ఆఫ్ అటార్నీ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేశారు.నంద్యాల బర్మాషెల్ ప్రాంతంలోని 15 సెంట్ల స్థలంపై వివాదం తలెత్తడంతో ఒక వర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. న్యాయస్థానం ఈ వర్గానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. మరో వర్గం వారు ఇటీవల బనగానపల్లి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఆ భూమి తమదేనంటూ కొందరికి రిజిస్ట్రేషన్ చేయించారు.

జిల్లా కేంద్రం నంద్యాల పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలో సర్వే నంబరు 2313–1లోని 2.30 ఎకరాల భూమిని 43 ప్లాట్లుగా విభజించి బేతంచెర్ల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత ఈ సర్వే నంబర్లన్నింటినీ నిషేధిత భూమి జాబితాలో చేర్చారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఇటీవల కొన్ని సర్వే నంబర్లను నిషేధిత జాబితా నుంచి తొలగించి యజమానులకు భద్రతాపత్రాలు అందజేశారు.

# చుక్కల భూమికి రెక్కలు



కర్నూలు: డోన్ పట్టణంలో ప్రధాన రహదారికి సమీపంలో రూ.5 కోట్ల విలువైన భూమికి కొందరు వైకాపా నేతలు ఎసరు పెట్టారు. బినామీల పేరుమీదికి మార్చుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దాన్ని పరిరక్షించాల్సిన అప్పటి తహసీల్దార్ అక్రమాలకు కొమ్ముకాశారు. కొందరు అజ్ఞాత వ్యక్తులు రెవెన్యూ డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేపట్టారు. అక్రమాలన్నీ నిజమేనని రెవెన్యూ శాఖ మండల అధికారి నివేదిక ఇచ్చారు.. ఇంతలోనే గత నెల 29న రామాంజనేయులకు విక్రయించడం సంచలనంగా మారింది. ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్ల వివరాలన్నీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉంటాయి. ప్రైవేటు వ్యక్తులు ఎలా రిజిస్ట్రేషన్ చేశారో అధికారులకే తెలియాలి.

**క్షణాల్లో దరఖాస్తు ఆమోదం**

డోన్ పట్టణంలో సర్వే నంబరు–102లో 1.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆర్ఎస్ఆర్‌లో దాన్ని చుక్కల భూమిగా నమోదు చేశారు. దాని చుట్టూ పక్కల స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి.. అక్కడ సెంటు రూ.5 లక్షలు పలుకుతోంది. దానిపై వైకాపా నేతల కన్నుపడింది. పట్టణానికి చెందిన ఎస్.రాధను రంగంలోకి దించారు. ఆమె భర్త గంగాధర్ ఒప్పంద ప్రాతిపదికన చిరుద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నాటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి డోన్‌లో అన్నీతానై వ్యవహరించిన ఆ చిరుద్యోగి భార్య పేరుతో భూమిని కొట్టేసేందుకు పక్కా ప్రణాళిక రచించారు.

ఆ భూమి తనకు వారసత్వంగా సక్రమించింది.. దాన్ని ఆన్‌లైన్‌లో తన పేరుపై నమోదు చేయాలని సదరు మహిళతో తహసీల్దార్‌కు దరఖాస్తు చేయించారు. దరఖాస్తు రావడమే ఆలస్యం రూ.కోట్ల విలువైన ఆ ప్రభుత్వ భూమి ఆమె పేరుమీదకు మారింది.

**పేరు మార్చారు.. దస్త్రం మాయం చేశారు**

మ్యుటేషన్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకొనే వారు అన్ని రకాల పత్రాలు సమర్పించాలి. ఆర్ఐ, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిజ నిర్ధారణ చేయాలి. ఆ నివేదిక ప్రకారం తహసీల్దార్ ముందుకెళ్లాలి. అప్పటి డోన్ తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి ఆయా అంశాలేవీ పట్టించుకోలేదు. ఆర్ఎస్ఆర్‌లో చుక్కల భూమిగా నమోదై ఉంది.. అక్కడ రాళ్లతో కూడిన గుట్ట ఉన్నట్లు అందరికీ తెలుసు.. దాన్ని ఎవరూ సాగు చేసుకోవడం లేదు.. ఇవన్నీ అధికారులకూ తెలుసూ అయినా అప్పటి నేతల ఒత్తిడితో ఆ భూమిని ఆ మహిళ పేరుపై నమోదు చేశారు. విషయం ఎక్కడా బయటకు రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో సదరు మహిళ దరఖాస్తు, అధికారుల ఫైల్‌ను మాయం చేశారు. "గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. చివరకు కబ్జా అయ్యిందని" పట్టణానికి చెందిన వడ్డే మహరాజ్ పేర్కొన్నారు.

# మొక్కజొన్నకు కత్తెర

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లెకి చెందిన ఇమాం హుశేన్ ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని మొక్కజొన్న వేశారు. 25 రోజులు అవుతోంది. కత్తెర పురుగు సోకడంతో మందు పిచికారీ చేశారు. నియంత్రణలోకి రాలేదు.. చేసేది లేక పంటను వదిలేశారు. కౌలు రూ.15 వేలు, పెట్టుబడి రూ.20 వేలు ఖర్చు చేశా.. లాభం లేదనుకొని పంట వదిలేశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


మొక్కజొన్న రైతులను కత్తెర పురుగు కలవర పరుస్తోంది.. మందులు చల్లినా కట్టడి కాకపోవడంతో చాలా మంది రైతులు పంటను వదిలేస్తున్నారు. జిల్లాలో రబీలో వరి తర్వాత మొక్కజొన్న అధికంగా సాగు చేస్తారు. మార్కెట్లో ధర బాగుండటంతో ఈసారి మరింత పెరిగింది. కాల్వలు నిండుగా ప్రవహిస్తుండటంతో ఆళ్లగడ్డ డివిజన్‌లో సాగు ఎక్కువగా ఉంది.

**ముంచిన వరుస ముసురు**

జిల్లాలో సాగైన మొక్కజొన్న ప్రస్తుతం రెండు వేల హెక్టార్లు పిలక దశలో, ఐదు వేల హెక్టార్లు పూత దశ, రెండు వేల హెక్టార్లు కంకిదశలో ఉంది. ఇటీవల వచ్చిన ముసురు ప్రభావంతో కత్తెర పురుగు ఉద్ధృతి పెరిగింది. పూత, కంకిదశలో ఉన్న పంటను తీవ్రంగా నష్ట పరుస్తోంది. పంట సాగు చేసిన నెల రోజుల్లోనే కత్తెర పురుగు సోకుతోంది. ఆకులు తినేస్తూ కాండంలో ప్రవేశించి మొక్కను నాశనం చేస్తోంది.

**పెరిగిన పెట్టుబడి**

సాధారణంగా ఎకరా మొక్కజొన్నకు రూ.25 వేల వరకు ఖర్చవుతుంది. కత్తెర పురుగు సోకిన వెంటనే రసాయనిక మందులు పిచికారీ చేస్తే



కొంత వరకు పంటను కాపాడుకోవచ్చు. లేదంటే పంట నాశనమై దిగుబడులు సరిగా రాని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు రెండు, మూడుసార్లు మందుల పిచికారీ చేస్తుండటంతో రూ.10వేలు వరకు అదనంగా పెట్టాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. "గుర్తించిన వెంటనే ఇమామిథిన్ బెంజోయేట్ మందు చల్లితే తగ్గుముఖం పడుతుందని ఆళ్లగడ్డ డివిజన్ వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు

## థ్రిఫ్ట్ పథకం.. నేతన్నకు వరం

ఎమ్మిగనూరు : వైకాపా ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు ఆసరాగా నిలిచిన థ్రిఫ్ట్ పథకాన్ని రద్దు చేసి ఇబ్బందులకు గురిచేయగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని పునరుద్ధరించింది. సహకార సంఘాల్లో గతంలో అమలు చేసిన దీనికి ప్రస్తుతం నిధులు మంజూరు చేసింది. థ్రిఫ్ట్ పథకంతో ఉచిత విద్యుత్తు 100 యూనిట్లు, ముడిసరకు రాయితీ వంటి సంక్షేమ పథకాల అమలు కావడంతో చేనేత కార్మికులకు వరంగా మారింది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, కోడుమూరు, నంద్యాల, అళ్లగడ్డ, నందికొట్కూరు, ఆదోని నియోజకవర్గాల్లో మొత్తం 66 చేనేత సంఘాలున్నాయి. వైకాపా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వాటి సంఖ్య 44కు తగ్గిపోయింది. సొసైటీల పరిధిలో 3,700 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. వీరు ప్రతి నెలా నేత పని ద్వారా సంపాదించిన మొత్తంలో 8 శాతం పొదుపు చేస్తే, ప్రభుత్వం మరో 16 శాతం కలిపి అందించనుంది. ఈ నిధులను ఏడాదికి మూడు విడతలుగా విడుదల చేస్తుంది. ఇవి బ్యాంకులో జమైన 90 రోజుల తర్వాత కార్మికులు డ్రా చేసుకుని తమ అవసరాలకు వాడుకోవచ్చు.

**వైకాపా హయాంలో నిలిచిన పథకాలు**

వైకాపా ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు కేవలం నేతన్న నేస్తం కింద రూ.24 వేలు మాత్రమే అందజేసింది. ఉచిత విద్యుత్తుకు వంద యూనిట్లు, రాయితీ ముడిసరకు. మగ్గం పరికరాల రాయితీ, బ్యాంకు



రుణాలు ఇలా అన్నింటినీ రద్దు చేసింది. దీంట్లో సొసైటీ కార్మికులకిచ్చే థ్రిఫ్ట్ ఫండ్ పథకం ఉంది. వాస్తవానికి 2018 వరకు ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసేవి. ఆ సమయంలో రెండు ప్రభుత్వాలు 8 శాతం మాత్రమే అందించేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కార్మికులు పొదుపు చేసే దానికి రెట్టింపు అందించేందుకు ముందుకు రావడంతో నేతన్నలకు లబ్ధి చేకూరనుంది.

**జిల్లాలోని 3700 మందికి లబ్ధి**

జిల్లాలో 3,700 మంది సభ్యులు ఆయా సొసైటీ కింద ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు కనీసం రూ.1,600 చొప్పున వర్తించే అవకాశముంది. సుమారు రూ.59.20 లక్షల మేర లబ్ధి పొందనున్నారు. అదే ఏడాదికైతే రూ.7 కోట్ల వరకు వారి ఖాతాలో జమ కానున్నాయి. కార్మికుడు విధిగా సొసైటీ ద్వారా మగ్గం పని చేయడం వల్ల ప్రతి నెలా సంపాదించే దాంట్లో 8 శాతం పొదుపు చేస్తేనే ఇది వర్తిస్తుంది. కావున ప్రతి కార్మికుడు తనకు వచ్చిన కూలీలో కొంత జమ చేస్తేనే లబ్ధి కలుగనుంది.

**డబ్బులు జమ చేస్తున్నా**

**నారాయణ, చేనేత కార్మికుడు**

నేను చేనేత సొసైటీలో లుంగీలు, తువ్వాళ్లు, అడ్డపంచెల, దోమ తెరలు, చేతిరుమాళ్లు చేస్తున్నా. ప్రస్తుతం బెడ్‌షీట్ తయారీలో ఉన్నా. రోజూ రెండు బెడ్‌షీట్లు చేస్తున్నా. రూ.260 వరకు కూలీ వస్తోంది. నెలకు కనీసం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఆదాయం ఉంటుంది. వచ్చిన దాంట్లో కొంత పొదుపు చేస్తుండగా ప్రభుత్వం థ్రిఫ్ట్ పథకం కింద 16 శాతం జమ చేస్తోంది. దీంతోపాటు ఉచితంగా వంద యూనిట్లు కరెంటు లబ్ధి పొందుతున్నా. ప్రభుత్వం ముడిసరకు రాయితీ ఇస్తే కార్మికులకు ప్రయోజనం ఉంటుంది.

**నేత నేసే ప్రతి కార్మికుడికి వర్తింపు**

**నాగరాజురావు, జౌళి శాఖ అధికారి, కర్నూలు**

నేత నేసే ప్రతి కార్మికుడికి థ్రిఫ్ట్ పథకం వర్తిస్తుంది. కార్మికుడు నేసిన పనితో వచ్చిన కూలీ సొమ్ములో 8 శాతం పొదుపు చేయాలి. ప్రభుత్వం 16 శాతం కలిపి చేనేత కార్మికుల ఖాతాలో జమ చేస్తుంది. సొసైటీల్లోని సభ్యులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## కాల్వ మట్టిలో కాసుల వేట

పత్తికొండ : హంద్రీనీవా కాల్వ మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతు న్నారు. ఇప్పటికే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమార్కులు కొట్టుకుపోయి సొమ్ము చేసుకున్నారు.తమ కళ్లెదుటే భారీగా మట్టి తరలిపోతున్నా.. సంబంధిత అధికారులు ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారే మధ్యవర్తులుగా ఉంటూ మట్టి దందాకు సహకరిస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఆ పార్టీకి చెందిన పలువురు రాత్రింబవళ్లు తోడేశారు. కొన్నాళ్లు ఆగిన మట్టి దందా మళ్లీ మొదలైంది. కాల్వ పొడవునా నిత్యం వంద ట్రిప్పుల వరకు తరలిస్తున్నారు.. ట్రాక్టర్ మట్టిని రూ.1,000 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారు.

**అధికారులే మధ్యవర్తులు**

హంద్రీనీవా కాల్వ మట్టిని కాపాడాల్సిన అధికారులే కాసులకు కక్కుర్తి పడి అమ్ముకుంటున్నారు. మద్దికెర, అగ్రహారం, యడవలి, హంప, బొజ్జనాయునిపేట, పెరవలి, బురుజుల, హోసూరు గ్రామాల పరిధిలో ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించే వారి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ఓ అధికారి మధ్యవర్తులను నియమించుకొన్నారు.

కాల్వ వద్దకు ట్రాక్టర్లు వచ్చిన వెంటనే మధ్యవర్తులు సదరు అధికారికి సమాచారం చేరవేస్తారు.. వెంటనే ఆయన అక్కడ ప్రత్యక్షం అవుతారు.. వారి నుంచి డబ్బులు తీసుకొని వెళ్తారు.

పలుమార్లు యంత్రాలు, ట్రాక్టర్లను పట్టుకున్నా.. ఒక్కరిపైనా కేసులు నమోదు చేసిన దాఖలాలూ లేవు. ఇటీవల మద్దికెర పోలీసులు ఓ పొక్లెయిన్, రెండు ట్రాక్టర్లు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సంబంధిత అధికారి అభ్యంతరం తెలుపుతూ.. మీకేం సంబంధముంది? ఎందుకు పట్టుకున్నారని ప్రశ్నించారు.

కాల్వ రక్షణకు గండి

ఉమ్మడి జిల్లాలో 87వేల ఎకరాలు సాగు, 50 గ్రామాలకు తాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో కాల్వను నిర్మించారు.

నందికొట్కూరు నియోజకవర్గం మల్యాల నుంచి పత్తికొండ నియోజకవర్గం మద్దికెర వరకు 134 కి.మీ మేర కాల్వ విస్తరించి ఉంది.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇరువైపులా గోడలా మట్టిని పోశారు. కాల్వ లోతును బట్టి 30 మీటర్ల ఎత్తు వరకు ఇరువైపులా మట్టిని కట్టగా నిర్మించారు. దాన్ని తవ్వేయడంతో కట్ట భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

నాయకులకు కప్పం

వెల్దుర్తి, కృష్ణగిరి, పత్తికొండ, మద్దికెర, దేవనకొండ, చిప్పగిరి తదితర మండలాల్లో ఏ పనికైనా హంద్రీనీవా కాల్వ మట్టినే వినియోగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు దూరాన్ని బట్టి రవాణా ఖర్చు కింద రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు ఆ గ్రామ నేతలకు చెల్లిస్తున్నారు. మద్దికెర, అగ్రహారం, యడవలి, పెరవలి, హంప, బురుజుల, హోసూరు, పత్తికొండ, దేవనకొండ గ్రామాల పరిధిలో కాల్వ మట్టిని ఇప్పటికే ఖతం చేశారు.

గుత్తేదారులు కొల్లగొడుతున్నారు

పత్తికొండ, ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేస్తే గుత్తేదారులూ ఇక్కడి నుంచే మట్టిని తీసుకెళ్తున్నారు.

నిబంధనల ప్రకారం ప్రగతి పనులు చేస్తే గుత్తేదారులు మట్టిని తరలిస్తే ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. హంద్రీమట్టి ఉచితం కావడంతో వాహనాలు పెట్టి తరలిస్తున్నారు. రైల్వే డబ్లింగ్ పనులకు లక్షల ట్రిప్పుల మట్టిని ఇక్కడి నుంచే తరలించారు.

# సర్వేకని వెళతారు.. ఎపుడొస్తారో చెప్పరు..

మడకశిర : సచివాలయ ఉద్యోగులు సర్వే పేరుతో ఎప్పుడు కార్యాలయానికి వస్తారో తెలియని సందిగ్ధం నెలకొంది. సందులో సడేమియా అన్నట్లు కొందరు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారు. ఫలితంగా ప్రజలు ఏదైనా పనికోసం సచివాలయానికి వెళ్లి ఉసూరంటూ వెనక్కి తిరిగొస్తున్నారు. కనీసం వారు విధులకు ఎప్పుడొస్తారో చెప్పేవారే లేరంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం నగరంలోని ప్రతి సచివాలయంలో 8 నుంచి 10 మంది ఉద్యోగులు ఉండాలి. ఒకరు కూడా ఉండటం లేదు. మధ్యాహ్నం భోజనం 1 నుంచి 2 గంటల వరకు విరామం ఉంటుంది. ఈ సమయంలో బంద్ చేసి వెళితే మళ్లీ ఎప్పుడొస్తారో తెలియదు. కనీసం పర్యవేక్షించే వారు లేక ఆడిందే ఆటగా మారింది. నగరంలోని పలు సచివాలయాల్లో ఒక్కరు, ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉంటుండగా ఇంకొన్ని సచివాలయాల్లో ఒక్కరూ ఉండటం లేదు.



**తలుపులు మూసేసి..**

శారదానగర్‌లో ఉన్న వార్డు సచివాలయం 23వ డివిజన్లోని ప్రజల కోసం ఏర్పాటు చేశారు. ఇక్కడ 1,321 నివాసాల్లో 3,980 మంది నివసిస్తున్నారు. మొత్తం 8 మంది ఉద్యోగులు ఉండగా ఇద్దరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఆరుగురు ఉద్యోగులు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.04 గంటలకు పూర్తిగా తలుపులు మూసేసి పత్తాలేకుండా వెళ్లారు. తరచూ ఇదే పరిస్థితి ఉంటుందని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.

**ఖాళీ కుర్చీలు దర్శనం**

విజయనగర్ కాలనీ సంబంధించిన 41వ సచివాలయం నవోదయ కాలనీలో ఉంది. సంబంధిత ప్రాంతానికి కిలోమీటరు దూరంలో ఉంటుంది. ఇక్కడ మొత్తం 1,173 నివాసాలు ఉన్నాయి. 3,556 మంది జనాభా ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజనం విరామం అనంతరం 3.18 గంటలకు ఒక్క ఉద్యోగి కూడా రాలేదు. ఖాళీ కుర్చీలు ఉన్నాయి.

**సర్వేలో లేనివారు అందుబాటులో ఉండాల్సిందే**

పలు సచివాలయాల్లో సర్వేలు చేస్తున్నారు. కొందరు సర్వే కోసం వెళ్లినా కార్యాలయం వేళల్లో తలుపులు వేసి వెళ్లడం తగదు. డీఎస్సీ, ఇతర ఉద్యోగాల కోసం కొందరు సెలవులో ఉన్నారు. సర్వేలో లేని వారు అందుబాటులో ఉండి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది.రామలింగేశ్వర్, ఇన్‌ఛార్జి కమిషనరు

# నష్టాల బాటలో మల్బరీ

మడకశిర : కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో మల్బరీ సాగుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నాణ్యమైన పట్టుగూళ్లు పండిస్తుండడంతో రెండు దశాబ్దాల క్రితం ఇక్కడి రైతులకు రాష్ట్ర ఉత్తమ పట్టు రైతుల అవార్డులు దక్కాయి. అప్పట్లో మల్బరీ సాగు వందల ఎకరాల్లో ఉన్నది క్రమేపీ వేల ఎకరాలకు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో 16వేల ఎకరాల్లో మల్బరీ సాగు ఉంది. రైతులు పండించిన పట్టుగూళ్లు హిందూపురం, కర్ణాటకలోని రామనగర, సిడ్లగట్ట మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. మల్బరీ సాగులో మంచి మెళకువలు నేర్చుకున్న రైతులు వంద గుడ్లకు వంద కేజీల పట్టుగూళ్ల దిగుబడులు సాధిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న మల్బరీ సాగు ఇటీవల రైతులకు తీవ్ర కష్టాలను మిగుల్చుతోంది.

**రెట్టింపైన పట్టుపురుగుల పెంపకం ధరలు**

దుక్కిదున్నినప్పటి నుంచి తోట పెంపకం, డ్రిప్పులు, ఎరువులు, మందులు, చాకీ పురుగుల కొనుగోలు, కూలీలు, నేత్రిలు తదితర ఖర్చులు భారీగా పెరిగాయి. కిలో పట్టుగూళ్ల దిగుబడిపై రైతుకు రూ.450 నుంచి రూ.500వరకు ఖర్చొస్తోంది. మార్కెట్లో మంచి ధరలు ఉన్నా గిట్టుబాటు కావడం లేదు.

**వక్క, దానిమ్మ వైపు**

పట్టుపురుగుల పెంపకం ఖర్చులతో కూడుకుని ఉండడంతో మల్బరీ



తోటల పెంపకానికి బదులు రైతులు ప్రత్యామ్నాయంగా వక్క, దానిమ్మ, వరి, కర్బూజ, దోస తదితర పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు 400 ఎకరాల్లో మల్బరీపంట తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేశారు.

**కుంగదీస్తున్న తెగుళ్లు**

నాలుగేళ్లుగా మల్బరీతోటలకు సుడిరోగం, పచ్చపురుగు సోకి ఆకు నాణ్యత లోపించింది. దీని ప్రభావం పట్టుగూళ్ల దిగుబడిపై చూపుతోంది. సంబంధిత అధికారులు కానీ, శాస్త్రవేత్తలు కానీ వీటి నివారణలో విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల కారణంగా ఆకు దిగుబడి రావడం లేదు. తెగుళ్లు సోకిన ఆకును తినడం వలన పట్టుపురుగులు నాణ్యమైన గూళ్లు అల్లడం లేదు. దీంతో మార్కెట్లో ధరలు కూడా పలకడం లేదు.

**మెలకువలు పాటిస్తే తెగుళ్లు నివారించవచ్చు**

ప్రస్తుతం మల్బరీతోటలకు పచ్చపురుగు, సుడిరోగం సోకుతోంది. నువాన్ మందును పిచికారీ చేస్తే తెగుళ్లు తగ్గుముఖం పడతాయి. మల్బరీ మొక్కలు పెంపకానికి, షెడ్లకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 75 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది.రాజు, ఏడీఏ, పట్టుపరిశ్రమశాఖ, మడకశిర

# గ్రామీణ దారులకు మహర్దశ



అనంతపురం : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వైకాపా ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన రహదారులను బాగు చేయడంతోపాటు అవసరమైన చోట కొత్తవి నిర్మిస్తోంది. పెద్దఎత్తున ఉపాధి నిధులను ఖర్చు చేస్తుండటంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చాలా గ్రామాల్లో వందశాతం పనులు పూర్తయ్యాయి. సీసీ రోడ్లతోపాటు పలుచోట్ల బీటీ రహదారుల నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో రూ.226 కోట్లతో 3,612 పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే 70 శాతం సీసీరోడ్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి ప్రతివారం బిల్లులు చెల్లిస్తుండటంతో చక్కని పురోగతి కనిపిస్తోంది. గతేడాది అక్టోబరులో పనులు మొదలయ్యాయి. సంక్రాంతి లేదా ఈనెల చివరికి సీసీరోడ్ల నిర్మాణం వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**అనంతలో రూ.67 కోట్లు ఖర్చు**

అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 190 కిలోమీటర్లు పొడవైన 1,826 సీసీరోడ్లు మంజూరు చేశారు. ఉపాధిహామీ పథకం నుంచి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.100 కోట్లు కేటాయించారు. ఇప్పటికే 1,221 రహదారుల నిర్మాణం పూర్తయింది. 136 కిలోమీటర్ల మేర పనులు పూర్తికాగా ఇప్పటివరకు రూ.67 కోట్లు ఖర్చు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో రూ.126 కోట్ల అంచనాతో 1,777 పనులు మొదలు పెట్టారు. 250 కిలోమీటర్ల మేర సీసీరోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో 1,257 పనులు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పనులు వేగంగా సాగుతున్నాయి. రెండు జిల్లాల కలెక్టర్లు, రోజువారీగా ప్రగతిపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతిలోపు పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే కొంత ఆలస్యమై ఈనెల నెలాఖరుకు గ్రామాల్లో రహదారుల పనులు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

**అక్కడ రాజకీయ గ్రహణం**

ధర్మవరం నియోజకవర్గ పరిధిలో రాజకీయాల కారణంగా అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. ముఖ్యంగా ముదిగుబ్బ మండలంలో రూ.3 కోట్లతో 77 పనులు మంజూరు చేశారు. మండలంలో పనులు చేసే విషయంలో తెదేపా, భాజపా నాయకుల మధ్య వివాదం నెలకొంది. వైకాపా నుంచి భాజపాలో చేరిన నాయకుడు పనులకు అడ్డుపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనులన్నీ తమ వర్గీయులకే కట్టబెట్టాలని అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో మండలంలో అభివృద్ధి కుంటుపడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధర్మవరం నియోజవర్గవ్యాప్తంగా 314 పనులు మంజూరు కాగా 91 పనులు ఇప్పటివరకు మొదలుకాకపోవడం గమనార్హం.

**నాడు నగుబాటు..**

రాప్తాడు మండలంలో చాపట్ల-మరూరు రోడ్డు నాడు-నేడు పరిస్థితి ఇది. 2018లో అప్పటి మంత్రి పరిటాల సునీత రోడ్డు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోవడం, ప్రభుత్వం మారడం జరిగిపోయాయి. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో గ్రామీణ ప్రజల కష్టాలు మొదటికొచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట మేరకు ఈ రోడ్డుతోపాటు 9.2 కిలోమీటర్లు తారురోడ్లకు రూ.4.96 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తి చేశారు.

**అనంతపురం జిల్లాలో వివరాలు**

మంజూరైన పనులు: 1,835
అంచనా వ్యయం: రూ.100 కోట్లు
పూర్తయిన పనులు: 1,221
నిర్మించిన రహదారుల పొడవు: 139కి.మీ.
చెల్లించిన బిల్లులు: రూ.69 కోట్లు

# వైకాపా నిర్లక్ష్యం.. ప్రభుత్వ ఖజానాపై భారం



కదిరి : గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఫలితంగా నేడు ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది. ఎస్టీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల భవన సముదాయ నిర్మాణ పనులు రూ.5 కోట్లతో పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఫలితంగా ప్రస్తుతం నిర్మాణ వ్యయం రూ.11.98 కోట్లకు పెరిగింది. పర్యావసానంగా ప్రభుత్వ ఖజానాపై రూ.6.98 కోట్లు భారం పడనుంది. కదిరి మండలం గంగనగారిపల్లి వద్ద ఎస్టీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల భవన సముదాయం కోసం 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం మూడున్నర ఎకరాల భూమి కేటాయించింది. భవన సముదాయ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారు 30 శాతం పనులు పూర్తి చేశారు. ఈలోపు 2019 ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చింది. నిర్మాణ పనులు తమకు అప్పగించాలని వైకాపా నాయకులు గుత్తేదారుడిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఆయన పనులు అర్ధాంతరంగా ఆపేసి ముఖం చాటేశారు. నిర్మాణం చేపట్టిన వైకాపా నాయకులు కూడా నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో పనులు వదిలేశారు. ఫలితంగా మొండిగోడలకే భవనం పరిమితమైంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం భవన సముదాయ నిర్మాణంపై దృష్టి సారించింది. ప్రస్తుతం పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు రూ.11.98 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వైకాపా నాయకుల తీరు వల్ల రూ.6.98 కోట్ల ప్రజాధనం అదనంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

**అసౌకర్యాలతో విద్యార్థినుల అవస్థలు**

తనకల్లు మండలం సీజీ ప్రాజెక్టు వద్ద 2013లో ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల నిర్వహణకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. అక్కడ పాఠశాల విద్యార్థులకే సరిపోవడంతో జూనియర్ కళాశాలను కదిరి మండలం ముత్యాలచెరువు సమీపంలో అద్దె భవనంలో ప్రారంభించారు. అప్పటి నుంచి సరైన సదుపాయాలు లేని అద్దె భవనంలోనే కళాశాల నిర్వహిస్తున్నారు. బైపీసీ, ఎంపీసీ గ్రూపులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి మొత్తం 160 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరి వసతి కోసం నాలుగు గదులు మాత్రమే కేటాయించడంతో.. వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అరకొర వసతులున్న ఈ భవనానికి అద్దె రూపంలో నెలకు రూ.78 వేలు చెల్లిస్తుండటం గమనార్హం. వీటన్నింటికీ వైకాపా నాయకులు అనుసరించిన వైఖరే కారణం.

**పనులు ప్రారంభిస్తాం..** కదిరి మండలం ముత్యాలచెరువు వద్ద అద్దె భవనంలో ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినుల ఇబ్బందులు పడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. గంగనగారిపల్లి వద్ద కేటాయించిన స్థలంలో భవన సముదాయ నిర్మాణం చేపడతాం. రూ.11.58 కోట్లతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం. మోహన్‌రామ్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి, శ్రీసత్యసాయి

# హిందూపురంలో మహారాష్ట్ర మద్యం పట్టివేత?

అనంతపురం: హిందూపురం కేంద్రంగా మద్యం సిండికేట్ విజృంభిస్తోంది. అనధికార దుకాణాలతోపాటు ఎలాంటి అనుమతులు లేకుండా బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారు. స్థానిక వైకాపా, తెదేపా నాయకులు కుమ్మక్కై మద్యం అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే క్రమంలో మహారాష్ట్ర నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు హిందూపురం గ్రామీణం పరిధిలో దాడులు నిర్వహించారు. బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి పెద్దమొత్తంలో మహారాష్ట్ర, గోవా మద్యాన్ని పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. రూ.లక్షలు విలువ చేసే సరకును పట్టుకున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో మళ్లీ విడిచిపెట్టినట్లు సమాచారం. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా కొందరు నాయకుల కనుసన్నల్లో పనిచేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హిందూపురం మండల పరిధిలోని కొట్నూరు, చలివెందుల, తూముకుంటతో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. హిందూపురంలో మహారాష్ట్ర మద్యం పట్టుకున్న విషయంపై ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏసీ మునిస్వామి వివరణ కోరగా విచారణ జరుగుతోందని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని తెలిపారు.

**తోటలో నుంచి సరఫరా** స్థానికంగా అధికారపార్టీకి చెందిన కొందరు నాయకులు మహారాష్ట్ర నుంచి నకిలీ మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా హిందూపురం తీసుకొస్తున్నారు. అక్కడ ఒక్క సీసా రూ.80 కొనుగోలు చేసి ఇక్కడ రూ.150 విక్రయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇదే క్రమంలో స్థానిక నాయకుడికి చెందిన తోటలో భారీ మొత్తంలో మహారాష్ట్ర మద్యాన్ని డంప్ చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. రూ.కోట్లు విలువ చేసే సరకును తోటలోని రహస్య ప్రాంతంలో ఉంచి.. అక్కడి నుంచి నియోజకవర్గంలోని బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. బెల్టుషాపులో మరో రూ.10 పెంచి మందుబాబులకు విక్రయిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు స్పందించి కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

# శివ.. శివా.. ఇదేం నిర్వహణ

బంగారుపాళ్యం : మొగిలీశ్వరాలయంలో కనీస వసతులు కల్పించాలని దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా ఇక్కడి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారిణి వచ్చారు.. చూశారు.. చెప్పారు.. అయితే చేయాలని రూలేం లేదు కదా.. అంతా మా ఇష్టం.. అడిగేదెవరు.. అన్నరీతిన వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది..

ఆలయంలో స్వామివారికి నిత్యం రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, రాహుకేతు పూజలు, బిల్వార్చన, అన్నాభిషేకం, అర్చన, నిర్వహిస్తారు. భక్తులు ఇందుకు రుసుం చెల్లిస్తారు. ఈ పూజలకు ఎంత రుసుము చెల్లించాలి, ఎప్పుడు చెల్లించాలన్న వివరాలతో బచిర్డులు లేవు. దూర ప్రాంతాల భక్తులు సమాచారం కోసం తికమక పడుతున్నారు. ఇక ప్రత్యేక పూజలు రుసుము టిక్కెట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో ఆ శివయ్యకే ఎరుక. ప్రత్యేక పూజల రుసుము వసూలులో ఆలయ సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి.



**అధ్వానంగా పారిశుద్ధ్యం**

ఆలయం ఎదుట భవనంలో ప్రతి సోమవారం భక్తులకు అన్నదానం చేస్తారు. ఇందుకు వినియోగించిన ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, భోజన పేపరు ప్లేట్లు, ఇతరత్రా వ్యర్థాలను పెద్ద పెట్టెలో వేయాలని, వాటిని వారానికోసారి పంచాయతీ సిబ్బంది సాయంతో దూరంగా తరలించాలని ఏసీ ఆదేశించారు. ఈ దిశగా నేటికీ చర్యలు లేవు. వీటిని రోజుల తరబడి తరలించకపోవడంతో దుర్వాసన వస్తోంది.

**కానరాని ఫిర్యాదుల పెట్టె..**

స్వామి దర్శనానికి వచ్చే భక్తులు తమకు కలిగిన అసౌకర్యాన్ని తెలియజేసేందుకు, మెరుగైన వసతుల కల్పనకు ఇచ్చే సలహాల కోసం ఫిర్యాదుల పెట్టె ఆలయ ప్రాంగణంలో అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించినా ఫలితం శూన్యం. ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండటానికి ఓ సీఐ సొంతంగా పూలకుండీలు వితరణ చేశారు. సిబ్బంది వీటిని రక్షించకపోవడంతో అవి ఎండిపోయి కుండీలు ఖాళీగా ఉన్నాయి. వీటిలో పూల మొక్కలు పెంచాలని, ఇందుకు ఆలయ ఆదాయం నుంచి ఖర్చు చేయాలని సిబ్బందిని ఆదేశించినా ఆలయాధికారి ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**అంతా ఆయన ఇష్టమే..**

ఆలయ ఈవో నిర్దేశిత వేళల్లో ఆలయానికి రాకపోగా అందుబాటులో ఉండటం లేదు. సమాచారం కోసం చరవాణిలో సంప్రదించాలన్నా కష్టమే. అన్నమయ్య జిల్లాలో మరికొన్ని ఆలయాలకు తానే ఈవోగా వ్యవహరిస్తున్నానని, అందుకే ఇక్కడకు రావడం కుదరడం లేదని చెప్పడం గమనార్హం.

# పట్టా భూముల్లో తవ్వుకో.. అమ్ముకో..

రేణిగుంట : తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లు రేణిగుంట మండలంలో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. ఉన్నతస్థాయి అధికారులు దాడులు చేస్తున్నా ఈ దందా ఆగడం లేదు. ఇక్కడి ఇసుకను తమిళనాడు తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.మండలంలోని కొత్రమంగళం నుంచి జీపాళెం వరకు స్వర్ణముఖి పది కి.మీపైగా ప్రవహిస్తోంది. అక్రమార్కులు వేకువజామునే ఇష్టానుసారంగా పొక్లెయిన్లతో ఇసుక తవ్వి జేసీబీ, ట్రాక్టర్లలో ఒప్పంద ప్రదేశాలకు తరలిస్తున్నారు. తమకు అడ్డొచ్చిన వారిని డబ్బుతో కొనేస్తున్నారు. జీపాళెం, గాజులమండ్యం, పిల్లపాలెం, కొత్రమంగళంలో ఈ అక్రమ రవాణా సాగుతోంది. రేణిగుంటలో ఇసుక రీచ్ ఉన్నా.. నిరుపయోగంగా మారింది.

**గేటు పెట్టి మరీ..**

కొత్రమంగళం, తండ్లం వద్ద ఇష్టానుసారంగా స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఇక్కడ తిరుచానూరు వైపు గేటు పెట్టి మరీ కొందరు ప్రజాప్రతినిధులు వసూళ్ల పర్వానికి తెరలేపారు.

**చెరువుల్లా తవ్వుతున్నా..**

పట్టా భూముల నుంచి సులభంగా డబ్బులు సంపాదించొచ్చని ఇసుకాసురులు రైతుల నుంచి భూములు లీజుకు తీసుకుంటున్నారు. అక్కడ నిర్ణీత లోతు 4 నుంచి 8 అడుగులే తవ్వాలి. కానీ 30 అడుగుల వరకు తవ్వేస్తున్నారు. వెంకటరెడ్డికండ్రిగ, గాజులమండ్యం సమీపంలోని భూములను చూస్తే చెరువుల్లా మారిన పట్టాభూములు కనిపిస్తాయి. తుడా సంస్థ తూకివాకం నుంచి సూరప్పకశం టౌన్‌షిప్ వరకు రోడ్డు నిర్మించింది. వైకాపా హయాంలో ఈ రోడ్డును కలుపుతూ ఇసుక ట్రాక్టర్లు వెళ్లేందుకు మార్గం చేసుకోవడంతో ట్రాక్టర్ల వేగానికి అడ్డులేకుండా పోయింది.

**చర్యలు తీసుకుంటాం**

స్వర్ణముఖి నదిలో ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు. ప్రైవేటు భూముల్లోనూ అక్రమ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకుంటాం. అనుమతి మించి తవ్వుతున్న దానిపై విచారణ చేపడతాం. సురేష్‌బాబు, తహసీల్దార్, రేణిగుంట

# క్రిస్ సిటీ కల నెరవేరనుంది..!

తిరుపతి : పరిశ్రమల ఏర్పాటుతో సంపదను సృష్టించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం కార్యరూపం దాల్చనుంది. చెన్నై-బెంగళూరు పారిశ్రామికవాడలో భాగంగా క్రిస్ సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే బుధవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వర్చువల్ విధానంలో క్రిస్ సిటీకి శంకుస్థాపన చేయనున్నారు. క్రిస్ సిటీ ఏర్పాటుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎన్ఐసీడీసీ), ఏపీఐఐసీ అధికారులు 2017లో ఒప్పందం చేసుకున్నారు. 2018లో ఎస్పీవీని ఏర్పాటు చేశారు. 2500.49 ఎకరాలు యాక్టివేషన్ ఏరియా కింద భూసేకరణ చేపట్టారు. అంతలోనే ప్రభుత్వం మారడంతో భూసేకరణను పక్కనబెట్టారు.

**పరిహారానికి ప్రతిపాదనలు**

తమ్మినపట్నం, కొత్తపట్నం పరిధిలోని భూములకు పరిహారం చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఎకరానికి సుమారు రూ.5.99 లక్షలు చెల్లించి ఆదుకునేందుకు సిద్ధమైంది.

**రూ.1500 కోట్లతో అభివృద్ధి**

తొలి దశలో సేకరించిన భూమిలో రూ.1500 కోట్లతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాం. రూ.13వేల కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చే ఆస్కారం ఉంది. పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్

చురకలు



## 'రాజాసాబ్' డేట్ కు అజిత్ సినిమా..!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "ది రాజాసాబ్". సూపర్ నేచురల్ అంశాలతో కూడిన రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్టైనర్ ఇది. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాని 2025 సమ్మర్ స్పెషల్ గా ఏప్రిల్ 10న గ్రాండ్ గా రిలీజ్ చేస్తామని చాలా రోజుల క్రితమే మేకర్స్ ప్రకటించారు. అయితే ఇప్పుడు దీనికి పోటీగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీని విడుదల చేయనున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం "గుడ్ బ్యాడ్ అగ్లీ". మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఈ భారీ సినిమా రూపొందుతోంది. దీనికి 'మార్క్ ఆంటోనీ' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందు నుంచీ ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ చెబుతూ వచ్చారు. అయితే అజిత్ నటిస్తున్న 'విదా ముయార్చి' మూవీ రేసులోకి రావడంతో వెనక్కి తగ్గారు. ఆ సినిమా కూడా పొంగల్




కు రావడం లేదు. ఈ సంగతి అటుంచితే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాన్ని ఏప్రిల్ 10న థియేటర్లలోకి తీసుకొస్తామని చిత్ర యూనిట్ తాజాగా అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్టర్ ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటోంది. అయితే ఆల్రెడీ ఏప్రిల్ 10వ తేదీన 'ది రాజా సాబ్' సినిమా వస్తుందని ప్రకటించగా.. ఇప్పుడు అదే డేట్ కు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాని లాక్ చేయడం ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ సినిమా రాదని క్లారిటీ వచ్చిన తర్వాతే మైత్రీ టీమ్ రిలీజ్ డేట్ ను ప్రకటించి ఉంటారనే కామెంట్లు కూడా వస్తున్నాయి. రాజాసాబ్ సినిమాకి సీజీ వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల విడుదల ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రీసెంట్ గా సిద్ధూ జొన్నలగడ్డ 'జాక్' చిత్రాన్ని అదే రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు. ఇప్పుడు అజిత్ మూవీ కూడా రేసులోకి వచ్చింది. ఇప్పటికైతే ఒకే తేదీకి మూడు సినిమాలు షెడ్యూల్ చేయబడ్డాయి. రానున్న రోజుల్లో వీటిల్లో మార్పులు ఉంటాయేమో చూడాలి. మాస్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా "గుడ్ బ్యాడ్ అగ్లీ" సినిమా తెరకెక్కుతోంది. ఇందులో అజిత్ కుమార్ సరసన త్రిష కృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకూ జీ, పూర్ణా మార్కెట్, ఎంతవాడు గానీ, గ్యాంబ్లర్, విదాముయార్చి వంటి చిత్రాల్లో నటించారు. సునీల్, అర్జున్ దాస్, రాహుల్ దేవ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఇది నిర్మాతలకు ఫస్ట్ తమిళ్ ప్రాజెక్ట్. దాదాపు రూ. 270 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మరి ఈ సినిమా టాలీవుడ్ ప్రొడ్యూసర్స్ కు ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి.

## 2025 లో దీపికా పదుకొణే జర్నీ ఇలా ఉంటుందా!

దీపికా పదుకొణే కెరీర్ లో గత ఏడాది ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ మధుర జ్ఞాపకం. అమ్మడు పండంటి బిడ్డకు జన్మనిచ్చింది 2024 లోనే. కెరీర్ పరంగానూ ఓ రెండు భారీ విజయాలు దీపిక ఖాతాలో నమోదయ్యాయి. ఫైటర్, కల్కి 2898 లాంటి విజయాలు అందుకుంది. సింగం ఎగైన్ లోనూ పోలీస్ గానూ ప్రేక్షకుల్ని అలరించింది. ఇలా 2024దీపికాకు ఓ స్పెషల్ గా నిలిచిపోతుంది. మరి కొత్త ఏడాదిలో కెరీర్ ఎలా ఆరంభించబోతుంది అంటే ఎలాగూ కల్కి 2898 రెండవ భాగం షూటింగ్ లో పాల్గొంటుంది. తొలుత ఈ ప్రాజెక్ట్ నే దీపిక పూర్తి చేస్తుంది. మొదటి భాగంలో దీపిక పాత్ర బలం ఏంటన్నది అర్దమైంది. రెండవ భాగంలో ఆ పాత్ర మరింత బలంగా పండుతుందని అంచనాలున్నాయి. మరి



ఈ ప్రాజెక్ట్ గాక కొత్త సినిమాలేవి పట్టాలెక్కించదా? అంటే దీపిక నుంచి ఏ మాత్రం క్లారిటీ రావడం లేదు. దీపిక ప్రసవం అయిన నాటి నుంచి ఇంటికే పరిమితమైంది. ఎలాంటి ఈవెంట్లకు హాజరు కావడం లేదు. కొత్త ప్రాజెక్ట్ లకు కమిట్ అవ్వడం లేదు. బిడ్డ ఆలనా, పాలనా చూసుకుంటుంది. కుమార్తెకు సంబంధించిన ప్రతీ అనుభూతిని తల్లిగా తాను అందించాలని సమయంతా పాపాయికే కేటాయిస్తుంది. అయితే మరో మూడు నెలలు పాటు దీపిక ఇదే పనిలో ఉంటుంది. ఆ తర్వాతే మళ్లీ కొత్త ప్రాజెక్ట్ ల విషయంలో జోరు పెంచే అవకాశం ఉంది. దీపిక గర్భం దాల్చిన దగ్గర నుంచి కొత్త ప్రాజెక్ట్ లేవి అంగీకరించలేదు. అప్పటికే కమిట్ అయిన చిత్రాలనే పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో 2025 ద్వితియార్ధం నుంచి దీపిక కొత్త సినిమాలతో జోరు పెంచే అవకాశం ఉంది. ప్రసవం తర్వాత రూపంలో మార్పులు సహజం. ప్రస్తుతం దీపిక మునుపటి బ్యూటీని తీసుకొచ్చే పనిలోనూ పడ్డట్లు సమాచారం. సోషల్ మీడియాకి కూడా అందుకే దూరంగా ఉంటుందని ప్రచారంలో ఉంది.




## రవీనా టాండన్ కూతురు చలిజ్వరం గ్యారెంటీ




90లలో అద్భుతమైన డ్యాన్సర్ గా, వేడెక్కించే డ్యాన్స్ మూవ్స్ తో కుర్రకారు గుండెల్ని టచ్ చేసిన రవీనా టాండన్ ని యూత్ అంత తేలిగ్గా మర్చిపోలేరు. బాలయ్యబాబు బంగారు బుల్లోడు చిత్రంలో రవీనా గ్లామరస్ పాత్రతో మతులు చెడగొట్టింది. చాలా కాలం తర్వాత పూరి జగన్నాథ్ బుడ్డా హోగా తేరా బాప్ చిత్రంలో నటించింది. ఇటీవల కేజీఎఫ్ 2 లోను రవీనా నటనకు మంచి పేరొచ్చింది. బాహుబలి ఫ్రాంఛైజీ సహా చాలా దక్షిణాది చిత్రాలను ఉత్తరాది బెల్ట్ లో విడుదల చేసి భారీగా ఆర్జిస్తున్న టాండన్ ఫిలిం ఎంపైర్‌లో కీలక సూత్రధారిగా రవీనా గురించి చాలా చర్చ సాగుతోంది. ఇటీవల తన కుమార్తె రాషా తడానీని వెండితెరకు పరిచయం చేయడంలో రవీనా బిజీ ప్రణాళికల్లో ఉంది.

ఇప్పటికే రాషా తడానీ అందచందాలకు యూత్ లో భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. రాషాకు సంబంధించిన ప్రతిదీ నేషనల్ మీడియాలో చర్చగా మారుతోంది. ఇప్పుడు స్టార్ కిడ్ డెబ్యూ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. అభిషేక్ కపూర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ఆజాద్‌లో అజయ్ దేవగన్ కజిన్ అమన్ దేవగన్ సరసన రాషా నటిస్తోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మోస్ట్ అవైటెడ్ డ్యాన్స్ ట్రాక్ %-%ఉయి అమ్మ%-% విడుదలై ఆకట్టుకుంటోంది. ఈ పార్టీ సాంగ్ లో రాషా తడాని కిల్లర్ మూవ్స్ హృదయాలను గెలుచుకుంటున్నాయి. రాషా అందమైన డ్యాన్సింగ్ స్కిల్స్ తన తల్లి రవీనా టాండన్ ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు పొగిడేస్తున్నారు. ఆరంగేట్రమే నటవారసురాలు తనదైన ముద్ర వేసింది. ముఖ్యంగా తన అందమైన నడుమును ఊపుతూ రాషా చాలా మాయాజాలం సృష్టించింది. డ్యాన్స్ నంబర్‌లో రాషా తన అద్భుతమైన డ్యాన్స్ కదలికలతో డ్యాన్స్ ఫ్లోర్‌ను మరిగించింది.

ఉయీ అమ్మకు మధుబంతి బాగ్చి స్వరాలు అందించగా, అమితాబ్ భట్టాచార్య సాహిత్యం అందించారు. బోస్కో లెస్లీ మార్టిస్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ ట్రాక్ సాంప్రదాయ, సమకాలీన శైలులను మిళితం చేసిన ప్రత్యేక గీతం అని చెప్పాలి. ఆజాద్ 17 జనవరి 2025న పెద్ద తెరపైకి వస్తుంది.

## సూపర్‌స్టార్ భార్య మతమార్పిడిపై రచ్చ!



ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా కులమతాల గురించి చర్చ సాగుతోంది. సోషల్ మీడియా యుగంలో వేగంగా కులమత విద్వేషాలు చెలరేగే ప్రమాదం పొంచి ఉంది. సెలబ్రిటీలు కొంత ముప్పును ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మతాంతర ప్రేమ వివాహం చేసుకున్న సూపర్‌స్టార్ షారూఖ్‌కి ఇప్పుడు నింద ఎదురైంది. షారూఖ్ మూడు దశాబ్ధాల సంసార జీవనం అనంతరం తన భార్య గౌరీతో మతమార్పిడి చేయించాడనేది నెటిజనుల అభియోగం. అంతేకాదు గౌరీఖాన్ హిజాబ్ ధరించిన ఓ ఫోటోని వైరల్ చేస్తున్నారు.

షారూఖ్ తన భార్య గౌరీ ఖాన్, పెద్ద కుమారుడు ఆర్యన్ ఖాన్‌తో కలిసి మక్కాలో ప్రార్థనలు చేస్తున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో గౌరీ నలుపు కుర్తీ , బూడిద రంగు హిజాబ్ ధరించి కనిపిస్తోంది. మరోవైపు కింగ్ ఖాన్ తెల్లటి కుర్తాలో సింపుల్ గా ఉన్నాడు. ఆర్యన్ కూడా వారి వెనుక నిలబడ్డాడు. ఈ ఫోటో వైరల్ కాగానే ఖాన్ కుటుంబం మక్కాలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించిందరని పలువురు నెటిజనులు పేర్కొన్నారు. ఇది మాత్రమే కాదు షారూఖ్ భార్య గౌరీ కూడా ఇస్లాం మతంలోకి మారిందని కొందరు పేర్కొన్నారు. అయితే ఇప్పుడు వైరల్ అవుతున్న ఫోటో వెనుక అసలు నిజం బయటపడింది. నిజానికి మక్కాలో ఖాన్ కుటుంబం వైరల్ ఫోటో పూర్తిగా ఫేక్. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ఫోటో అని ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది. బాలీవుడ్ లో సూపర్‌స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకున్న షారుఖ్ ఖాన్ ముస్లిం అయితే, గౌరీ ఇంటీరియర్ డిజైనర్ గా సుప్రసిద్ధురాలు. గౌరీ పంజాబీ హిందూ కుటుంబంలో జన్మించింది. ఈ జంట 1991లో పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు - ఆర్యన్, సుహానా ఖాన్, అబ్రామ్ ఖాన్ ఉన్నారు. తమ ప్రేమ వివాహంలో ఏవైనా చిక్కులు ఉన్నాయా? అనే ప్రశ్నకు 2005లో కాఫీ విత్ కరణ్‌లో గౌరీ స్పష్టతనిచ్చారు. తామిద్దరం మతానికి అతీతంగా ఒకరికొకరు గౌరవించుకుంటామని గౌరీ తెలిపారు. నేను ముస్లిమ్ గా మారనవసరం లేదు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా వారి మతాన్ని అనుసరిస్తారు. పరస్పర గౌరవం అవసరం. షారూఖ్ నా మతాన్ని ఎప్పటికీ అగౌరవపరచడు.. నేను అతడిని అగౌరవపరచను... అని గౌరీఖాన్ తెలిపారు. కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. షారుక్ ఖాన్ తదుపరి కింగ్‌లో నటిస్తున్నారు.. ఈ సినిమాలో ఆయన కూతురు సుహానా ఖాన్ కీలక పాత్రను పోషిస్తుండగా, అభయ్ వర్మ ఒక ప్రధాన పాత్రను పోషిస్తున్నారు.

కింగ్ చిత్రానికి వాస్తవంగా సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించాల్సి ఉండగా, ఇప్పుడు పఠాన్ ఫేం సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా రిలీజ్ తేదీ ఇతర వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## మైనస్ 30 డిగ్రీల చలిలో బికినీ బ్యూటీ సాహసం

మ్యూజిక్ వీడియోలు, మోడలింగ్ అసైన్ మెంట్స్ తో పాపులారిటీ పెంచుకుంది ముంబై బ్యూటీ సాక్షి మాలిక్. ఫిట్‌నెస్ వీడియోలతోను ఇన్‌స్టాలో ఫాలోయింగ్ పెంచుకుంది. ఈ బ్యూటీ కార్తీక్ ఆర్యన్ నటించిన సోను కే టిటు కి స్వీటీలో బోమ్ డిగ్గీ డిగ్గీ... పాటలో మెరుపులు మెరిపించింది. సాక్షి స్టన్నింగ్ అప్పియరెన్స్ ఇప్పటికీ యూట్యూబ్ లో కుర్రకారుకు స్పెషల్ ట్రీట్ అనడంలో సందేహం లేదు. సాక్షి సోషల్ మీడియాల్లోను స్పీడ్ గా ఉంది. ఇన్ స్టాలో లక్షల్లో ఫాలోవర్స్ ని సంపాదించిన ఈ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లతో వేడెక్కిస్తోంది. తాజాగా సాక్షి పింక్ బికినీలో స్పెషల్ ఫోటోషూట్‌ని షేర్ చేసింది. ఈ ఫోటోలలో రకరకాల భంగిమల్లో సాక్షి ఇచ్చిన ట్రీట్ యువతరం హృదయాలను దోచుకుంది. పింక్ బికినీలో సాక్షి అందాల జాతార ఫిదా చేస్తోంది. మైనస్ 30 డిగ్రీల చలిలో బికినీ షూట్ లో పాల్గొన్నట్టు సాక్షి తెలిపింది. గత వారం 30 డిగ్రీల వేడి వాతావరణంలో ఉన్నాను. ఇప్పుడు చలికి గడ్డకట్టే వాతావరణంలో ఫోటోషూట్ లో పాల్గొన్నట్టు వెల్లడించింది. ఈ ముంబై బ్యూటీ టాప్



మోడల్ గా టీవీ కమర్షియల్స్ తో ఆడియెన్ కి చేరువైంది. మారుతి ఆటో ఎక్స్ పో-2020 వేదికపై బ్రాండ్ అంబాసిడర్ గా హృదయాలను దోచుకుంది. ఆ తర్వాత సాక్షి సినీరంగంపై దృష్టి సారించింది. సాక్షి మాలిక్ ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించింది. నోయిడాలోని జేపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని పూర్తి చేసింది. కళాశాల సమయంలో ఆమె ఫ్యాషన్ షోలలో పాల్గొన్నది. గ్రాడ్యుయేషన్ తర్వాత, సాక్షి మాలిక్ ముంబైకి వెళ్ళింది. నైకా, పిసి జ్యువెలర్‌తో సహా బ్రాండ్‌ల టెలివిజన్ వాణిజ్య ప్రకటనల కోసం మోడలింగ్ చేసింది.. 2018లో సోను కే టిటు కి స్వీటీ లో నటిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. 2020 తెలుగు సినిమా వి (నాని-ఇంద్రగంటి-సుధీర్ బాబు)లో కమర్షియల్ సెక్స్ వర్కర్ గా తన ఫోటోని ఉపయోగించుకున్నారు. దీనికి అభ్యంతరం చెబుతూ సాక్షి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. మార్చి 2021లో హైకోర్టు అమెజాన్ ప్రైమ్‌ను ఆ సినిమాను తొలగించాల్సిందిగా ఆదేశించింది. అనుమతి లేకుండా ఫోటోను ఉపయోగించినందున సాక్షి కేసు ఫైల్ చేసింది. అటుపై వి సినిమాని ఓటీటీ నుండి తొలగించారు. అయితే వివాదాన్ని మేకర్స్ మాట్లాడి పరిష్కరించుకున్నారు. 2020లో వేహం.. 2023లో ములాఖత్ అనే ఆల్బమ్స్‌లో కనిపించింది.

## ఆరోజే మాళవికలో నటిని గుర్తించిన మిస్టర్‌పర్ఫెక్ట్

మాళవిక మోహనన్ పరిచయం అవసరం లేదు. 2024 కోలీవుడ్ బ్లాక్ బస్టర్ తంగళన్‌లో నటించింది. చియాన్ విక్రమ్ సినిమాలో కీలక పాత్రతో అదరగొట్టేసింది. మాళవికలో వెర్సటైలిటీకి వీరాభిమానులేర్పడ్డారు. అంతకుముందు మాస్టర్, పేట లాంటి భారీ చిత్రాల్లో మాళవిక నటనకు మంచి పేరొచ్చింది. కోలీవుడ్ లో నటించే సమయంలోనే టాలీవుడ్ లోను మాళవిక చేయని ప్రయత్నం లేదు. తెలుగులో పలువురు హీరోల సినిమాలకు కమిటైంది. దేవరకొండతో హీరో అనే చిత్రంతో ఈపాటికే తెలుగు చిత్రసీమకు పరిచయం కావాల్సి ఉన్నా, ఆ సినిమా షూటింగ్ మధ్యలోనే ఆగిపోయింది. కానీ ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ సరసన టాలీవుడ్ కి పరిచయమవుతోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజా సాబ్ లో మాళవిక కథానాయికగా నటించింది. రాజా సాబ్ త్వరలోనే



విడుదల కానుంది. ఇంతలోనే మాళవిక గురించి కొన్ని కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మోహనన్ కుమార్తెగా మాళవికకు అన్ని పరిశ్రమలలోను ప్రముఖులతో అనుబంధం ఉంది. అలా బాలీవుడ్ లోను మాళవిక ఫేమస్. ముఖ్యంగా బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ లాంటి స్టార్ తనను చిన్నప్పుడే గుర్తించారు. కాలేజీ అమ్మాయిగా ఉన్నప్పుడే తను మంచి నటిని కాగలనని అమీర్ ఖాన్ అన్నారట. తలాష్ సెట్స్‌లో కలిసినప్పుడు మాళవికలో ప్రతిభను అమీర్ గుర్తించారు. ఈ విషయాన్ని మాళవిక ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అమీర్ మెచ్చుకోవడంతో నిజంగా మాళవిక నటిగా స్ఫూర్తిని పొందింది. మలయాళం, తమిళం, హిందీ పరిశ్రమలలో మాళవిక పెద్ద స్టార్ గా నిరూపించుకోవాలని తపిస్తోంది. ముఖ్యంగా తెలుగులో ఇతర స్టార్ హీరోయిన్లకు ధీటుగా పోటీపడాలని భావిస్తోందట. ఇక్కడ పెద్ద హీరోల సరసన అవకాశాల కోసం సీరియస్ గా ప్రయత్నిస్తోంది. అయితే అన్నిటికీ రాజా సాబ్ సమాధానం. ఈ సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకుని, తదుపరి పెద్ద ప్లానింగ్ తో ముందుకు సాగాలని ఆలోచిస్తోందట.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536